

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-7-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 160 పేజీలు: 12 వెల: 6.50



**బీహార్ ఓటరు జాబితా సవరణకు సుప్రీం ఓకే**

**బ్రెజిల్ సహా 8 దేశాలపై ట్రంప్ భారీగా సుంకాలు**

5లో


## విప్లవాత్మక మార్పులతో

# నాణ్యమైన విద్య

### కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు

### టీచర్లతోపాటు తల్లిదండ్రులకూ కీలకపాత్ర

### గురుపూర్ణిమ సందర్భంగా 61 వేల స్కూళ్లలో పేరెంట్, టీచర్ మీట్

### కొత్తచెరువులో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ. 2 కోట్లు: సిఎం చంద్రబాబు



గురువారం కొత్తచెరువులో జరిగిన మెగా పిటిఎం సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. చిత్రంలో మంత్రి లోకేష్

**శ్రీ సత్య సాయి జిల్లా, జులై 10, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రస్తుత ఆధునిక కాలానికి అనుగుణంగా విప్లవాత్మకమైన మార్పులతో నాణ్యమైన విద్యను అందించడమే ఎన్డీఎ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గురువారం శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువు మండల కేంద్రంలోని శ్రీ సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన మెగా పేరెంట్ టీచర్స్ మీట్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలాలను తీర్చి దిద్దుతామన్నారు. గురుపౌర్ణమి రోజున రాష్ట్ర వ్యాప్తంగా 61 వేల పాఠశాలల్లో 2.28 కోట్ల మందితో ఈ సమావేశం నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాలలు ఆధునిక దేవాలయాలని, జ్ఞానాన్ని అందించే పుణ్యక్షేత్రాలనీ >>2



సిద్ధూ రూపొందించిన మోటారు సైకిల్ తొక్కుతున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

# విద్యార్థులలో సృజనాత్మకత పెంచాలి

### తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలి: డిప్యూటీ సిఎం పవన్

### సిద్ధూ సైకిల్ తొక్కిన ఉపముఖ్యమంత్రి

**విజయవాడ జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వృద్ధిచేయడం తల్లి దండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయంతో సాధ్యమగుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర వ్యాప్తంగా మెగా పిటిఎం 2.0 పేరెంట్స్, టీచర్ల మెగా సమావేశాల సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. ఆ మేరకు ఆయన కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. పిల్లలను బడికి పంపడంతో తల్లిదండ్రుల బాధ్యత ఆగిపోదన్నారు. వారి అధ్యయనం, నడవడిక ఇతరంశాలు పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల బోధనతో పాటు, వారి వ్యక్తిత్వ నిర్మాణంలో కీలకంగా వ్యవహరించాలన్నారు. విద్యా ర్థుల తల్లిదండ్రులు., ఉపాధ్యాయులు ఈ అంశాలపై చర్చించాలన్నారు. తద్వారా విద్యార్థి ఆసక్తిని గుర్తించి ఆ దిశలో ప్రోత్సహించవచ్చునన్నారు, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యవంత మైన సమాజ నిర్మాణం దిశలో ఆసక్తి పెంచాలన్నారు. ప్రతి విద్యార్థిలో క్రియేటివిటీ ఉంటుంది. అది గుర్తించి వారికి అండగా నిలవాలన్నారు.

**బ్యాటరీ సైకిల్‌ను రూపొందించిన సిద్ధూని అభినందించి, రూ.లక్ష ప్రోత్సాహకం అందజేత**

అతి తక్కువ ఖర్చుత బ్యాటరీతో నడిచే సైకిల్‌ను రూపొందించిన విజయనగరం >>2

## జనగణనకు ప్రభుత్వం అనుమతి

**విజయవాడ, జులై10, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో జనగణన చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. 2027 మార్చి 1 నుంచి ఎపి వ్యాప్తంగా జనగణన ప్రక్రియ ప్రారంభంకానుంది. ఈ మేరకు ఈరోజు (గురువారం) జిఎడి ముఖ్య కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ ఆదేశాలు జారీచేశారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జనగణన గెజిట్ నోటిఫికేషన్‌ను సర్కార్ తిరిగి ప్రచురించింది. 2027లో దేశవ్యాప్తంగా జనగణన నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. జనగణన కోసం ఈ ఏడాది జూన్ 16న కేంద్ర హోం శాఖ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. 2027 మార్చి 1 నుంచి దేశవ్యాప్తంగా జనగణన ప్రారంభంకానుంది. అదేరోజు ఎపి వ్యాప్తంగాకూడా జనగణన ప్రక్రియ మొదలుకానుంది. భారత జనాభా లెక్కల ప్రక్రియను రెండు దశల్లో నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. మొదటి దశ అక్టోబర్ 1, 2026 నుంచి మొదలుకానుంది. తొలిదశలో జమ్మూ కశ్మీర్, లడఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో జనగణన జరుగనుంది. ఇక రెండవ దశ మార్చి 1, 2027 నుంచి దేశంలోని మిగిలిన రాష్ట్రాల్లో జనగణన ప్రక్రియ ప్రారంభమవుతుంది.

## జగన్ పర్యటన షరతుల ఉల్లంఘనపై 3 కేసులు

**చిత్తూరు, జులై 10 ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం బంగారుపాళ్యం మామిడి మార్కెట్ యార్డులో మామిడి రైతులను పరామర్శించడానికి వచ్చిన సందర్భంలో పోలీసులు విధించిన షరతులను ఉల్లంఘించడంతో బంగారుపాళ్యం పోలీసులు గురువారం మూడు కేసులు నమోదు చేశారు. వైఎస్ జగన్ బంగారుపాళ్యంకు వచ్చి మామిడి రైతులను పరామర్శించడానికి ప్రభుత్వం మొదట అనుమతి ఇవ్వలేదు. హెలిప్యాడ్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వకపోవడంతో వైఎస్ జగన్ నేరుగా రోడ్డు మార్గంలో బంగారుపాళ్యం రావడానికి సిద్ధం కావడంతో చివరి నిముషంలో జిల్లా అధికార యంత్రాంగం బంగారు పాళ్యం మండలం కొత్తపల్లి గ్రామ సమీపంలో అనుమతి ఇచ్చారు. అలాగే వైఎస్ జగన్ బంగారుపాళ్యం కొత్తపల్లిలో హెలిప్యాడ్‌లో దిగినపుడు కేవలం 30మంది వైఎస్సార్సీ నాయకులు మాత్రమే హాజరై >>2

## రజత్ భార్గవ్‌కు సిట్ నోటీసులు

### మద్యం కుంభకోణం కేసు

**విజయవాడ, జులై10, ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసు కీలక మలుపు తిరిగింది. గత ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన విశ్రాంత ఐఎస్ అధికారి రజత్ భార్గవకి సిట్ అధికారులు నోటీసు జారీ చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు విజయవాడ లోని సిట్ కార్యాలయానికి విచారణకు రావాలని అందులో పేర్కొన్నారు. డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి వైకాపా మద్యం ముఠా ముడుపులు కొల్లగొట్టేందుకు వీలుగా అడ్డగోలు విధాన నిర్ణయాలు తీసుకొని, ఉత్తర్వులు ఇచ్చి ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించారని రజత్ భార్గవ్‌పై అభియోగాలున్నాయి. 'అప్పటి వైఎస్సార్సీ ఎంపీ వి. విజయసాయి రెడ్డి సిఫార్సుల మేరకు ఎపి స్టేట్ బేవరేజెస్ కార్పొరే >>2

# కరవు నివారణకు శాశ్వత చర్యలు

### వచ్చే పదేళ్లకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేయండి

### వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### కేంద్రంనుంచి పూర్తి సహకారం: కేంద్ర వ్యవసాయమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్





సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చిత్రంలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

**పుట్టపర్తి, జులై 10 ప్రభాతవార్త :** క్షేత్రస్థాయిలో పని చేసే అధికారులకు ఎక్కడ ఎలాంటి లోపాలు ఉన్నాయనేది క్షుణ్ణంగా తెలుసని, వాటిని ఏ విధంగా ఎదుర్కోవాలి, ఎలా అధిగమించవచ్చు అనేది కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో కరువుకు శాశ్వత పరిష్కారం ఏ విధంగా తీసుకురావచ్చు అనేదానిపై దృష్టి పెట్టాలని కేంద్ర వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి శాఖా మాత్యులు శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి పట్టణం, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో దక్షిణ ఆంధ్ర ప్రదేశ్‌లోని కరువు పీడిత జిల్లాల సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం పుట్టపర్తి మండలం, పెడబల్లి గ్రామ పొలాల్లో రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలతో జరిగిన ముఖాముఖి సమావేశంలో కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో కేంద్ర మంత్రితోపాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు, రాష్ట్ర హార్టికల్చర్ అండ్ సిరికల్చర్ కమిషనర్ కె.శ్రీనివాసులు, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్, అనంతపురం జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, కర్నూలు జాయింట్ కలెక్టర్ నవ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాలలో కరువును శాశ్వతంగా పరిష్కరించాలన్నదే తమ ఉద్దేశంఅన్నారు. వ్యవసాయ అనుబంధరంగాల అధికారులు కలిసికట్టుగా కూర్చుని ఆలోచన చేయాలని, అలాగే కేంద్రంతో కూడా కరువు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది ఆలోచించాలన్నారు. అధికారులు ఆయా జిల్లాల యంత్రాంగంతో కలిసి వివిధ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తమ ఆధ్వర్యంలో రూరల్ డెవలప్‌మెంట్, ఎన్ఆర్ఇజిఎస్, వాటర్ షెడ్, తదితర వాటి కింద ఎలాంటి చర్యలు తీసుకోవచ్చు, ఇతర శాఖలకు సంబంధించి ఎలాంటి సహకారం కావాలన్నా తాము అందించడం జరుగుతుందన్నారు. ఇప్పుడు ఏం చేయాలి, రేపు, భవిష్యత్తులో ఏం చేయాలి, వచ్చే పదేళ్లకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనేదానిపై కార్యచరణ ప్రణాళిక తయారు చేయాలని సూచించారు.

ఈ విషయం అధికారులు అంతా కలిసికట్టుగా కూర్చుని తగిన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ఏమైనా ఆలోచనలు ఉంటే తెలియజేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ మోడల్ తయారుచేసి కరువు నివారణకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర >>2

## మళ్లీ విచారణకు హాజరుకండి

### విజయసాయికి సిట్ నోటీసులు

**విజయవాడ,జులై10,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం ముడుపులో కేసులో మరోసారి విచారణకు రావాలని మాజీ ఎంపీ విజయసాయి రెడ్డికి సిట్ అధికారులు 179 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ ప్రకారం నోటీసులు జారీ చేశారు. ఈనెల 12వ తేదీన ఉదయం 10గంటలకు విజయవాడ సిపి రెండవ అంతస్తులో ఉన్న సిట్ కార్యాలయానికి రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. రాజ్ కెసిరెడ్డిని అరెస్ట్ చేసినతర్వాత ఈకేసులో విజయసాయి రెడ్డినికూడా ఎఫ్ఐఆర్‌లో నిందితు డిగా సిట్ చేర్చింది. గతంలో కాకినాడ పోర్టు వాటాల కేసులో సిఐడి విచారణకు హాజరైన సమయంలో మొదటిసారి మద్యం ముడుపుల కుంభకోణంపై నోరు విప్పారు. కుంభకోణం కీలక పాత్రధారి, సూత్రధారి, కర్త, కర్మ, క్రియ కెసిరెడ్డి రాజశేఖరరెడ్డి అని మీడియా ముందు బహిరంగంగా విజయసాయి రెడ్డిచెప్పారు. మద్యం నూతన పాలసీకి సంబంధించి మొదటి సమావేశం హైదరాబాద్ జర్నలిస్ట్ కాలనీలోని తన నివాసంలో, రెండవ సమావేశం తాడేపల్లిలోని తన నివాసంలో జరిగిందని విజయసాయి రెడ్డి మీడియాకుతెలిపారు. అప్పటికి విజయసాయిరెడ్డిని కేసులో నిందితుడిగా చేర్చలేదు. ప్రస్తుతం విజయసాయిరెడ్డిని రెండోసారి విచారణకు రావాలని సిట్ అధికారులు నోటీసులివ్వటం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ధాన్యం బకాయిలు

# రూ. 659.39 కోట్లు జమ



గురువారం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల

### 100% సొమ్మును రైతు ఖాతాల్లో జమచేశాం

### నాడు మనిషిని తొక్కించారు.. నేడు మామిడి కాయలు తొక్కించారు

### రైతు పక్షాన ప్రశ్నించే మనస్తత్వం ఉంటే చర్చకు రండి : మంత్రి నాదెండ్ల

**గుంటూరు, ప్రభాతవార్త ప్రతినిధి, జులై 10:** రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఖరీఫ్, రబీ 2024-25 సీజన్లో 2,01,934 రైతుల వద్ద నుండి 4575.32కోట్ల విలువగల 19,84,098 మెట్రిక్ టన్నుల ధాన్యమును కొనుగోలు చేయటమైందని రాష్ట్ర పౌర సరఫరాల మంత్రినాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం తెనాలిలో మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మునుపెన్నడూ లేని విధంగా ధాన్యము కొనుగోలు చేసిన 24గంటల నుంచి 48గంటలలోపే నగదు రైతుల యొక్క ఖాతాలలో నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలు బకాయిలనిమిత్తం ది.10-07-2025న రూ.659.39 కోట్లరూపాయలను30,403 రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని తెలిపారు. దేశంలో మొదటిసారి 2024-2025 మొత్తము ఇప్పటివరకు 4575.32 కోట్ల రూపాయలను 2,01,934 రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని మంత్రి వెల్లడించారు. 100 శాతం సొమ్మును రైతుల ఖాతాలలో జమ చేశామన్నారు. గడిచిన రబీకాలంలో 2021-22 లో 2,29,248 రైతుల నుంచి 26,23,535 కోట్ల రూపాయల విలువ గల 5,099.62 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడంజరిగిందని చెబుతూ, రబీ 2022-23 కాలంలో 1,58,784 రైతుల నుంచి 2,884.04 కోట్ల రూపాయల విలువ గల 14,12,881 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం జరిగింది. రబీ 2023-24లో1,32,859 రైతులనుంచి 2,763.86 కోట్ల రూపాయలు విలువగల 12,64,845 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం జరిగిందని మంత్రి వెల్లడించారు. ఖరీఫ్ సీజన్లో 2024-25: 5,65, 662 మంది రైతుల నుండి 35.94 లక్షల మెట్రిక్ టన్నుల వరినిసేకరించారు, దీనివిలువ రూ.8282. 27 కోట్లు.24 గంటలనుంచి 48 గంటల్లోపు 5,65,662 మందిరైతులకు మొత్తం రూ.8282. 27 కోట్లు రూపాయలు చెల్లించడం జరిగింది. మొత్తం 24.31 లక్షల మెట్రిక్ టన్నుల బియ్య ము ను స్వీకరించడం జరిగిందని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు.

**రైతు పక్షాన నిజాయితీగా ప్రశ్నించే తత్వం ఉంటే ...చర్చకు రండి:** ఒక పార్టీ అధినేత చిల్లర మనస్తత్వంతో గతంలో మనిషిని తొక్కించారని, చిత్తూరు జిల్లా పర్యటనలో ఐదు ట్రాక్టర్లతో రెడీ చేసుకున్న పంటను దొంగ చాటుగా తీసుకువచ్చి రోడ్డుపై మామిడి కాయలు పోసి కేవలం ఫోటోలు కోసం వీడియోలు కోసం రైతు పండించిన పంటను ట్రాక్టర్లతో తొక్కియడం దుర్మార్గం అన్నారు. రాజకీయాల్లో ప్రశ్నించే మనస్తత్వంఉంటే, రైతుపక్షాననిజాయితీగా ప్రశ్నించే తత్వం ఉంటే చర్చకురండి అని నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోశాంతిభద్రతల విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని హెచ్చరించారు.

# దేశానికే ఆదర్శంగా శ్రీకాకుళం

### ప్రజలు జిల్లానుంచి వలసపోకుండా చర్యలు

### అభివృద్ధి కార్యక్రమాల కోసం పెట్టుబడిదారులు ముందుకు రావాలి

### మెగా పేరెంట్, టీచర్‌డే సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



గురువారం గార జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్ టీచర్ డే సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం, జూలై 10 ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లాను దేశానికే, ప్రపంచానికే ఆదర్శంగా నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. వలసల జిల్లాగా పేరుపడ్డ శ్రీకాకుళం నుంచి ఇకపై ఎవరూ బయటకు వెళ్లకుండా ఇక్కడే పని చేసుకునేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. గురువారం గార జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్ టీచర్ డే సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైనసందర్భంగా ఆయన ఈవ్యాఖ్యలు చేశారు. 'శ్రీకాకుళంజిల్లాను పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేయాల్సిఉంది. పెట్టుబడిదారులు ఆనందంగా ముందుకు రావాలంటే మన దగ్గర నైపుణ్యం ఉన్న మానవ వనరులు అవసరం. పెద్ద అవకాశాలను దక్కించుకోవాలంటే ఉన్నత చదువులు అవసరం' అని రామ్మోహన్ నాయుడు అన్నారు. పాఠశాలల్లో ఎలాంటి సమస్యలున్నా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

**నాన్న చదువుకున్న బడికి రావడం ఆనందం:** 'మా నాన్న, స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు ఇదే పాఠశాలలో చదువుకున్నారు. నేను ఇక్కడికి రావడానికి ఇదే ప్రధాన కారణం' అని రామ్మోహన్ నాయుడు భావోద్వేగంగా చెప్పారు. విద్యార్థుల అభ్యున్నతికి అన్ని రకాలుగా కృషి చేస్తున్నామని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన >>2

# నిండుకుండలా 'తుంగభద్ర'

## ఎగువ కాలువకు నీటి విడుదల

**అనంతపురం, జులై 10(ప్రభాత వార్త బ్యూరో):** ఆంధ్ర, కర్ణాటక ఉమ్మడి ప్రాజెక్టు తుంగభద్ర జలాశయం నిండుకుండలా ఉంది. జలాశయంలో 105 టిఎంసిల నీటి నిల్వగాను ఇప్పటికే 75.93 టిఎంసిల నీరు ఉంది. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు వస్తున్నాడంతో తుంగభద్ర జలాశయంలోకి తుంగ, భద్ర ఉపనదుల నుంచి మీరు ఎక్కువగా వస్తోంది. గురువారం రోజు తుంగభద్ర జలాశయంలోకి 46,955 క్యూసెక్కుల నీరు వస్తుండగా అంతే నీటిని అంటే 45,500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఇందులో భాగంగా తుంగభద్ర జలాశయం నుంచి ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కి నీటిని తుంగభద్ర బోర్డు అధికారులు గురువారం విడుదల చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అధికారులు నీటిని విడుదల చేశారు. తుంగభద్ర బోర్డు సెక్రెటరీ ఓ.ఆర్.కే రెడ్డి, ఎస్ఇ నారాయణ నాయక్, హెచ్చెల్సీ ఇఇ చంద్రశేఖర్ డ్యాంలో స్విచ్ ఆన్ చేసి తుంగభద్ర ఎగువ >>2





గురువారం కొత్తచెరువులో జరిగిన మెగా పిటిఎం సమావేశంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

# నాణ్యమైన విద్య

>> పాఠశాలను రక్షించుకునే బాధ్యత మనందరిదీ అన్నారు. విద్యార్థుల అభివృద్ధిలో ఉపాధ్యాయులే కాదు తల్లిదండ్రులు కూడా కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రతి పిల్లవాడికి తల్లి మొదటి గురువు అని ఉపాధ్యాయులు ఇచ్చిన హోంవర్క్‌ను తల్లిదండ్రులు వారి ఇంటి వద్ద పూర్తిచేసేలా బాధ్యత తీసుకోవాలన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటానని ప్రజల సేవలు అందిస్తానని స్పష్టం చేశారు. ఎవరైనా గంజాయి ఇతర్రతా మత్తు పదార్థాలను ప్రోత్సహించినా, తమ పొలాల్లో గంజాయి సాగు చేసిన వారి ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు. వారికి ఎటువంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించకుండా రద్దు చేస్తామని హెచ్చరించారు. తాను ఆడబిడ్డల సంక్షేమం కోసం ద్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసింది తనని గుర్తు చేశారు. మహిళల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని భవిష్యత్తులో కూడా వారి అభివృద్ధికి కృషిచేయడం లేకుండా కృషి చేస్తానన్నారు. పిల్లల తల్లిదండ్రులు మొత్తం బాధ్యతను ఉపాధ్యాయులపైన నెట్టకుండా ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులతో వారి విద్యపై ఆరా తీయడం వల్ల మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. లోకేష్ పాఠశాలలో ఉన్నప్పుడు పేరెంట్స్ మీటింగ్‌కు నేను ఎప్పుడూ వెళ్లలేకపోయానని, నా సతీమణి భువనేశ్వరి ఏ సమావేశాన్ని విడిచిపెట్టకుండా వెళ్లి లోకేష్‌ను స్టాన్ ఫర్డ్ యూనివర్సిటీ వరకూ చదివించిందని శ్రద్ధ పెట్టారన్నారు. కుటుంబంలో ఉన్న ప్రతీ పిల్లవాడినీ చదివించాలని, తల్లిపైన పిల్లలకు గౌరవభక్తులు పెరగాలనే లక్ష్యంతో తల్లికి వందనం పథకాన్ని ప్రతి ఒక్క విద్యార్థికి వర్తింపజేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నో వేకెన్సీ బోర్డు పెట్టే స్థితికి తీసుకువచ్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యాశాఖ బాధ్యతను లోకేష్ ఏరికోరి తీసుకున్నారు. మొదటి దఫా పేరెంట్ టీచర్ మీటింగ్‌ను 44 వేల పైచిలుకు పాఠశాలల్లో నిర్వహించామని, ఈసారి ప్రైవేటు స్కూళ్లలోనూ వీటిని నిర్వహించాలని ఆదేశించామన్నారు. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.0కు 2.28 కోట్ల మంది హాజరయ్యారని, గిన్నిస్ రికార్డు సాధించేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టమన్నారు. తల్లిపేరిట ప్రతీ విద్యార్థి ఒక మొక్క నాటేలా చర్యలుతీసుకున్నాం. వారికి గ్రీన్ పాస్ పోర్టు కూడా ఇచ్చామన్నారు.తల్లిదండ్రులు లీప్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. పాఠశాలల్లోకి రాజకీయాలు రాకూడదన్న ఉద్దేశంతో విద్యార్థులకు ఇచ్చిన కిట్లపై ఎలాంటి వ్యక్తుల ఫోటోలు పెట్టలేదని, రూ.980 కోట్లు వీటి కోసం వ్యయం చేయడం జరిగిందన్నారు. తాను చదువుకున్న రోజుల్లో రాను పోను 12 కిలోమీటర్ల మేర నడిచేవాడినని, ప్రస్తుతం అలాంటి దుస్థితి లేదన్నారు. నాణ్యమైన సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతున్నట్లు తెలియజేశారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేలా చాగంటి కోటేశ్వరరావును విద్యాశాఖ సలహాదారుగా నియమించినట్లు తెలియజేశారు. మిస్సైల్ మాన్ అబ్దుల్ కలాం, రాజ్యాంగ రూపకర్త అంబేద్కర్ లాంటి వ్యక్తులు మనకు స్ఫూర్తి కావాలన్నారు. గతంలో 12 సార్లు డీఎస్సీలు నిర్వహించి 1.66 లక్షల ఉపాధ్యాయులను నియమించామని, గత ప్రభుత్వం ఒక్క డీఎస్సీ కూడా చేపట్టలేదన్నారు. విద్య వ్యవస్థ కూడా కొలుపోయిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక మెగా డీఎస్సీ నిర్వహించి 16,347 మంది ఉపాధ్యాయులను ఆగస్టులోపు నియమిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించాం. విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేలా షైనింగ్ స్టార్స్ అవార్డులు ఇస్తున్నామని, షైనింగ్ స్టార్స్ ఉన్న విద్యార్థులు అందరికీ నచ్చిన కాలేజీల్లో చదువుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కొత్తచెరువులో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేస్తానన్నారు. పిల్లల కొరకు ఒక ఎకరం భూమి సంపాదించే కంటే వారిని బాగా చదివిస్తే ఊహించని విధంగా వారి జీవితాల్లో మార్పు వస్తుందన్నారు.భవిష్యత్ అంతా నాలెడ్జ్ ఎకానమీదే. దానికి అనుగుణంగా మన విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారిని బాగా చదివించాలని వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి.కె.పార్థసారధి, పుట్టపర్తి శాసన సభ్యురాలు పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, విద్య శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ కోన శశి ధర్, జిల్లా కలెక్టర్ టీ.ఎస్. చేతన్, జిల్లా ఎస్పీ వి.రత్న, జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీవో సువర్ణ, ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ పాఠశాల హెచ్ఎం గోపాల్, విద్యార్థిని, విద్యార్థులు వాటి తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వ్యవసాయ క్షేత్రంలో రైతులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్, మంత్రి అచ్చెన్నాయుడు

# కరవు నివారణకు శాశ్వత చర్యలు

>> ప్రభుత్వం కూడా కరువు నివారణ చర్యలపై దృష్టి పెట్టాలని, కేంద్రం కూడా ఇందుకు సహకారం అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాలు, ఉద్యాన శాఖ పరిధిలో పరిస్థితుల గురించి తెలియజేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు, రాష్ట్ర హార్టికల్చర్ అండ్ సిరికల్చర్ కమిషనర్ కే.శ్రీనివాసులు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలలో కరువు పరిస్థితి, వివిధ పంటల సాగు వివరాలు, ఇరిగేషన్ అంశాల గురించి ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. బుందేల్ఖండ్ రీజియన్ మాదిరిగా రాయలసీమ జిల్లాలకు కూడా ఆర్థిక సహాయం ప్రకటించాలని, సీమ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. ఇక్కడ జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ సూచించిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. "ప్రకృతి వ్యవసాయంలో ఖర్చు తక్కువ, లాభం ఎక్కువ. ఇది దేశానికి ఆదర్శంగా మారుతుంది" అని మంత్రి గారు పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి, తక్కువ భూమిలోనూ అధిక లాభాన్ని సాధించవచ్చని, దీనివల్ల చిన్న రైతులకు అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు.మహిళా సంఘాల సోదరీమణులు ఇప్పుడు స్వయం సమర్థులవుతున్నారు. తాను మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభించిన "లాడ్లీ బహనా యోజన'ను గుర్తు చేస్తూ, మహిళల సాధికారతకు నేను ప్రాధాన్యం ఇస్తానన్నారు. ఈ సందర్భంగా పుట్టపర్తి, అనంతపురం.. ఉమ్మడి జిల్లాలకు చెందిన 53,746 ఎస్ హెచ్ జి సభ్యులకు రూ.437.09 కోట్ల బ్యాంకు లింకేజ్ చెక్కును అందించారు అంతకు ముందు పెడబల్లి గ్రామంలో సేంద్రీయ పద్దతిలో సాగు చేసిన మిశ్రమ పంటను పరిశీలించారు. అలాగే వర్షాభావం వల్ల ఎండిన పంటలపై ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను తిలకించారు. ముందుగా ఎస్ హెచ్ జి మహిళల ప్రార్థనతో కార్యక్రమం ప్రారంభమైంది ఈ కార్యక్రమంలో జేసి అభిషేక్ కుమార్,భారత ప్రభుత్వ రైతుల సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ పేర్ని దేవి, రాష్ట్ర సేర్ప్ సీ.ఈ.ఓ వి.కరుణ,ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వపు అగ్రికల్చర్, మార్కెటింగ్, సహకార సంస్థ చైర్మన్ టి. విజయ్ కుమార్,డిఆర్డీఏ పీడి నర్సయ్య, రైతులు, మహిళా సంఘ సభ్యులు, రాయలసీమ జిల్లాల వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు,తదితరులు పాల్గొన్నారు.

# విద్యాశాఖను సవాలుగా స్వీకరించా

## మంగళగిరిలో ఓడి గెలిచా..

### డొక్కా సీతమ్మ పేరుతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం

### విలువలతో కూడిన విద్యకోసమే సలహాదారులుగా చాగంటి

### ప్రతి తరగతికి టీచర్ ఉండేలా చర్యలు: మంత్రి లోకేష్



గురువారం కొత్తచెరువులో జరిగిన మెగా పిటిఎం కార్యక్రమంలో తండ్రి చంద్రబాబుకు పాదాభివందనం చేస్తున్న మంత్రి లోకేష్

**కొత్తచెరువు, జులై 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే తాను అతి క్లిష్టమైన విద్యాశాఖను సవాలుగా ఎంచుకున్నట్లు రాష్ట్ర విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన కొత్తచెరువులోని శ్రీసత్యసాయి జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన మెగా పిటిఎం కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ, తాను ఎప్పుడూ సవాళ్లను స్వీకరిస్తానని గతంలో ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభించినప్పుడు రాష్ట్రంలోనే గత 37 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ విజయం సాధించలేని మంగళగిరి నియోజకవర్గంలో పట్టుబట్టి పోటీ చేశానని తొలిసారి ఓడిపోయినప్పటికీ, రెండవ సారి అత్యధిక మెజారిటీతో గెలుపొంది చూపించానని తెలియజేశారు. ముఖ్యమంత్రి సూచనమేరకు డొక్కా సీతమ్మ పేరుతో నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తున్నాం. విద్యార్థుల్లో పౌష్టికాహారం కోసం అన్నిప్రభుత్వ పాఠశాలలకు రాగి జావను ఉచితంగా అందిస్తున్న భగవాన్ శ్రీ సత్యసాయి ట్రస్ట్‌ను అభినందించారు. విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమని, ఈ విషయం తనకు ముఖ్యమంత్రి చెప్పగానే క్యాబినెట్ ర్యాంకుతో చాగంటి కోటేశ్వరరావును ప్రభుత్వ సలహాదారుగా నియమించడం జరిగిందన్నారు. అయితే ప్రభుత్వం నుంచి అందించే ఎటువంటి సౌకర్యాలు తనకు అవసరం లేదని, విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కోటేశ్వరరావు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా జీవితంలో లక్ష్య సాధన కోసం ముందుకు సాగాలని సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యారని పిల్లలు ఆత్మహత్యలు చేసుకోవడం సమంజసం కాదన్నారు. ఫెయిల్యూర్ అనేది మనలో కసి పట్టుదలను పెంచాలి గాని, అధైర్య పడకూడదన్నారు. తాను విద్యాశాఖ మంత్రిగా అద్భుతమైన సంస్కరణలతో విద్యాశాఖలోసమూల మార్పులు చేస్తానన్నారు. విద్యా వ్యవస్థలో రాజకీయాలు వద్దని ఫలితాలపై దృష్టి పెట్టాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు జూనియర్ కళాశాలలో ఒక్కరోజే 2.5 కోట్లమందితో మెగా పిటిఎం నిర్వహించడం ఒక రికార్డు అన్నారు. మన పిల్లల్లో అద్భుతమైన శక్తి ఉందని దారి చూపిస్తే ప్రపంచాన్ని శాసిస్తారన్నారు.

పిల్లలను ప్రయోజకు లుగా మార్చే బాధ్యతను తాను తీసుకుంటాన న్నారు. తల్లికి వందనం ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల లోకి పదివేల కోట్లు జమచేశామన్నారు. బ్యాగ్ బరువు తగ్గిం చేందుకు సెమిస్టర్ వారీగా పుస్తకాలను రూపొం దించామని. సమగ్ర అభ్యాసం, విద్యా నైపుణ్యా లను పెంచడమే లక్ష్యంగా చేసుకుని లీప్ (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) పేరుతో ఆంధ్ర మోడల్ స్కూల్ ఎడ్యుకేషన్‌ను ప్రవేశపెట్టామన్నారు. లక్షమంది ప్రభుత్వ ఇంటర్మీడియట్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌తో పాటు నీట్, జెఇఇ శిక్షణను అందిస్తున్నామన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాల వైపు మళ్లకుండా డ్రగ్స్ వద్దు బ్రో పేరుతో పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నామని మంత్రి లోకేష్ చెప్పారు.

# సత్యసాయి ట్రస్ట్ సేవలు అమోఘం

## కేంద్రమంత్రి శివరాజ్ సింగ్

**పుట్టపర్తి రూరల్ జులై 10 ప్రభాతవార్త :** సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్‌చేస్తున్న సేవలు అమోఘం అని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌పేర్కొన్నారు. గురువారం ప్రశాంతి నిలయంలో నిర్వహించే గురుపూర్ణిమ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. వేడుకలలో భాగంగా ప్రశాంతి భజన బృందం గురువందన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జూన్ 15న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన సాయి గాయత్రి జపం గిన్నిస్ బుక్ రికార్డు రావడంతో సత్యసాయి సమాధి చెంత ప్రధానం చేశారు. అనంతరం కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్‌ద్వారాఅందిస్తున్న త్రాగునీరు,విద్య, వైద్యం అమోఘమని పేర్కొన్నారు. గురువుకు అందరు సమానమేనని పేద ధనిక భేదాలు ఉండవు అన్నారు. ప్రశాంతి నిలయం నిస్వార్థమైన సేవకు, శాంతికి ప్రపంచానికే కేంద్ర బిందువు అని కొనియాడారు. సత్యసాయి బాబా లాంటి కారణజన్ములు మనదేశంలో పుట్టడం మన అందరి అదృష్టమని పేర్కొన్నారు. పుట్టపర్తిని దర్శించడం జన్మజన్మల అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

# దేశానికే ఆదర్శంగా శ్రీకాకుళం

>> పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పిస్తామని, సౌర వ్యవస్థ, ప్రయోగశాలలు, ఆట స్థలాలను ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. భవిష్యత్తు ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలంటే విద్యారంగాన్ని అభివృద్ధి చేయడమే కీలకం. అలాంటి రంగాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు లోకేష్ బాబు చాలా ప్రతిష్టాత్మకంగా భావించి విద్యాశాఖ మంత్రి పదవిని తీసుకున్నారు. పిల్లలు బాగుంటే దేశం బాగుంటుంది. వారే భవిష్యత్తుకు పెట్టుబడి. గత పాలకులు మాత్రం పాఠశాల గోడలపై, పిల్లల పుస్తకాలపై, బ్యాగులపై తమ ఫోటోలు ముద్రించుకొని ఆదర్శాలను తుంగలో తొక్కారని ఆయన గత ప్రభుత్వాన్ని విమర్శించారు. గురుపౌర్ణమి సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

**మెగా పేరెంట్ టీచర్ డే భవిష్యత్తుకు బాట:**

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మెగా పేరెంట్ టీచర్ డే ముఖ్య లక్ష్యం పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడమే అన్నారు. పిల్లలకి తల్లిదండ్రులు ఇచ్చే అతిపెద్ద ఆస్తి చదువే. మంచి చదువు కంటే పెద్ద ఆస్తి మరేమీ లేదు. ఆర్థిక పరిస్థితి చదువుకు అడ్డంకి కాదు. పి4 మార్గదర్శి లాంటి ఎన్నో స్కీములు ఉన్నాయి. ప్రభుత్వం చదువుకు ప్రోత్సాహం ఇస్తోంది. మంచి నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం ఇస్తున్నాం. చదువు కోసం పుస్తకాలు, బూట్లు ఇస్తున్నామని కలెక్టర్ వివరించారు. తల్లిదండ్రులు పాఠశాల సమావేశాలకు హాజరు కావాల్సిన ఆవశ్యకతను కలెక్టర్ తన స్వంత అనుభవంతో వివరించారు. 'నాకు మూడున్నర ఏళ్ళ పాప ఉంది. ఇంట్లో మాటలు వినదు. తినదు. పేరెంట్ టీచర్ మీటింగ్‌కు వెళ్తే, అక్కడ అన్ని రకాలు తింటుందని, చాలా బాగా చదువుతుందని చెప్పారు. నేను స్కూలుకు పేరెంట్ టీచర్ మీటింగ్ కోసం వెళ్ళడం ద్వారానే తెలుసుకోగలిగాను. ప్రతి తల్లి తండ్రి అలాగే ఇలాంటి సమావేశాలకు హాజరు కావాలి' అని ఆయన కోరారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా చిన్నప్పటినుంచే తర్ఫీదు ఇవ్వాలని, సెల్ ఫోన్‌లో పిల్లలు ఏం చేస్తున్నారో చూడగలగాలని, ఫోన్‌కు దూరంగా ఉంచి బయట ఆటలకు ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలని సూచించారు.

# సిట్ నోటీసులు

>> షన్ లిమిటెడ్ లోని (ఏపిఎస్‌బిసిఎల్) అత్యంత కీలకమైన ఎంఐఎస్ సెక్షన్‌లో ఏ.అనూష అనే మహిళను డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా రజత్ భార్గవ ప్రత్యేక మెమో దా ్వరా నియమించారు. ఆమె వైకాపా ముఠా ప్రతినిధిగా పనిచేసేవారు. ఎప్పటికప్పుడు మద్యం విక్రయాల డేటాను వాట్సప్ ద్వారా రాజ్ కెసిరెడ్డి(ఎ-1) ముఠాలో కీలక సభ్యుడైన సైఫ్ అహ్మద్‌కు పంపించేవారు. ఆ సమాచారం ఆధారంగా డిస్టలరీలకు వెళ్ళిన ఆర్డర్ల మొత్తం తెలుసుకొని, ముడుపులు ఎంత వసూలు చేయాలనే దానిపై సైఫ్ అహ్మద్ లెక్కలేసి రాజ్ కెసిరెడ్డికి పంపించేవారు. ఆయన ముప్పిడి అవినాష్‌రెడ్డి,బూనేటి చాణక్య ద్వారా ముడుపుల సొమ్ము వసూలు చేసి బిగ్‌బాస్‌కు చేర్చేవారు'అని సిట్ ఇప్పటికే దర్యాప్తులో గుర్తించింది. ఈ కుంభకోణానికి సంబంధించిన కుట్ర,దాని అమలులో రజత్ భార్గవ ప్రమేయంపై సిట్‌కు ఇప్పటికే కొన్ని కీలక ఆధారాలు లభించాయి. అరెస్టైన నిందితుల రిమాండు రిపోర్టుల్లోనూ రజత్ భార్గవ పేరును సిట్ ప్రస్తావించింది.

# ఉల్లంఘనపై 3 కేసులు

>> ఆయనకు స్వాగతం చెప్పాలని, అలాగే బంగారుపాళ్యం మామిడి మార్కెట్ యార్డులో 500 మంది మామిడి రైతులకు మాత్రమే అనుమతి వుంటుందని వీరిని మాత్రమే వైఎస్ జగన్ పరామర్శించాలని పోలీసులు షరతులు విధించారు. వైఎస్ జగన్ బంగారుపాళ్యం మార్కెట్ యార్డు పర్యటన నిర్వాహకులు పోలీసులు జారీ చేసిన నిబంధనలు ఉల్లంఘించారని స్థానిక విఆర్ఓ వెంకటరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంగారుపాళ్యం పోలీసులు పర్యటన నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. అలాగే జగన్ పర్యటన సందర్భంగా వైఎస్ జగన్ కాన్వాయ్ ఎదుట బెంగళూరు-చెన్నై జాతీయ రహదారి తిమ్మోజిపల్లి గ్రామ సమీపంలో తుంబపాళ్యం గ్రామానికి చెందిన రైతు దేవేంద్ర ఐదు ట్రాక్టర్ల మామిడి కాయలను రోడ్డుపై పారవేసి ఆ కాయలను ట్రాక్టర్లతో తొక్కించి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించారని బంగారుపాళ్యం పోలీసులు దేవేంద్రతో పాటు ఐదు మంది ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేశారు.

# విద్యార్థులలో సృజనాత్మకత పెంచాలి

>> జిల్లాకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి రాజాపు సిద్దూని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభినందించారు. వినూత్న ఆలోచనతో సరికొత్త ఆవిష్కరణకు రూపం ఇచ్చిన సిద్దూ గురించి సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకుని అతన్ని మంగళగిరిలోని క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని ప్రత్యేకంగా మాట్లాడారు. సిద్దూ ఆవిష్కరించిన సూకిల్‌ని స్వయంగా నడిపారు. అతని ఆలోచనలు తెలుసుకుని అబ్బురపడ్డారు. సిద్దూ రూపొందించిన గ్రాసరీ గురూవాట్సప్ సర్వీస్ బ్రోచర్‌చూసి ప్రత్యేకంగా అభినందించారు. అతని ఆలోచనలకు మరింత పదునుపెట్టాలని ఆకాంక్షిస్తూ రూ.లక్ష ప్రోత్సాహకరం అందించారు. ఆ సైకిల్‌పై సిద్దూని కూర్చోబెట్టుకొని నడిపారు. విజయనగరం జిల్లా జాడవారి కొత్తవలస గ్రామానికి చెందిన సిద్దూ సుదూరంలో ఉన్న కాలేజీకి వెళ్లేందుకు స్వయంగా ఒక ఎలక్ట్రిక్ సైకిల్ తయారు చేశాడు. మూడు గంటల బ్యాటరీ ఛార్జ్ చేస్తే 80 కిలోమీటర్లు ప్రయాణించగల ఈ సైకిల్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఇక సిద్దూ రూపొందించిన సైకిల్‌పై అతన్ని ఎక్కించుకుని పవన్ కొద్దిసేపు ఆ సైకిల్‌ను నడిపారు.

**మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో మగ్గుతున్న మా కుమారుల్ని రక్షించండి...**

ఉద్యోగాల కోసం ప్రయత్నించి ఏజెంట్ చేతిలో మోసపోయి విదేశాల్లో మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో మగ్గుతున్న తమ కుమారులను రక్షించాలంటూ గండబోయిన సూర్యకుమారి అనే మహిళ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌నికలిసి వినతిపత్రం సమర్పించారు. విజయనగరానికి చెందిన ఆమె -మయన్మార్ సరిహద్దుల్లో బందీలుగా ఉన్న తమ వారి ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయని, వారిని విడిపించేందుకు సాయం చేయాలని వేడుకున్నారు. దీనిపై స్పందించిన పవన్ కల్యాణ్ విషయాన్ని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకువెళ్లారు. మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో చిక్కుకున్న వారిని రక్షించాలని కోరారు. ఈ వ్యవహారంపై విదేశీ వ్యవహారాల శాఖ సానుకూలంగా స్పందించింది. విదేశాల్లో మగ్గుతున్న వారిని వెనక్కి తీసుకురావడానికి తగిన హామీ ఇచ్చారు.

# 100 యేళ్ల వయసులోనూ నవయువకుడే!

## తన ఆరోగ్యసూత్రాలు వివరించిన మలేసియా మాజీ పిఎం మహతిర్‌మహ్మద్

**సింగపూర్‌సిటీ, జులై 10:** వందేళ్ల వయసులోనూ పూర్తి ఆరోగ్యంతో, స్పష్టమైన ఆలోచనలతో, చురుకుదనంతో కనిపిస్తున్నారు మలేసియాను ఎక్కువ కాలం పాలించిన మాజీ ప్రధాని డాక్టర్ మహతీర్ మహమ్మద్ జులై 10న అంటే గురువారం 100వ వసంతంలోకి అడుగుపెట్టారు. ఈ వయసులో కూడా ఆయనలోని జ్ఞాపకశక్తి, వాక్పటిమ ఏమాత్రం తగ్గలేదు. తన సుదీర్ఘ, ఆరోగ్యవంతమైన జీవితం వెనుక ఎలాంటి మాయాజాలం లేదని, కేవలం క్రమశిక్షణతో కూడిన జీవనశైలే కారణమని ఆయన వెల్లడించారు. ది స్ట్రెయిట్స్ టైమ్స్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మహతీర్ మహమ్మద్ తన ఆరోగ్య సూత్రాలను పంచుకున్నారు. ఆయన చెప్పిన విషయాలు ఎంతో ఆచరణీయంగా ఉన్నాయి. శరీరాన్ని ఎప్పుడూ చురుకుగా ఉంచాలి. ఖాళీగా కూర్చోవడం ఆరోగ్యానికి హానికరమని ఆయన తెలిపారు. దీనికోసం జిమ్‌లలో కఠినమైన వ్యాయామాలు చేయాల్సిన అవసరం లేదని, రోజూవారీ పనుల్లో చురుకుగా ఉండటం, నడవడం వంటివి చేస్తే సరిపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు.శరీరంతో పాటు మెదడుకు కూడా పదును పెట్టడం చాలా ముఖ్యమని మహతీర్ వివరించారు. మీరు మెదడును ఉపయోగించకపోతే, అది క్రమంగా క్షీణిస్తుంది, విషయాలు మరచిపోవడం మొదలవుతుంది. అందుకే నేను నిరంతరం చదువుతాను, రాస్తాను, ఇతరులతో మాట్లాడతాను, ఉపన్యాసాలు ఇస్తానని ఆయన పేర్కొన్నారు. రాజకీయాల నుంచి తప్పుకున్నాక కూడా ఆయన ప్రజా జీవితానికి దూరం కాలేదు. నిరంతరం ఏదో ఒక పనిలో నిమగ్నమవ్వడమే ఆయన మానసిక ఆరోగ్యానికి కారణం.

ఆహారపు అలవాట్ల గురించి మాట్లాడుతూ, మితంగా తినడమే తన సూత్రమని మహతీర్ చెప్పారు. ధూమపానం, మద్యపానం వంటి దురలవాట్లకు ఆయన ఎప్పుడూ దూరంగా ఉన్నారు. విపరీతమైన డైటింగ్ పద్ధతులను పాటించకుండా, సమతుల్యమైన, సాదాసీదా భోజనాన్ని ఇష్టపడతారు. రాజకీయ జీవితంలో ఎన్నో ఒత్తిళ్లు, సవాళ్లు ఎదుర్కొన్నప్పటికీ, వాటిని ప్రశాంతంగా ఎదుర్కోవడం కూడా తన ఆరోగ్యానికి దోహదపడిందని ఆయన పరోక్షంగా తెలిపారు.

## వారం - వర్జ్యం

11-07-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
పాడ్యమి రా.2.07
పూర్వాషాఢ ఉ.5.56
వర్జ్యం : మ.2.09-3.48
దు.ఉ.8.19-9.11, 2) 12.40-1.32
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** నూతన మిత్రులు పరిచయమై, నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సంఘంలో ప్రతిష్ఠలు పెరుగుతాయి.

**వృషభం :** పోటీపరీక్షలు, ఇంటర్వ్యూ లలో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారా లలో ఆటుపోట్లు ఎదురైనా అధిగమిస్తారు.

**మిథునం:** సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. సేవా కార్యక్రమాలలో చురుకగా పాల్గొంటారు.

**కర్కాటకం:** భూవివాదాలు పరిష్కారమై నూతన ఒప్పందాలు కుదురుతాయి. ప్రయాణా లలో నూతనపరిచయాలు పెరుగుతాయి.

**సింహం:** జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలను చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు.

**కన్య :** ఎంతో కాలంగా వేధిస్తున్న రుణాల నుండి బయటపడతారు. విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**తుల :** షేర్లు, భూములు క్రయ విక్రయాలలో స్వల్పలాభాలు పొందుతారు.

**వృశ్చికం:** రాజకీయ, పారిశ్రామిక, కళారంగాల వారికి విశేషంగా రాణిస్తుంది.

**ధనుస్సు:** ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. సోదరులతో ఏర్పడిన మాటపట్టింపులు కొంతవరకు తీరుతాయి.

**మకరం:** సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**కుంభం:** గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. వృత్తి వ్యాపారా లలో స్వల్పలాభాలు పొందుతారు.

**మీనం :** సోదరుల నుండి ముఖ్య విష యాలు అందుకొంటారు. అప్రయత్న కార్యసిద్ధి పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అరుణాచలాన్ని మించిన సింహాచలం అప్పన్న గిరి ప్రదక్షిణం

## 10 లక్షలకు మించిన భక్తులు



గురువారం సింహాచలం అప్పన్నను దర్శించుకుంటున్న భక్తులు

**సింహాచలం ప్రభాతవార్త జులై 10:** ఆషాడం పౌర్ణమి రోజు స్వామి వారికి నాలుగో విడత చందనం తెల్లవారు జామున సమర్పించారు. వైశాఖ మాసం తృతీయ చందనోత్సవం రోజు తొలి విడత చందన సమర్పణ, వైశాఖమాసం పౌర్ణమి రెండో విడత జ్యేష్ట పౌర్ణమి మూడో విడత ఆషాడపౌర్ణమి నాలుగో విడత మూడు మడుగుల చందనాన్ని సమర్పించారు. గిరిప్రదక్షిణ చేసిన భక్తులు స్వామివారి దర్శనానికి సింహగిరి చేరడంతో సింహగిరి భక్తులతో కిటకిటలాడింది. సుమారుగా 70,000 మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారని అంచనా వేశారు.అప్పన్న గిరి ప్రదక్షిణ చేస్తే భూప్రదక్షిణ చేసినంత పుణ్యం ...చూడడానికి మన రెండుకళ్లు సరిపోవు.అడుగులో అడుగేస్తూ.. హరి నామ స్మరణతో. అప్పన్నని కొలుస్తూ... భక్తులకి అలసటంటే తెలియకుండా 32 కిలోమీటర్ల గిరిప్రదక్షిణ పూర్తి చేశారు. ఉభయ రాష్ట్ర భక్తులు పాల్గొనే అతి పెద్ద ఆలయ ప్రదక్షిణ సింహాద్రి అప్పన్న గిరి ప్రదక్షిణ. 32 కిలోమీటర్ల కొండ చుట్టూ 32 స్వామి వారి నరసింహ క్షేత్రాలనుస్మరిస్తూ నరసింహ స్వామి వారి మూల మంత్ర 32 బీజ అక్షరాలను వల్లిస్తూ..లక్షల అడుగులో అడుగులు వేస్తూ సంతోషం సరదాలతో మురిసి మెరిసి ఎగసి పడే భక్తుల కోలాహలంతో కలసి కదులుతూ ఒక రాత్రంతా ప్రకృతితో మమేకమై చీకటిలోచేసే ఆత్మ పరిశీలనా ప్రయాణం ఈ ఆధ్యాత్మిక గిరి ప్రదక్షిణం. ఈ వేడుకకు సింహాచలం.దేవస్థానం ఇఒ త్రినాథ్ రావు స్వీయ నేతృత్వంలో.. ఈ సంవత్సరం అధిక సంఖ్యలో భక్తులు సుమారుగా 12 లక్షల మంది భక్తులు పాల్గొన్నారు.

# నిండుకుండలా 'తుంగభద్ర'

>> కాలువ (హెచ్చెల్సీ)కి నీరు విడుదల చేశారు. అంతక ముందు బోర్డు అధికారులు డ్యాంపై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాంప్రదాయంగా వాయానం వదిలారు. అనంతరం బోర్డు సెక్రెటరీ ఓ.ఆర్.కే రెడ్డి మాట్లాడుతూ తుంగభద్ర ఎగువ కాలువకు తొలిత 100 క్యూసెక్కుల నీరు వదిలి తరువాత ప్రతి రెండు గంటలొకసారి నీరు విడుదల పెంచుతామని తెలిపారు. కాలువలో 500 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు తెలిపారు. ఆంధ్ర, కర్ణాటక కోటా రెండు కలిపి కాలువకు నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఖరీఫ్ పంటల సాగుకు ఈ నెల 10 తేదీ నుంచి నవంబర్ 30 వరకూ దాదాపు 1,300 క్యూసెక్కులు వదులుతున్నట్లు తెలిపారు. తుంగభద్ర జలాశయంకు ఎన్నడులేని విధంగా జూలై మొదటి వారంలోనే డ్యాంలో నీరు పూర్తిస్థాయిలో నదికి నీటిని విడుదల చేశామన్నారు. తుంగభద్ర జలాశయం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 100 టిఎంసిల కాగా ప్రస్తుతం 80 టిఎంసిలకు కుదించిన్నట్లు తెలిపారు. ప్రస్తుతం డ్యాం పై భాగంలో వర్షాలు బాగా కురుస్తున్న నేపథ్యంలో ఇన్ఫ్లో గణనీయంగా డ్యాంలోకి వస్తుందని తెలిపారు. రైతులు పంటలు సాగు విషయంలో నీరు వృథా చేయకుండా వాడుకోవాలని చెప్పారు. 12వ తేదీ సాయంత్రం 6 గంటకల్లా ఆంధ్ర సరిహద్దులోని 105 కిలోమీటర్లు తుంగభద్ర జలాలు చేరుతాయని అధికారులు తెలిపారు. నీరు విడుదల పూజా కార్యక్రమంలో టిబి డ్యాం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యాన ఉత్పత్తుల్లో ఎపి నం1:గవర్నర్ నజీర్



ప్రసంగిస్తున్న గవర్నర్

**గన్నవరం, జులై 10, ప్రభాతవార్త :** గత కొన్ని దశాబ్దాలుగా మన రాష్ట్రం ఉద్యాన ఉత్పత్తుల్లో గణనీయమైన ప్రగతిని సాధించిందని, 15.9లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో 275.13 మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో దేశంలోనే ఐదవస్థానంలో నిలిచిందని రాష్ట్రగవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లి గూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యన విశ్వ విద్యాలయం 6వస్నాతకోత్సవ కార్యక్రమాన్ని కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలోని స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో గురువారం ఉదయం నిర్వహించారు. ఈకార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఛాన్సలర్‌హోదాలో గవర్నర్ ముఖ్యఅతిధిగా హాజరై బ్యాచిలర్ డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేషన్, పిహెచ్‌డి పూర్తిచేసిన విద్యార్దులకు పట్టాలు ప్రధానం చేసారు. ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్దులకు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలను గవర్నర్ చేతుల మీదుగా బహుకరించారు. ఈసందర్బంగా గవర్నర్ నజీర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ఉద్యానపంటల పాత్ర ప్రముఖంగా ఉందన్నారు. ఉద్యాన పంటల సాగులో నూతన పద్దతులు పాటించటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఈదిశగా శాస్త్ర వేత్తలు కృషిచేయాలని సూచించారు. పోషకా హారకొరతను నివారించటంతోపాటు రైతుల ఆదాయాన్ని పెంచటంలో ఉద్యానరంగం కీలక పాత్రపోషిస్తుందని అభిప్రాయపడ్డారు. 2024 జిడిపిలో వ్యవసాయ అనుబంధరంగాలు దాదాపు 16శాతం వాటాను కలిగి ఉన్నాయని తెలిపారు. వ్యవసాయం కేవలం జీవనోపాధి కాదు అది జీవన విధానం అన్న హరిత విప్లవ పితామహుడు స్వామినాధన్ మాటలను ఈసందర్బంగా ఊటంకించారు. మిరప, కోకో, ఆయిల్‌పామ్, బొప్పాయి, జీడిపప్పు, నారింజ, టమోట, అరటి వంటి అనేక పంటల ఉత్పత్తి, ఉత్పాదకతకు మార్గదర్శకంగా దేశంలోనే ప్రధాన ఉద్యాన కేంద్రంగా మన రాష్ట్రం నిలవ బోతుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేసారు. ఈ విశ్వవిద్యాలయం స్థాపించిన అనతి కాలంలోనే ఎందరో విద్యార్దులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దటం అభినందనీయమన్నారు. ఈవిశ్వవిద్యాలయం ద్వారా 38 రకాల అధికదిగుబడినిచ్చే వంగడాలను అభివృద్ధిచేసి రైతులకు అందించినట్లు గవర్నర్ వివరించారు. వీటిలో 31 రకాలను గత రెండు సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో సెంట్రల్ వెరైటీ రిలీజ్ కమిటీ అధికారికంగా ప్రకటించిందని గుర్తుచేసారు. విద్యాలయాలు జ్నానంతోపాటు, వ్యక్తిత్వ నిర్మాణానికి పునాధులుగా నిలుస్తాయని, ఇక్కడ నేర్చుకున్న విషయాపరిజ్నానాన్ని మరింత పెంపొందించుకుని క్షేత్రస్థాయిలో రైతులకు సాయం అందించాలని సూచించారు. విద్యార్దులకు స్నాతకోత్సవం చిరస్మరణీయమైన అనుభూతినిస్తుందని ఈ ఆనందం మరువలేనిదన్నారు.

## గన్నవరం విమానాశ్రయానికి గ్రీన్ ఛానల్ ద్వారా గుండె తరలింపు

**విజయవాడ,జులై 10,ప్రభాతవార్త ప్రతినిధి:** గుంటూరు ఓ కార్డియాక్ ఆస్పత్రి నుండి గన్నవరం విమానాశ్రయానికి గ్రీన్ ఛానల్ ద్వారా గుండెను తరలించారు. తిరుపతి పద్మావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి దీన్ని అమర్చనున్నారు. విజయవాడకు చెందిన జోతిన భాను వాకింగ్ వెళ్ళి వస్తుండగా ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తనకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం హుటాహుటిన గుంటూరు లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు అవయవదానానికి అంగీకరించారు. ఈ క్రమంలో గుండెను తిరుపతి లోని పద్మావతి ఆస్పత్రికి తరలిస్తున్నారు.

## రాష్ట్రంలో ఘనంగా గురుపౌర్ణమి

**విజయవాడ,జూలై10,ప్రభాతవార్తప్రతినిధి:** గురుపౌర్ణమి సందర్భంగాసాయిబాబా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. బాబా దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్నారు. క్షీరాభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు సాయి ఆలయాలకు చేరుకుని పూజలు జరిపారు.

## అర్జీల పరిష్కార తీరుపై పునఃపరిశీలనకు ప్రత్యేక యంత్రాంగం

**విజయవాడ,జూలై10,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజల నుండి అధికారులకు అందే విజ్నప్తుల పరిశీలన,పరిష్కారం,తిరస్కృతి తీరును సమీక్షించేందుకు జిల్లాలో ప్రత్యేక యంత్రాంగం రాబోతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు.ప్రతి జిల్లా కేంద్రంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్,ఇద్దరు లేదా ముగ్గురు విశ్రాంత తహసీల్దార్‌లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నారు. రెవిన్యూ చట్టాలపై అవగాహన ఉన్న వారిని ఒప్పంద విధానాల్లో నియమించాలని ప్రభుత్వం కలెక్టర్లకు పంపిన ఆదేశాల్లో స్పష్టం చేసింది. వీరి ఎంపికకు మౌఖిక పరీక్షలు కూడ నిర్వహించాలని తెలిపింది. రెవిన్యూ అధికారులు తిరస్కరించిన ప్రతి అర్జీని వీరిచేత పున:పరిశీలన చేయించాలంది. పరిష్కరించిన వాటిని కూడ ర్యాండమ్ విధానంలో పరిశీలన చేయించాలని పేర్కొంది. ఐవీఆర్ఎస్,ఇతర పద్దతుల్లో ప్రభుత్వం సేకరించిన అభిప్రయాల సరళిని కూడ వీరు పరిశీలిస్తారు. మరో వైపుకొందరు ఒకే సమస్యపై రకరకాల రూపాల్లో ప్రభుత్వానికి అర్జీలు పంపుతున్నారు. దీనివల్ల ధరఖాస్తుల సంఖ్య పెరిగిపోతోంది. ఇకపై అర్జీ స్వీకరణ సమయంలో సదరు వ్యక్తి ఆథార్ నంబరు నమోదు చేయనున్నారు. దాన్ని ట్రాకింగ్ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది.

# భవిష్యత్తును తీర్చిదిద్దేది చదువే

### - మంత్రి కొండపల్లి శ్రీనివాస్ - మరడాంలో స్ఫూర్తిదాయకంగా మెగా పిటిఎం - విద్యార్థులతో సహపంక్తి భోజనం



**దత్తిరాజేరు (విజయనగరం జిల్లా), జులై 10 ప్రభాతవార్త :** చదువు ఎదుగుదలకు దోహదం చేస్తుందని, అభివృద్ధికి మార్గం చూపుతుందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. దత్తిరాజేరు మండలం మరడాం జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలోని, జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన తల్లితండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి (మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్)కు మంత్రి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రికి విద్యార్ధులు, అధ్యాపకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్య మన భవిష్యత్తును తీర్చి దిద్దుతుందని అన్నారు. చదువుకోవడం ద్వారా ఉన్నత స్థానాన్ని సాధించవచ్చునని అన్నారు. విద్య కోసం ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం డబ్బును విద్యార్ధుల ఇతర అవసరాలకు వినియోగించాలని అన్నారు. విద్యార్ధులు తమకు నచ్చిన రంగంలో ఎదిగేందుకు వీలుగా తల్లితండ్రులు, ఉపాధ్యాయులు వారికి సంపూర్ణంగా సహకారం అందించాలని సూచించారు. విద్యార్ధుల సమస్యలను తెలుసుకొని, ఇక్కడ జూనియర్ కళాశాలను మంజూరు చేయడం జరి గిందని చెప్పారు. విద్యా ర్ధులు తోటి విద్యార్ధులతో కలిసిమెలిసి ఉండే విధానాన్ని గమనించడానికి, విద్యార్ధుల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి ఈ ఆత్మీయ సమావేశాలు దోహదపడతాయని అన్నారు. విద్యార్ధులను ఉత్తమ పౌరు లుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. మెగా పిటిఎం అహ్లాదకర వాతావరణంలో స్ఫూర్తిదాయకంగా జరిగింది. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఇతర ఉన్నతాధికారులు విద్యార్ధులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్ధులు తయారు చేసిన మెగా పిటిఎం సెల్ఫీపాయింట్ వద్ద ఫొటోలు దిగారు. విద్యార్ధులతోపాటు పెద్ద సంఖ్యలో తల్లితండ్రులు కూడా ఈ సమావేశంలో భాగస్వాములయ్యారు. రంగోలి, టగ్ ఆఫ్ వార్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మహేష్ అధ్యక్షోపన్యాసం చేస్తూ పాఠశాల ప్రగతిని వివరించారు. తల్లిదండ్రులతో ముఖాముఖి నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్ధులు తమ పాఠశాలలో విద్యాబోధన గురించి వివరించారు. తల్లులకు విద్యార్ధులు పాదపుష్పార్చన చేశారు.

# సెప్టెంబర్ 24నుండి తిరుమలేశుని వార్షిక బ్రహ్మోత్సవాలు

### - అసౌకర్యం లేకుండా రోడ్‌మ్యాప్, పార్కింగ్ స్థలాలు ఎంపిక : టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల.జూలై 10ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడు...ఏడుకొండల వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది సెప్టెంబర్ 24వతేదీ నుండి అక్టోబర్ 2వరకు జరిపించేలా తిరుమల తిరుపతి దేవస్థానం ముహర్తం ఖరారుచేసింది. తొమ్మిది రోజులపాటు నిర్వహించనున్న దేవదేవుని వాహనసేవలు ఉదయం 8గంటలకు, రాత్రి 7గంటలకు మొదలవుతాయి. అన్ని ప్రత్యేక దర్శనాలు, విఐపి బ్రేక్ దర్శనాలు,దాతల దర్శనాలు కూడా రద్దుచేశారు. బ్రహ్మోత్సవాలకు దేశవిదేశాల నుండి తరలివచ్చే అశేషసంఖ్య భక్తులకు అసౌకర్యం కలగకుండా మాఢవీధుల్లో గ్యాలరీలకు చేరుకునేలా, వాహనాలకు పార్కింగ్ సదుపాయాలు తెలిపే రోడ్డుమ్యాప్ పక్కాగా ఉండేలా చూస్తున్నారు. ఈ ఏడాది వేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన చేపట్టాల్సిన ఏర్పాట్లు, సౌకర్యాలు, ప్రణాళికా బద్ధంగా తీసుకోవాల్సిన భద్రత చర్యలపై గురువారం మధ్యాహ్నం తిరుమల అన్నమయ్య భవనంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అన్ని విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు సెప్టెంబర్ 16వతేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం తొలి ఘట్టంగా, 23వతేదీ శాస్త్రోక్తంగా అంకురార్పణ జరుగుతుంది. సెప్టెంబర్ 24వతేదీ సాయంత్రం ధ్వజా రోహణం, రాత్రి పెద్దశేషవాహనం, ఐదవరోజు సెప్టెంబర్ 28వతేదీ రాత్రి గరుడసేవ, అక్టోబర్ 1వతేదీ రథోత్సవం, 2వతేదీ చక్రస్నాన మహోత్సవం ముఖ్యమైన ఘట్టాలు. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిదిరోజులు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రోటోకాల్ ప్రముఖులకు మినహాయించి మిగిలిన విఐపి బ్రేక్ దర్శనాలు పూర్తిగా రద్దుచేశారు. వృద్దులు, దివ్యాంగులు, ఎన్ఆర్ఐ భక్తులు, దాతల ,చంటిపిల్లల తల్లిదండ్రుల దర్శనాలు రద్దు.విజిలెన్స్ పోలీసు విభాగాల సమన్వయంతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పార్కింగ్ స్థలాలు ఎంపిక పక్కాగా ఉండాలని అదనపు ఇఒ ఆదేశించారు. భక్తులకు దర్శన క్యూలైన్లు, ఆలయ మాఢవీదుల్లోకి చేరుకునేలా గ్యాలరీలు, ముఖ్యమైన ప్రాంతాల్లో విరివిగా అన్నప్రసాదాల పంపిణీకి కౌంటర్లు ,ఇంజనీరింగ్ పనులు, విద్యుద్దీపాలంకరణలు, ఫలపుష్ప ప్రదర్శన ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు శ్రీవారిసేవకు యువతీ యువకలను ఆహ్వానించిమెరుగైన సేవలంది ంచేందుకు కృషి చేయాలని చౌదరి ఆదేశించారు. సెప్టెంబర్ 27వతేదీ రాత్రి నుండి 29వతేదీ ఉదయం 6గంటల వరకు తిరుమల ఘాట్‌లో ద్విచక్రవాహనాలు నిషేధం..భక్తుల రద్దీకి తగ్గట్లు లడ్డూలు నిల్వవుంచుకోవాలన్నారు.

## హిందీ సలహా సమితిలో సభ్యునిగా డాక్టర్ యార్లగడ్డ

**విజయవాడ,జూలై 10,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన రెవెన్యూ విభాగం లో పునఃరూపకల్పన చేసిన సంయుక్త హిందీ సలహా సమితిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ విద్యావేత్త, రచయిత ఆచార్య యార్లగడ్డ లక్ష్మీపసాద్‌ను సభ్యునిగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీకి ఆర్థిక మంత్రి ఛైర్మన్‌గా, సహాయ ఆర్థిక మంత్రి వైస్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. విభిన్న కేంద్ర శాఖలైన రెవెన్యూ, వ్యయము, పెట్టుబడి, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కార్యాలయాల పరిపాలనలో హిందీ భాషా వినియోగాన్ని ప్రోత్సహించడమే ఈ కమిటీ ముఖ్య ఉద్దేశంగా ఉంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన పార్లమెంటు సభ్యులు, భాషా నిపుణులు, హిందీ ప్రచార సంస్థల ప్రతినిధులు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. అందులో భాగంగా లక్ష్మీప్రసాద్ గారికి అవకాశం లభించింది. పద్మశ్రీ పురస్కారాన్ని అందు కున్నారు. డా. యర్లగడ్డ, హిందీతో పాటు తెలుగు భాషా అభివృద్ధికి విశేష సేవలు అందించారు.

# తిరుమల సమాచారం

## వేడుకగా శ్రీవారి గురుపౌర్ణమి గరుడసేవ



**తిరుమల,జూలై 10 ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన ఆషాడమాసంలో గరువారం రోజు గురుపౌర్ణమి వేళ నిండుపున్నమి వెలుగుల్లో మలయప్పస్వామి రాత్రి గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగించుకుని సహస్రదీపాలంకరణసేవలో వయ్యారంగా పూజలందుకున్నారు. అక్కడ నుంచి బయలుదేరి వాహనమండపం చేరుకున్నారు. వాహన మండపం వద్ద ఆలయ అర్చకులు విశేష అలంకారభూషితుడైన మలయప్పను కొలువుదీర్చి వేదమంత్రాల నడుమ కర్పూర హారతులిచ్చారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణల మధ్య గరుడవాహనం మెల్లగా ఆలయం ముందునుంచి కదులుతూ మాఢవీధుల్లో ఊరేగారు. ఈ వాహనసేవలో టిటిడి అదనపు ఇఒచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాధం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, డిఎఫ్ఒ ఫణికుమార్‌నాయుడు, విఎస్ఒలు నెట్టెం తులసీవెంకటరామ్‌కుమార్, అల్లం సురేంద్ర, ఆలయ ఏవిఎస్ఒ రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

## గంగమ్మఆలయంలో వేడుకగా చండీహోమం



**తిరుపతి,జూలై 10ప్రభాతవార్తప్రతినిధి:** రాయల సీమజిల్లాల్లోనే అత్యంత విశిష్టత మహిమ కలిగిన తిరుపతి గ్రామదేవత తాతయ్య గుంటగంగమ్మ ఆలయంలో గురువారం పౌర్ణమి వేళ చండీహోమం శాస్త్రోక్తంగా జరిపించారు. గురుపౌర్ణమి రోజున గంగమ్మ ఆలయంలో ఛండీహోమంలో గృహస్థభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, ఆలయ ఇఒ ఎ.జయకుమార్ గణపతి హోమంతో మొదలుపెట్టి అమ్మ వారికి చండీ హోమాన్ని వేదమంత్రాలతో జరిపించారు. చివరగా పూర్ణాహుతితో హోమం ముగిసింది. హోమంలో పాల్గొన్న మహిళ భక్తులకు అమ్మవారి కుంకుమ, గాజులు, జాకెట్ అందజేశారు. భక్తులకు గంగమ్మదర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## 15,16 రెండురోజులు విఐపి బ్రేక్ రద్దు

### -14,15న సిఫార్సు లేఖలు తేవద్దు

**తిరుమల,జూలై 10ప్రభాతవార్తప్రతినిధి:** ఆపద మొక్కులవాడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఆణిమాసం చివరన ఆణివార ఆస్థానం పురస్కరించుకుని ఈనెల 15,16తేదీల్లో రెండురోజులు విఐపి బ్రేక్ దర్శనాలు టిటిడి రద్దుచేసింది. 15వతేదీ మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ,16వతేదీ బుధవారం ఆణివార ఆస్థానం జరగనుంది. ఈ రెండు ప్రత్యేక రోజుల్లో ఆలయంలో విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేశారు. ఇదే సమయంలో 14వతేదీ, 15వతేదీ మంగళవారం కూడా విఐపి బ్రేక్ దర్శనాల సిఫార్సు లేఖలు తీసుకురావద్దని టిటిడి విజ్నప్తి చేసింది. భక్తులు

ఈ విషయాలను గమనించి టిటిడికి సహకరించాలని విజ్నప్తి చేసింది.

## శ్రీవారి ఆశీస్సులతో శుభాలు కలగాలి: ప్రముఖులు



**తిరుమల,జూలై 10ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు ప్రముఖులు తెలిపారు. గురువారం ఉదయం విఐపి బ్రేక్‌లో పోలీసుశాఖ ఐజి శ్రీకాంత్, సుప్రభాతసేవలో సినీ సంగీత దర్శకుడు డ్రమ్స్ శివమణి వీరిరువురూ వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వారాంతం ముందే నిండిన కొండ

### - వరుసగా రెండురోజులు సెలవులతో భారీగా భక్తులు



**తిరుమల,జూలై 10ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం రెండురోజులు ముందుగానే వరుససెలవులు రానున్న నేపథ్యంలో గురువారం ఉదయానికే తిరుమల కొండ భక్తులతోనిండిపోయింది. రానున్న రెండవ శనిఆదివారాలు వరుస సెలవులు నేపథ్యంలో గురువారం గురుపౌర్ణమి వేళ తిరుమల భక్తజన సంద్రంగా మారింది. ఏడుకొండల వెంకన్న దర్శనానికి భక్తులు భారీగా చేరారు. ఉదయానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలోని కంపార్టుమెంట్లు నిండిపోయాయి. సర్వదర్శనానికి 20గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఆరేడుగంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. సాయంత్రం వరకు 47వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. సాధారణంగా శని,ఆదివారాలు భక్తులు భారీగా తిరుమలకు వస్తారు. ప్రస్తుతం రెండురోజులు ముందుగానే చేరుకున్నారు. అదనపు ఇఒ వెంకయ్యచౌదరి ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

## గంజాయి స్మగ్లర్లపై పిట్ ఎన్‌డిపిఎస్ చట్టం

**విజయవాడ జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో గంజాయి స్మగ్లింగ్ రవాణా వంటి నేరాలకు తరచు పాల్పడుతున్నా వారిపై ఏడాది పాటు ముందస్తుగా నిర్బంధించనుంది. పిట్ ఎన్‌డీపీఎస్ చట్టం అమలులోకి తీసుకుని వచ్చింది.ఈమేరకు ఎక్సైజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లి , అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని పలువురు గంజాయి స్మగ్లర్లు రవాణాదారులపై రాష్ట్ర ప్రభుత్వం పిట్ ఎన్‌డీపీఎస్ చట్టం ప్రయోగించింది. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలానికి చెందిన దుంగ మాణిక్యం, వి.మాడుగుల మండలానికి చెందిన బుదిరెడ్ల కొండలరావు, అల్లూరి సీతారామరాజు జిల్ల చింతపల్లి మండలానికి చెందిన గాలి సత్యనారాయణ జీకే వీధి మండలానికి చెందిన వంతల బాలు బద్దర్ ,హుకుంపేట మండలానికి చెందిన కొర్రా సీతారామ్, జి.మాడుగుల మండలానికి చెందిన వంచుర్ల కొండాబాబులు పిట్ ఎన్‌డీపీఎస్ చట్టం ఆపాదించారు.

## జగన్ అక్రమాస్తుల కేసులు కొట్టివేయండి హైకోర్టులో దాల్మియా సిమెంట్స్

**విజయవాడ జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అక్రమాస్తుల వ్యవహారంలో నమోదు చేసిన సీబీఐ కేసును కొట్టివేయాలని కోరుతూ దాల్మియా సిమెంట్స్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అప్పటి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం దాల్మియా సిమెంట్స్‌కు అక్రమ పద్దతుల్లో లీజులు కట్టబెట్టినందుకు ప్రతిఫలంగా ఆయన కుమారుడు జగన్ కంపెనీల్లో దాల్మియా సిమెంట్స్ రూ.95 కోట్ల ముడుపులను పెట్టుబడిగా పెట్టిందని సీబీఐ కేసు నమోదు చేసింది. భారత సిమెంట్స్‌లో దాల్మియా వాటాలను ఫ్రెంచి కంపెనీకి విక్రయించగా రూ.146.58 కోట్లు వచ్చింది. అందులో పెట్టుబడులపై లాభం పన్ను పోనూ రూ.139 కోట్లు మిగిలింది. ఈ సొమ్మును ఖాతాల్లో చూపకుండా హవాలా మార్గంలో జగన్‌కు రూ.55 కోట్లు అందించిందని పేర్కొంది. దాల్మియా ఉద్యోగి జాయ్‌దీప్ బసు నుంచి ఆదాయపు పన్ను శాఖ స్వాధీనం చేసుకున్న పెన్‌డ్రైవ్ నుంచిరాబట్టిన సమాచారం ప్రకారం సీబీఐ దర్యాప్తును కొనసాగించగా జేఆర్ ఖాతాలో రూ.55 కోట్లకు సంబంధించిన లావాదేవీలు బయటపడ్డాయని, జేఆర్ అంటే జగన్ మోహన్‌రెడ్డేనని పేర్కొంది. హవాలా మార్గాల్లో వచ్చిన సొమ్ముకు సంబంధించి ఆడిటర్ విజయసాయి రెడ్డికి పునీత్ దాల్మియా, దాల్మియా ఉద్యోగుల మధ్య సంకేత భాషలో ఈమెయిల్ వ్యవహారాలు నడిచాయని తెలిపింది. 3500 టన్నులు అందాయంటే రూ.35 కోట్లు అందాయంటూ కోడ్ భాషలో సాగిన ఈమెయిల్ గుట్టు రట్టయిందని సీబీఐ పేర్కొంది. అయితే అక్రమంగా నమోదు చేసిన ఈ కేసును కొట్టివేయాలంటూ దాల్మియా సిమెంట్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ చట్టవిరుద్దంగా లీజులు మంజూరైతే జరిమానాలు ఉంటాయి తప్ప క్రిమినల్ కేసు ఉండదన్నారు. నీకది-నాకిది పెట్టుబుడులు పెట్టారని సీబీఐ ఆరోపిస్తోందని, దీన్ని విక్రయించడం ద్వారా లాభాలు వచ్చాయన్నారు. విక్రయించిన సొమ్ము జగన్‌కు అందిందని ఈ విషయం పెన్‌డ్రైవ్ ద్వారా బయటపడిందని సీబీఐ అంటోందని, ఈమెయిళ్లతో సంకేత భాష వినియోగించారాన్న ఊహాజనిత సీబీఐ నిరాకరించిందన్నారు. ఈకేసు ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆస్తులను జప్తు చేస్తోందని అందువల్ల విచారణను నిలిపివేయాలని కోరారు. సీబీఐ తరపు ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపిస్తూ ఇదే కోర్టుఇండియా సిమెంట్స్ కేసులో ఇచ్చిన తీర్పును ఆధారంగా చేసుకుని దాల్మియా సిమెంట్స్ ఈ పిటిషన్ దాఖలు చేసిందన్నారు. ఇండియా సిమెంట్స్‌పై కేసును కొట్టివేస్తూ ఈ కోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టులో అప్పీలు దాఖలు చేశామని చెప్పారు. పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేస్తామని అన్నారు. దీనికి న్యాయమూర్తి అనుమతిస్తూ విచారణను ఈనెల 23కి వాయిదా వేశారు.

## రోగుల పట్ల అశ్రద్ద వద్దు :సీమ రైల్వేడివిజన్‌లో ప్రిన్సిపల్ సిఎండి నిర్మలా రాజారాం

**గుంతకల్లు రైల్వే, జూలై 10,ప్రభాతవార్త** ప్రాణాపాయస్థితిలో ఆసుపత్రికి వచ్చేరోగుల పట్ల నిర్లక్ష్యం,అశ్రద్ద వహించకుండ సరైన సమయంలో సరైనచికిత్స అందించడం ద్వారా రోగుల ప్రాణాలు కాపాడవచ్చని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ నిర్మలా రాజారాం ఉద్బోదించారు. అధికారిక పర్యటనలో భాగంగా గురువారం గుంతకల్లు రైల్వే డివిజన్‌లో పర్యటించిన ఆమె, సిఎంఎస్ డాక్టర్ జి వేణుగోపాల్ రెడ్డి, సీనియర్ డిఎంఒ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి మురళీమోహన్,ఏఎన్‌ఓ ఈశ్వరమ్మలతో కలిసి డివిజన్ ఆసుపత్రిలోని అన్ని విభాగాలలో సందర్శించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో డివిజన్ పరిధిలోని తొమ్మిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పేషెంట్ల ఆరోగ్య పరిస్థితిని, వివరాలను అడిగి తెలుసుకున్నారు. అవసరాలను, పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అత్యవసర కేసులను సమీపంలో ఉన్న రెఫరల్ ఆసుపత్రులకు తరలించి రోగుల ప్రాణాలను కాపాడవలసిందిగా ఆమె ఆదేశించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జలవనరుల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నెం.2/2025-26 తేది: 04.07.2025
పనిపేరు: కాకినాడ జిల్లా - తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకము గొల్లప్రోలు మండలం-కొడవలి గ్రామం కి.మీ. 72.650 వద్ద గల రెండవ స్టేజి కొడవలి లిఫ్ట్‌నకు 2025-2026 వారిక నిర్వహణ గురించి. పని విలువ: రూ.40,43,933/-. టెండర్లు స్వీకరించుటకు ఆఖరి తేదీ: 21.07.2025 మ.3.00గం.ల వరకు. తదుపరి వివరములకు ఇ-మార్కెట్ ప్లేస్ : https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు. ఫోన్: 9440908059.
సం/-. పర్యవేక్షక ఇంజనీరు, పి.ఐ.పి.యల్.యం.సి. సర్కిల్, తుని.
DIPR.NO. 16945/CL/ADVT/1/1/2022-23 తేది: 10.07.2025

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governerpet, Vijayawada - 520002 (A.P.)
NIT No.:52/MIS/Dir/Plng/552/2017/VJA, Dated:28.06.2025
E Procurement Tender Notice
Name of Work :APCRDA-"RFP for selection of consultant for preparation of Urban Design and Architectural Guidelines and Regulations for Amaravati Capital City" - Publication".
The bid can be downloaded on AP e-procurement portal from 11.07.2025 to 28.07.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid is 28.07.2025 up to 15.00 Hrs, Technical bid opening 28.07.2025 @16.00Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.
Sd/- Commissioner, APCRDA, Vijayawada.

వార్త

విజయానికి కావలసిన సూత్రాన్ని చెప్పేకంటే,
ఓటమికి కావలసిన సూత్రం చెప్పడం సులభం.

-మెర్బర్ట్ బే ఆర్డ్ స్వోపే

# పాఠశాల విద్య 12 దాకా పొడిగింపు అవసరం

ప్రస్తుతం యువతలో నేటి చదువులు బ్రతుకు తెరువు చూపడం లేదని, జీవనోపాధికి తోడ్పడడం లేదని, చదువుకోన్నందుకు లేక చదువుకున్నందున ప్రయోజనం చేకూరడం లేదని నిరాశ నిర్లిప్తతకు లోనౌతున్నందున వృత్తి విద్యల ద్వారా ఉపాధి సౌకర్యం సమకూర్చుకొని పూర్తి ప్రయోజనం పొందే అవకాశం సమకూరుతుంది. బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఇంటర్మీడియట్ బోర్డు రెండు విలీనంతో ఒక బోర్డు నిర్వహణకు అయ్యే వ్యయంలో కొంతమేరకు పొదుపు చేసుకొని ఆ నిధులను కూడా విద్యారంగానికి వెచ్చించే అవకాశం ఉంటుంది. ఈ రెండు బోర్డులు విలీనం వల్ల పలు ప్రయోజనాలు పొందే అవకాశం ఉన్నందున పైగా ఎటువంటి నష్టం లేనందున రాష్ట్ర ప్రభుత్వం సానుకూల చర్య చేపట్టి వచ్చే విద్యా సంవత్సరం నుండి పాఠశాల విద్యలోనే పదకొండు, పన్నెండు తరగతులు ఏర్పాటు చేయాలని, విద్యార్థులు ప్రయోజనం పొందాలని కోరుకుందాం.

కొల్లు మధుసూదనరావు

భారతదేశంలో విద్యారంగాన్ని సమూలంగా సంస్కరించాలనే ఉద్దేశంతో, పాఠశాల విద్య నుండి ఉన్నత విద్యవరకు అన్ని స్థాయిలలో విప్లవాత్మక మార్పు తేవాలనే లక్ష్యంతో జాతీయ విద్యావిధానం 2023 ప్రవేశపెట్టడమైనది. విద్యా దశలు గతంలో 10+2+3, 10 సంవత్సరాలు పాఠశాల విద్య, రెండు సంవత్సరాలు ఇంటర్, మూడు సంవత్సరాలు డిగ్రీ ఉండగా నూతనంగా విద్యా విధానం 5+3+3+4 గా 21వ శతాబ్దపు ఆకాంక్షలకు అనుగుణంగా బాల్య విద్య, నైపుణ్యాభివృద్ధి, వృత్తి శిక్షణకు అవకాశం కల్పిస్తూ, జీవితాంతం అభ్యసనాన్ని ప్రోత్సహించడానికి, ఏకీకృతం చేయడానికి నూతన విద్యా విధానం ప్రవేశ పెట్టడమైనది. గతంలో పాఠశాలవిద్య 1వ తరగతి వయస్సు ఆరు సంవత్సరాల నుండి ఆరంభమయ్యే అవకాశం ఉండగా ప్రస్తుత అవసరాల్ని గుర్తించి పిల్లల్లో ప్రజ్ఞాలబ్ధి పెరిగినందున, భవిష్యత్తుకు పునాది వేస్తున్నందున పిల్లల్లో ఆసక్తి, ప్రాథమిక నైపుణ్యాల అభివృద్ధికి, సామాజిక, భావోద్వేగాభివృద్ధి అత్యావశ్యకమైనందున నూతనంగా బాల్యవిద్యను మూడు సంవత్సరాల నుండే ప్రవేశపెట్టడమైనది. ఇది పునాది దశ (వ్యవధి 5సంవత్సరాలు, వయస్సు 3నుండి 8సంవత్సరాలు) ఈ ఐదు సంవత్సరాల్లో మూడు సంవత్సరాలు ప్రీస్కూల్ లేక అంగన్‌వాడి,1,2 తరగతులు. ఈ స్థాయిలో పిల్లలు మానసిక, శారీరక అభివృద్ధికి ప్రాధాన్యత చేకూర్చే ఆట, పాట ఆధారిత అభ్యసనంతో పాటూ కళలు, సంగీతం, కమ్యూనికేషన్ నైపుణ్యాల అభివృద్ధికి, పాఠశాలకు అలవాటు ప్రక్రియను ప్రోత్సహిస్తుంది. మొదటి దశ (వ్యవధి 3సంవత్సరాలు, వయస్సు 8 నుండి 10 సంవత్సరాలు) 3 నుండి 5 తరగతిలో ఉంటాయి. మాట్లాడడం, చదవడం, రాయడం, శారీరక విద్య, భాషలు, కళ, సైన్స్, గణితం మొదలగు విషయాల పరిచయం, అధ్యయనం జరుగుతుంది. మధ్యదశ (వ్యవధి 3సంవత్సరాలు, వయసు 11 నుండి 14 సంవత్సరాలు) ఇందులో 6, 7,8 తరగతులు ఉంటాయి. ఈ దశలో పిల్లలు విభిన్న విషయాలపై లోతైన అవగాహన పెంచుకుంటారు. వివిధ రంగాలలో నైపుణ్యాలను వృద్ధి చేసుకుంటారు. ఉన్నత దశ (వ్యవధి 4 సంవత్సరాలు, వయసు 14 నుండి 18 సంవత్సరాలు) ఇందులో రెండు దశలు ఉంటాయి. ఒకటి 9,10 తరగతులు రెండవది 11,12 తరగతులు, ఈ దశలో విద్యార్థులుతమకు నచ్చిన విషయాలను ఎంపిక చేసుకొని ఉన్నత విద్యకు సిద్ధమవుతారు. ఈ నాలుగు సంవత్సరాలు క్రిటికల్ థింకింగ్‌తో పాటు మల్టీ డిస్నినరీ అధ్యయనం పెంపొందించుకుంటారు. ఈ నూతన విద్యావిధానాన్ని పాఠశాల విద్యలో పదకొండు, పన్నెండు తరగతుల విలీనం చేయడానికి దేశ వ్యాప్తంగా 8 రాష్ట్రాలు మినహా అన్ని రాష్ట్రాలు సమ్మతిని ప్రకటించాయి. అయితే తెలంగాణ ప్రభుత్వం ఒకే బోర్డు



ఏర్పాటుకు సలహాలు, సూచనలు, ప్రయోజనాలు, నష్టాలు వ్యక్తపరచాలని కోరడమైనది. ఈ ప్రతిపాదన అధునాతనమైనదికాదు. ప్రస్తుతం కేంద్రీయ పాఠశాలల్లో కొనసాగుతుంది. మన రాష్ట్రంలో కూడా గతంలో మల్టీపర్పస్, హైయర్ సెకండరీ పాఠశాలలు ఉండేవి. వాటివల్ల కూడా పలుప్రయోజనాలు సాధించడమైనది. పాఠశాల విద్యలో పదకొండు పన్నెండు తరగతుల ఏర్పాటు వల్ల పలు ప్రయోజనాలు చేకూరే అవకాశం ఉంది. అవి దేశవ్యాప్తంగా ఒకే విద్యా విధానానికి తోడ్పాటు, దేశవ్యాప్తంగా ఒకే విద్యా విధానం వల్ల విద్యార్థులకు పలు ప్రయోజనాలు చేకూరుతాయి. ముఖ్యంగా విద్యార్థులు ఎక్కడ చదివినా ఒకే సిలబస్ పరీక్ష విధానం, ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి మారే అవ కాశం సమకూరుతుంది. విద్యాపరమైన పేద, ధనిక అంత రాలను తొలగించడానికి, నాణ్యత మెరుగుపరచడానికి తోడ్పడుతుంది. సమైక్యత భావాన్ని పెంపు చేసి సమాజానికి ఎంతో మేలు చేకూర్చుతుంది. పదవ తరగతి తదనంతరం పై చదువులు కొనసాగించలేక జరుగుతున్న డ్రాప్ ఔట్స్ ను నివారిస్తుంది. పదవ తరగతి తదనంతరం సుమారు 20 శాతం మంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బంది లపై చదు వులు అందుబాటులో లేనందున చదువుకు స్వస్తి చెప్పి నిష్ప్రయోజకులుగా రూపొందుతున్నారు. పాఠశాల లోనే పదకొండు పన్నెండు తరగతులు ఉంటే విద్యార్థుల డ్రాప్ ఔట్స్‌ను పూర్తిగా నిరోధించే అవకాశం చేకూరుతుంది. గ్రామీణ ప్రాంతాలలో ఉండే ఉన్నత పాఠశాలలోనే పై చదువులు కొనసాగించే అవకాశం ఉన్నందున పట్టణాలకు వలసలు తగ్గిపోవడమే కాక గ్రామీణాభివృద్ధికి దోహదకారి అవుతుంది. భారతదేశంలో 2001 జనాభా గణన ననుసరించి 14.4 మిలియన్ల మంది గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు రోజువారి పని, ఉన్నత చదువులకు వలసలు జరుగుతున్నాయి. దీనివలన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కృంగిపోతుంది. పట్టణీకరణ పెరిగి పలు సమస్యలు ఉత్ప న్నమవుతున్నాయి పదకొండు, పన్నెండు తరగతుల లోవృత్తి విద్యలు అభ్యసించే అవకాశం ఉన్నందున స్వయం ఉపాధి సమకూర్చుకోవడానికి, నిరుద్యోగ నిర్మూలనకు తోడ్పడు తుంది. ప్రస్తుతం యువతలో నేటి చదువులు బ్రతుకు తెరువు చూపడం లేదని, జీవనోపాధికి తోడ్పడడం లేదని, చదువుకోన్నందుకు లేక చదువుకున్నందున ప్రయోజనం చేకూరడం లేదని నిరాశ నిర్లిప్తతకు లోనౌతున్నందున వృత్తి విద్యల ద్వారా ఉపాధి సౌకర్యం సమకూర్చుకొని పూర్తి ప్రయోజనం పొందే అవకాశం సమకూరుతుంది. బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఇంటర్మీడియట్ బోర్డు రెండు విలీనంతో ఒక బోర్డు నిర్వహణకు అయ్యే వ్యయంలో కొంతమేరకు పొదుపు చేసుకొని ఆ నిధులను కూడా విద్యారంగానికి వెచ్చించే అవకాశం ఉంటుంది. ఈ రెండు బోర్డులు విలీనం వల్ల పలు ప్రయోజనాలు పొందే అవకా శం ఉన్నందున పైగా ఎటువంటి నష్టం లేనందున రాష్ట్ర ప్రభుత్వం సానుకూల చర్య చేపట్టి వచ్చే విద్యా సంవత్సరం నుండి పాఠశాల విద్యలోనే పదకొండు, పన్నెండు తరగతులు ఏర్పాటు చేయాలని, విద్యార్థులు ప్రయోజనం పొందాలని కోరుకుందాం. •

# ఆరోగ్యాన్ని కాటేస్తున్న కాలుష్యం!

కాలుష్య నివారణకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణయోగ్యం కాని విధానాలతో ప్రయోగాలు చేస్తూ రోజురోజుకు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా పాలకులు కాలుష్యనివారణకు రూపొందిస్తున్న నిబంధనలు, చట్టాలను త్రికరణశుద్ధిగా అమలు చేయకపోవడంతో పర్యావరణం విషతుల్యంగా మారుతున్నది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది రకరకాల వ్యాధులకు లోనవుతున్నారు. ఇందులో కొందరు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి మంచానికే పరిమితమై కృంగి, కృశించి అసువులు బాస్తున్నారు. అంతకంతకు కాలుష్య మేఘాలు ప్రజారోగ్యాన్ని చుట్టుముట్టడం ఆందోళన కలిగిస్తున్నది. దేశంలో ప్రధానంగా అనేక నగరాల్లో పరిస్థితి దారుణంగా తయారవుతున్నది. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం అదుపు తప్పిపోతున్నది. గత యేడాది శీతాకాలంలో పదిరోజుల పాటు పాఠశాలలకు సెలువులు ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఢిల్లీలోనే కాదు దేశంలో అనేక నగరాల్లో కాలుష్య పరిస్థితి ప్రమాదకర స్థాయికి చేరుకుంటుందనే వార్తలు వెలువడుతున్నాయి. కోల్‌కతా, ముంబాయి నగరాలతోపాటు దక్షిణాదిలోని బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలలో వాయు నాణ్యత క్షీణిస్తున్నది. ఢిల్లీకి పొరుగునున్న యుపి, హర్యానా, పంజాబ్, రాజస్థాన్‌లలో కూడా ఈ కాలుష్యరక్కసి యేడాది యేడాదికి విజృంభించింది. ప్రధానంగా పంట పొలాల్లోని వ్యర్థాలను దగ్ధం చేయడంతో వ్యాపిస్తున్న పొగ చుట్టుముడుతున్నది. పర్యావరణం, నీటి, గాలి, నాణ్యత, వాతావరణంలో మార్పులు, అటవీ విస్తీర్ణం తగ్గడంతోపాటు చెత్త నిర్వహణలో లోపాలు కారణంగా వాయుకాలుష్యం నగర జీవి ఊపిరితిత్తులకు తూట్లు పొడుస్తుందన్న విషయం అనేక సర్వేల్లో వెల్లడవుతున్నది. మరికొన్ని నగరాల్లో పారిశ్రామిక కాలుష్యం అగ్రస్థానంలో ఉంది. హైదరాబాద్ నగరంలో నీటి, వాయు కాలుష్యంతోపాటు నిర్మాణంలో రంగంలో పీల్చేగాలిలో ధూళికణాలు అధికంగా ఉన్నట్లు వెల్లడవుతున్నది. మురికివాడల నిర్మూలకు ప్రత్యేక కార్యక్రమాలు తీసుకుంటున్నా మరొకపక్క పెరిగిపోతున్న వలసలతో సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. కాలుష్యాన్ని తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాలు అంతగా సఫలీకృతం కావడం లేదు. నేషనల్ ఎయిర్ ప్రోగ్రామ్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఐదేళ్ల క్రిందట చేపట్టిన కార్యాచరణ ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపోతున్నది. గత నాలుగేళ్లుగా వందలాది కోట్లు ఖర్చు చేస్తున్నా హైదరాబాద్, రంగారెడ్డిలో వాయుకాలుష్యం ఆందోళనకర స్థాయిలో ఉంటున్నది. వాయుకాలుష్యం కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల కంటే దాదాపు ముప్పైశాతంపైగా అధికంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల కంటే వందశాతానికిపైగా నమోదవుతున్నది. దేశవ్యాప్తంగా వందలాది నగరాల్లో, పట్టణాల్లో ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ఉండాల్సిన నలభై మైక్రోగ్రాముల కంటే మించి కణాలు ఉంటున్నాయి. దాంతో జాతీయ హరిత న్యాయస్థానం 2018 ఆదేశాల మేరకు కేంద్ర పర్యావరణ శాఖ దేశంలోనే 130 నగరాలు, పట్టణాలకు దీన్ని తగ్గించే లక్ష్యంగా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి హైదరాబాద్, సంగారెడ్డిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమాన్ని అమల చేసేందుకు రాష్ట్ర జిల్లాస్థాయిలో కమిటీలను వేశారు. నాలుగేళ్లలో ఆరువందల కోట్ల రూపాయలకుపైగా విడుదల చేశారు. కానీ ఆశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. ఇప్పటివరకు కేవలం నాలుగువందల యాభైఐదు కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. దేశవ్యాప్తంగా 2025-26 నాటికి సూక్ష్మకణాలను నలభైశాతానికినియంత్రిస్తామంటూ లక్ష్యాన్ని నిర్దేశించుకొని కోట్లాది రూపాయలు వెచ్చించినా పరిస్థితిలో ఏమాత్రం మార్పు రావడం లేదు. పంజాబ్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, యుపి తదితర రాష్ట్రాల్లో నిబంధనలను పట్టించుకోవడం లేదు. అంతర్జాతీయంగా ప్రధానంగా చైనా, అమెరికా లాంటి దేశాల్లో వాయుకాలుష్యాన్ని నియంత్రించడంలో సఫలీకృతం అవుతున్నట్లు అనేక అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. కాలుష్యానికి మూలమైన దాదాపు ఐదువందలకు పైగా కార్ల మోడళ్లను నిషేధించి ప్రజారవాణా వ్యవస్థను కాలుష్యరహితంగా మార్చేందుకు చైనా తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలు ఇచ్చాయి. బొగ్గు ఆధారిత, విద్యుత్ కర్మాగారాల నిర్మాణాలకు దాదాపు ఫుల్‌స్టాప్ పెట్టించి అడవుల సంరక్షణకు ప్రత్యేక దృష్టి సారించింది. మన దేశంలో పర్యావరణాన్ని కాలుష్యం చేస్తూ మోతాదుకు మించి పొగను వదులుతున్న వాహనాల సంఖ్య కోట్లల్లో ఉండొచ్చు. వాటిని నియంత్రించేందుకు ఎన్నో చట్టాలు తీసుకువచ్చారు. నిబంధనలను విధించారు. జరిమానాలు వేస్తున్నారు. కానీ అవేమీ ఆగడం లేదు. ఫలితంగా వాతావరణంలో కార్బన్‌మోనాక్సైడ్, నైట్రిక్ ఆక్సిడ్, దుమ్ము, ధూళి పెరిగిపోతున్నది. మొత్తం మీద తీవ్రస్థాయిలోవెలువడుతున్న విషవాయువుల వల్ల పర్యావరణం విషతుల్యమై అనేక వ్యాధులకు లోనవుతున్నారు. వాయు కాలుష్యం మంచి కొలెస్ట్రాల్‌ను చెడు కొలెస్ట్రాల్‌గా మారుస్తూ గుండెజబ్బులకు కారణమవుతూ, పక్షవాతానికి, ఊపిరితిత్తుల కేన్సర్‌లకు మూలమవుతుందనే విషయం అనేక పరిశోధనల్లో బయటపడుతున్నది. ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఈ కాలుష్య భూతాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉంది. సమస్య తీవ్రతను గుర్తించి నివారణకు ఆచరణయోగ్యమైన విధానాలను ప్రకటించడమే కాదు, అమలుకు త్రికరణశుద్ధిగా కృషి చేయాలి. అన్నింటికంటే ముఖ్యంగా పర్యావరణం పట్ల అన్నివర్గాల ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి జరగాలి.

# జన్మ పాపమా? ఆడజన్మ శాపమా!

వాసి జ్యోత్స్న

పురిటి బిడ్డ నుండి పండు ముసలి దాకా రక్షణ కోసం గావుకేకలేస్తుంటే ఎందరో తల్లులు కడుపు కోతతో గుండెలు బద్దలవుతుంటే ఎక్కడ వెతకాలి న్యాయం. దగాకోరు రాజ్యం అనాలా! దుండగులతో ప్రజాస్వామ్యం నిండిపోయింది అనాలా! సరి చేసేది ఎవరు! చెయ్యడానికి ప్రయత్నిస్తుందెవరు! నెలలతో నిండిన గర్భిణీని చూసినా కామమే, నెలల బిడ్డను చూసినా కామమే, నేలపై నడుస్తున్న ఆడపిల్లని చూసినా కామమే, రేపో మాపో పోయే ముసలమ్మను చూసినా కామమే... అసలు “తప్పెక్కడ జరుగుతుంది’ తల్లిదండ్రుల పెంపకంలోనా! పెరిగే వాతావరణమా! స్నేహితుల సహవాసమా! అమ్మ రొమ్ము పాలు తాగే కదా అంతవాళ్లు అవుతారు మరి. ఆకలి తీర్చిన రొమ్మును చూస్తే అంత కామమెందుకు మగ జాతికి. చెప్పాలంటే మగ జాతి అంటే మంచివాళ్ళు వస్తారు. అలాంటి ఆలోచనలు కలిగిన జాతిని మృగజాతి అనాలి. ఆడపిల్ల పేరులోనే వేరు చేసిందీ సమాజం. ఆడ పిల్ల అంటే పుట్టిల్లు తనది కాదు. అత్తింటివారు అక్కున చేర్చుకోరు. అన్ని బాధలు, అవమానాలుపడి జీవితాన్ని గెలవాలని ప్రయత్నిస్తుంటే బజారు కుక్కల్లామీద పడి పీక్కుతింటున్నారెంటిరా..? మగాడితో సమానంగా విజయకేతనం ఎగురవేస్తున్నారు ఆడవాళ్లు. అంతరిక్షయాణం చేస్తున్నారు. దూరదేశాలు వెళ్ళి విద్యానభ్యసించి శభాష్ అనిపించుకుంటున్నారు. వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడి బేషుగ్గా బ్రతుకుతున్నారు. తమకు తాము గౌరవం తెచ్చుకోవడమే కాకుండా కన్నవారికి ఆత్మ గౌరవాన్ని ఇచ్చి సంతృప్తినిస్తున్నారు. కంటే కూతుర్నే కానాలి అనిపించుకునే రీతిగా నేడు ఆడపిల్లలు వున్నారు. ఉన్న ఊరికి, కన్నతల్లికి పేరు తీసుకురావడమే కాకుండా దేశానికి మంచి పేరు తీసుకువచ్చేందుకు మంచిగా కష్టపడుతున్నారు. అలాంటి బంగారు తల్లుల భవిష్యత్‌కి బాటలు వేయాలి గాని, బీటలు వేసి తగలెట్టేస్తూ, ముక్కలు చేస్తూ ముచ్చటైన జీవితాన్ని చెల్లా



చెదురు చేసేస్తున్నారు అసలు తప్పెక్కడ జరుగుతుంది. శిక్షలు లేవనా! న్యాయస్థానలు తీర్పులు త్వరపెట్టలేవనా! పట్టించుకునే నాయకులు లేరనా! ఎక్కడ ఎక్కడ తెలుసుకునే ప్రయత్నం చెయ్యండి ప్లీజ్.. ప్లీజ్.. ఒడిని చేర్చుకొని పాలిచ్చి, లాలించి పెంచిన నీ తల్లీ ఒక ఆడది. గుండెలకు హత్తుకుని నీ ఇచ్చను తీర్చి మరో బిడ్డకు జన్మ నిచ్చే నీ ఆలీ ఒక ఆడది. అది మరచిపోయి విషం జిమ్మే పాములా బుసకొడుతూ ఆడదాని ఉసురు పోసుకోవద్దు. ప్రభుత్వాలు మారాలి అని కోరుకోవడం కాదు వాడొచ్చి ఏం చేసాడు. వీడొచ్చి ఏం పీకాడు అని కాదు మనిషిగా మన విజ్ఞత ఏమైంది మొదట తెలుసుకోవాలి కదా! ఇప్పటికీ మించి పోయింది ఏమీ లేదు. తప్పు జరిగిన చోట శిక్షలు కఠినంగా అమలు చెయ్యండి. ప్రజల్లో మార్పు వచ్చేలా జీవోలు తీసుకురండి. వ్యక్తిత్వాలు మారాలి. ఆడది వ్యసనం కాదు జీవితాన్ని ప్రసాదించిన దేవత అని తెలిసేలా చెయ్యాలి. తప్పు జరిగాకా అన్ని టీవీ ఛానల్స్‌లో మూడు రోజులు ఒకే దృశ్యాన్ని చూపించి చూపించి ప్రజలకి పిచ్చెంకించడం కాదు. తప్పు చేసినోడి ముసుగు తీసి ఏలాంటి శిక్ష విధించారోఅదే టీవీ ఛానెల్స్‌లో ఒక్కరోజు చూపించినా తప్పు చెయ్యాలి అనే ఆలోచన వచ్చినోడు కూడా కుక్కిన పేనులా పడుంటాడు. విధి విధానాలు మారాలి. మనం బావున్నాం అది చాలు అనుకుంటూపోతే దేశంలో ఆడజాతి అంతరించిపోతుంది. అప్పుడు భవిష్యత్‌లో మగవారికి సరిపడా ఆడపిల్లలు దొరకరు. అప్పుడు అడవుల్లో జంతువుల మాదిరి దేశంలో పరిస్థితి. అంటే, బలహీన జంతువును బలం కలిగిన జంతువు పీక్కు తిన్నట్టు ఉంటుందన్నమాట. ప్రస్తుతం మన దేశంలో సగం ఈమాదిరి ఉందని నిర్మొఖమాటంగా చెప్పవచ్చు. ఇంకా చెప్పాలంటే ఆడపిల్లల్ని కనడానికి భయపడే పరిస్థితులు లేకపోలేదు. కాకపోతే, పుట్టిన బిడ్డకు ఒడ్ల గింజవేసి చంపేసే ఆరోజుల నుండి పుట్టి ఊయలూగే బిడ్డను తీసుకెళ్లి తన కోర్కెలు తీర్చుకునేంతగా మారింది దేశ భవిష్యత్. తప్పు తెలుసుకోవాలి. తెలియజేసే చర్యలు చేపట్టాలి. ‘గాంధీ’ చెప్పినట్టు ఒక చెంపమీద కొడితే మరోచెంప చూపించే అహింసా వాదం లేదిప్పుడు“. తల్లడిల్లుతున్న ఆడబిడ్డల తల్లులకు ప్రశాంతత కావాలి. రగిలే గుండెలకు శాంతి కావాలి. •

నిరంతరం నేర్చుకుంటూ ఉంటే
తప్ప ఉపాధ్యాయుడనే వాడు
నిజంగా మరొకరికి విద్య నేర్పలేడు.



ఠాగూర్

ఎంత గొప్ప చదువు అయినా,
ప్రావీణ్యత అలవాటు
అవ్వాలంటే అది చెప్పే వారిపై
ఆధారపడి ఉంటుంది.



మహాత్మాగాంధీ

# ప్రజావాక్కు



### టర్కీని నిషేధించాలి

పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ చేపట్టిన ‘ఆపరేషన్ సిందూర్’ సమయంలో టర్కీ బహిరంగంగా పాక్‌కు మద్దతు ప్రకటించింది. అంతేకాక పాకిస్థాన్‌కు పలు రకాల ఆయుధాలను సైతం సరఫరాచేసింది. ఇది భారత ప్రజల్లో తీవ్రవ్యతిరేకతకు దారితీసింది. ఫలితంగా, బాయ్‌కాట్ టర్కీ అనేనినాదం సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమవుతోంది. టర్కీలో భూకంపం విపత్తు సంభవించినప్పుడు, భారత్ ముందుండి అగ్రరాజ్యాల కంటే మిన్నగా సహాయ సహకారాలను అందించి తన దాతృత్వం, మిత్రవైఖరిని చాటుకుంది. అయితే ఇదంతా మరిచిపోయి టర్కీ ఉగ్రవాదాన్ని పెంచి పోషించే పాకిస్థాన్‌కు బహిరంగంగా మద్దతు పలకడం సహించరాని విషయం. ఇటువంటి సహాయం పాకిస్థాన్‌పై ఉగ్రవాద దాడులను మరింత ప్రేరేపిస్తుంది.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### పాత స్టేషన్ పాయింట్లు కేటాయించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఉపాధ్యాయ బదిలీల్లో2021ట్రాన్స్ఫర్స్‌లో బదిలీకాబడి2023 2025 సంవత్సరాల వరుసగా రెండుసార్లు రేషనలైజేషన్‌కు గురికాబడుతున్న ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారు. వారికి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పాత స్టేషన్ పాయింట్లు 2021నుంచి 2023వరకు అనగా రెండు సంవత్సరాల కాలంమాత్రమే వస్తున్నాయి. దీంతో ఆ ఉపాధ్యాయులు బదిలీలలో స్టేషన్ పాయింట్లలో వెనుకబడుతున్నారు. కావున దీన్ని సరిచేసి 2021 లో ట్రాన్స్ఫర్ కాబడి 2023, 2025 సంవత్సరాలలో వరుసగా రెండుసార్లు రేషనలైజేషన్ గురికాబడిన ఉపాధ్యాయులకుపాత స్టేషన్ పాయింట్లు ఎనిమిది సంవత్సరాలు ఇవ్వాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### ప్రత్యేక హోదా కల్పించాలి

ప్రాథమిక పాఠశాల నుండి యూనివర్సిటీ స్థాయి వరకు విద్యాసంస్థలలోపాఠశాలస్థాయి, కళాశాల స్థాయిలో, గురుకుల పాఠశాలలో కళాశాలలో లెక్చరర్, టీచర్స్, యూనివర్సిటీ స్థాయిలో డాక్టరేట్‌పట్టా పొందిన వారిని గుర్తించి తగిన గుర్తింపు ఇవ్వాలి. విద్యార్థులకు తోటి టీచర్స్ లెక్చరర్స్‌లకు ఆదర్శం. స్ఫూర్తి దాయకంగా ఉంటుంది.

- రాపాక రవీందర్, జనగాం

### నేపాల్ ప్రధాని వ్యాఖ్యలు సమంజసం కాదు

శ్రీరాముడి జన్మస్థలం మీద నేపాల్‌ప్రధాని ఓలీ శర్మ వివాదాస్పద మాటలు సమంజసంకాదు. భారత్ లోని అయోధ్య రాముడి జన్మస్థలం ఇక్కడ పెద్దఎత్తున దేవాలయం కట్టించా రు. నిత్యం లక్షలాది భక్తులు రామ భక్తితో అయోధ్య వెళుతూ వుంటారు. నేపాల్ ప్రధాని మతి కోల్పోయి శివుడు విశ్వామిత్రులు రాముడు నేపాల్‌లో పుట్టారని మాట్లాడుతూ భారతీయులను రెచ్చగొడుతూ వున్నారు. మొదటి నుండి సంచలన వ్యాఖ్యలు చేయడం వారికి అలవాటుగా మారింది. ఓలి శర్మ హుందాగా ఉంటూ తన మాటలను వెనక్కు తీసుకోవాలి.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### ఆర్థిక స్వావలంబన

ఉపాధి హామీ కేవలం ఆర్థిక శక్తికి ఇచ్చేది మాత్రమే కాదు. కూలీలా స్వీయ అభిమానంను పెంచేదికూడా. 1982లో వచ్చిన డ్వాక్రా పథకం కానీ శివరామ కృష్ణన్ కమిటీ సిఫారసులతో వచ్చిన చిన్న పరిశ్రమలు ఫామ్ చేసే లేదా వాటికి ఆలంబనగా నిలిచే పథకాలు కానీ మహిళలను శక్తివంతం చెయ్యడానికి అని మాత్రమే గమనించాలి. ఉపా డ్వాక్రాలో లోన్ తీసి దానిలో పాడి పశువులను కొనుగోలు చేసి వాటిని ఉపాధి హామీ ద్వారా షేడ్స్ ఫామ్ చేస్తే జంతు సంపద పెరగడంతో పాటు ఆస్తి నిలబడుతుంది అనేది నిర్వివాదాంశం అంత మాత్రమే కాదు ఉపాధి హామీలో పశువులకు ఉపయోగపడే నీటి తొట్లు నిర్మాణం కూడా చేపట్టవచ్చు. ఇకపోతే గొర్రెల, కోళ్ల పెంపకం వాటికి సంబంధించిన కొట్టాల నిర్మాణం చేపట్టడం ద్వారా కూడా ఆర్థిక స్వావలంబన చేపట్టవచ్చు.

-భారత అవినాష్, జనగామ

### డిఏ బకాయిలు చెల్లించాలి

కరోనా సమయంలో నిలిపివేసిన 18 నెలల డిఏ బకాయిల చెల్లింపు విషయంలో నేషనల్ కౌన్సిల్ అఫ్ జాయింట్ కన్సల్టేటివ్ మెషినరీ స్టాండింగ్ కమిటీ 63 వ సమావేశంలో ప్రభుత్వం తిరిగిచెల్లించాలి అనివార్యాణించడం కొంచెం సహృదయనతో ఆలోచించవలసిన విషయం. ఆ సమయములో చాలా కుదేలైన ఆర్థిక వ్యవస్థవల్ల ఈ నిర్ణయం ప్రభుత్వం తీసుకుంది. అంతేకాని ఎవ్వరి జీతాలు ఆపలేదుకదా. సరిఅయిన పనులు లేక దుర్భర స్థితిలో ఉన్న జనాలను, వ్యవస్థలను చూసాం. 8వ వేతన సంఘం పూర్తిగా అమలు చేయాలి.

-గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

# జనాభా నియంత్రణపై అవగాహన పెంచాలి



రామ కిష్టయ్య సంగనభట్ల

నిర్ణీత ప్రాంతంలో నివసించే ఒకే జాతికి చెందిన జీవుల సమూహమే జనాభా. ఒక నిర్ణీత కాల వ్యవధిలో జనాభాలో వచ్చే జననాల సంఖ్యను జనన రేటు అంటారు. ఇందులో సమగ్ర జనన రేటు, విశిష్ట జనన రేటు, శక్యర్థ జనన రేటు, జీవావరణ జనన రేటు అనే వివిధ లెక్కింపు విధానాలున్నాయి. అలాగే మరణాల రేటులో సమగ్ర, విశిష్ట, శక్యర్థ, జీవావరణ మరణ రేట్లు ఉంటాయి. మరణాల రేటుకంటే జననాల రేటు ఎక్కువ ఉన్నపుడే ఆ జనాభా పరిమాణం పెరుగుతుంది. రోజు రోజుకు పెరిగిపోతున్న జనాభా, తద్వారా తలెత్తే దుష్పరిణామాలను వివరించేందుకు, సమస్యలపై అవగాహన కలిగించేందుకు ఏటా జులై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదల, తగ్గుదలకు సంబంధించిన విషయాలపై ప్రజలలో చైతన్యం కలిగించడానికి ఐక్యరాజ్య సమితి 1989లో దీనిని ప్రారంభించింది. 1987న జన్మించిన ఒక శిశువుతో ప్రపంచ జనాభా 500 కోట్లకు చేరింది. ఆరోజునే ప్రపంచ జనాభా దినంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. 1989 నుండి జులై 11వ తేదీన ప్రపంచ జనాభా దినోత్సవంగా పాటిస్తున్నారు. ప్రపంచ జనాభాలో 40 శాతం మూడవ ప్రపంచ దేశాలైన ఇండియా, చైనాలలోనే ఉన్నారు. ప్రపంచ జనాభా ప్రతి సంవత్సరం 9కోట్ల 20లక్షలు అదనంగా పెరుగుతోంది. 1850లలో మొదటిసారి జనాభా వందకోట్లను దాటింది. అక్కడి నుంచి కేవలం 150 ఏళ్ల కాలంలోనే 650 కోట్లను దాటేసింది. వచ్చే యాభైఏళ్లలో 900కోట్లకు చేరుకుంటుందని అంచనా. ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం 2024కల్లా భారత్, చైనాల జనాభా 1.44 బిలియన్లుగా ఉంటుంది. అప్పటికే చైనా జనాభాను మించుతుంది. భారతదేశంలో 1872నుంచి 2011 వరకు మొత్తం 15 పర్యాయాలు జనగణన చేశారు. 2011లో 15వసారి 28 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాల్లో జనగణన నిర్వహించారు. అప్పటికి తెలంగాణ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఉంది. భారతదేశంలో తెలంగాణ 29వ రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత జనగణన ఒక్కసారి కూడా చేపట్టలేదు. 2011 గణాంకాల ప్రకారం భారతదేశ జనాభా 1,21,05,69,573. తెలంగాణ రాష్ట్ర జనాభా 3,51,93,978. తెలంగాణ ప్రస్తుత జనాభా 3,50,03,674. ఖమ్మం జిల్లాలో 327 గ్రామాలను (7 మండలాలు) ఆంధ్రప్రదేశ్‌లో కలిపారు. 2011లో భారతదేశ జనాభా వృద్ధిరేటు 17.7శాతం. రాష్ట్రంలో 2011 మధ్య కాలంలో జనాభా వృద్ధిరేటు 13.58 శాతం. 2011 లెక్కల ప్రకారం భారత్‌లో సగటు పట్టణ జనాభా శాతం 31.2 ఉండగా, రాష్ట్రంలో పట్టణ జనాభా శాతం 38.67గా ఉంది. అంటే రాష్ట్ర పట్టణ జనాభా జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉన్నట్లు గమనించవచ్చు. రాష్ట్రంలో గ్రామీణ జనాభా ప్రస్తుతం 213.95 లక్షల మంది. రాష్ట్ర మొత్తం జనాభాలో గ్రామీణ జనాభా వాటా ప్రస్తుతం 61.12 శాతం. 2020



మార్చి నాటికి ప్రపంచ జనాభా7.8 బిలియన్లకు చేరినట్లు అంచనా. 2023 వరకు 8 బిలియన్లకు, 2037 వరకు 9, 2055 వరకు 10 బిలియన్లకు చేరనున్నట్లు అంచనా. యునైటెడ్ నేషన్స్ డాటా ప్రకారం 2020 జూలై 9 నాటికి భారత జనాభా 1,380,270,828 ఉన్నట్లు అంచనా. అంటే ప్రపంచ జనాభాలో ఇది 17.7 శాతం. పెరుగుతున్న జనాభాలో అభివృద్ధి చెందుతున్న దేశాలు కీలకపాత్ర పోషిస్తున్నట్టు ఈ సందర్భంగా ఐక్యరాజ్య సమితి అభిప్రాయపడింది. భారత్, అమెరికా, చైనా, బంగ్లాదేశ్, పాకిస్థాన్ తదితర తొమ్మిది దేశాలు వచ్చే 2050 నాటికి ప్రపంచ జనాభాలో సగం శాతాన్ని ఆక్రమిస్తాయని సమితి తెలిపింది. ప్రపంచ జనాభా మొత్తంగా అడ్డూఅదుపూ లేకుండా పెరిగిపోతోంది. అవసరాలు తీర్చే వనరులు ఆ స్థాయిని అందుకోలేకపోతున్నాయి. ఆశలు, ఆకాంక్షలు అపరిమితం అయిపోతున్నాయి. తీర్చగలిగే సంపద, సేవలు, సరుకులు అంతరించిపోతున్నాయి. పర్యవసానం జన విస్ఫోటనం. ప్రజలు భూమికి భారమై, శాపమైపోతున్నారు. కనుకనే దేశాలమధ్య జల, జన యుద్ధాలు, ఆధిపత్య పోరాటాలు, భూమి, సహజ సంపదలను దోచుకోవడాలు, దాచుకోవడాలు జరుగుతున్నాయి. జనాభా పెరుగుదల ఆహార పదార్థాల ఉత్పత్తి పెరుగుదల కంటే చాలా ఎక్కువగా ఉంటోంది. అందువల్ల డిమాండ్ అధికంగా పెరిగి సప్లై తగ్గుముఖం పట్టడంతో ధరలు పెరిగిపోతున్నాయి. డిమాండ్, సప్లయిల మధ్య అగాధం పెరిగిపోతోంది. పర్యవసానంగా ఉన్నవాడు కొనుక్కోగలుగుతున్నాడు. లేనివాడు ఆకలికి గురి అవుతున్నాడు. కనుక ప్రపంచంలో అనేకచోట్ల ఆకలిచావులు సంభవిస్తున్నాయి. ఆఫ్రికా దేశాలలో సంభవించే లక్షల ఆకలి చావులే దీనికి సాక్షీభూతాలు. ప్రకృతి వనరులకు సహజ సంపదలకు, జల, భూవనరులకు ఒక పరిమితి ఉంది. అవి ఒక పరిమితికి మించని జనాభా అవసరాలకు మాత్రమే ఉపకరించబడతాయి. ఆ పరిమితికి మించి జనాభా ఉంటే నిరుపయోగస్థాయికి చేరుకుంటాయి. పైగా మితిమీరిన సేద్యం, వినియోగం, దుర్వినియోగం వలన భూసారం తగ్గి తరుగుదల కాలుష్యం చోటు చేసుకుంటాయి. సంపదలు సరిపోవు. ఆపైన దారిద్ర్యం, ప్రకృతి వైపరీత్యాలతో పాటు ఒకరి నొకరు దోచుకోవడాలు, మోసాలు, దౌర్జన్యాలు, దొంగతనాలు చోటు చేసుకుంటాయి. సమాజం అదుపు తప్పుతుంది. మన దేశం జనాభా పెరుగుదల ఇదే రీతిలో కొనసాగితే 2025 నాటికల్లా భారత్ చైనాను అధిగమించి ప్రపంచంలో అత్యధిక జనాభాగల దేశంగా ఆవిర్భవించడం తథ్యం అని అమెరికా గణన సంస్థ వెల్లడించింది. సత్వరమే భారత్ దిద్దుబాటు చర్యలు, జనస్థిరీకరణ, నియంత్రణకు పూనుకోకుంటే ఆఫ్రికా దేశాల మాదిరి ఆకలి, దారిద్ర్యం, కరవు రక్కసులు పడగలు విప్పడం అనివార్యం అనడంలో సందేహం అక్కర లేదు. ప్రపంచంలోనే కుటుంబనియంత్రణ పథకాలను అధికారికంగా ప్రవేశపెట్టిన దేశం మన దేశమే. 1950లోనే కుటుంబ నియంత్రణ కొరకై నూతన సూత్రీకరణాలను చేసి లక్షలు, కోట్లు ఖర్చు చేసింది. కారణాలు ఎవయినా ఆశించిన ఫలితాలు సాధించలేకపోయాం. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రాకపోవడం, ప్రభుత్వ పథకాలలో అవకతవకలు, పారదర్శకత లోపించడం, మూఢనమ్మకాలు, అవిద్య, స్త్రీ సాధికారిత లేకపోవడం లాంటివి అవరోధాలైనాయి. భారత్‌లో జనాభా నియంత్రణ పథక అమలు వల్ల మన ఆర్థిక రంగానికి అనుగుణంగా అన్ని కోణాలలో తీర్చిదిద్దడం, ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చడం, జన జీవన శైలిని, ప్రమాణాలను వృద్ధి పర్చడం జరిగింది. ఈ భూమ్మీద వందకోట్ల మందికి పౌష్టికాహారం దొరకడం లేదు. 40 కోట్ల మందికి ఆహారం దొరకడం లేదు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని అధిక జనాభాగల దేశాలు తక్షణమే జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలు మూఢనమ్మకాలను వీడి, కులాలకు, మతాలకు అతీతంగా కుటుంబ నియంత్రణ పథకాలను ఆచరించాలి. మహిళా సాధికారిత పెంచాలి. స్త్రీ విద్యను ప్రోత్సహించాలి. స్త్రీ విద్యావంతు రాలైతే సమాజం ఉన్నతస్థాయికి చేరడం ఖాయమని గ్రహించాలి. విద్యా వ్యాప్తిచేసి ప్రతిఒక్కరు మానవ వనరుగా మారిన రోజున దేశభ్యుదయానికి ఎన్నో మార్గాలున్నాయి అనడంలో అతిశయోక్తి లేదు. •

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)



# ఐదేళ్లూ నేనే సిఎం..

## సిద్ధరామయ్య స్పష్టీకరణ

**బెంగళూరు, జులై 10:** కర్ణాటక ముఖ్యమంత్రి మార్పుపై వస్తున్న వార్తలపై సిఎం సిద్ధ రామయ్య క్లారిటీ ఇచ్చారు. కర్ణాటకలో సిఎంగా ఐదేళ్ల పాటు తానే కొనసాగుతానని ముఖ్య మంత్రి సిద్ధరామయ్య స్పష్టం చేశారు. ఓ ఆంగ్ల ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై వస్తున్న ఊహాగానాలను కొట్టిపారేశారు. డికె శివకుమార్‌ను ముఖ్యమంత్రిగా చేయడం కోసం తనను కాంగ్రెస్ హైకమాండ్ రాజీనామా చేయ మని కోరినట్లు జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని వెల్లడించారు. ఐదేళ్లూ నేనే సిఎంగా ఉంటాను. ఈ విషయాన్ని నేను ఎప్పుడో స్పష్టంగా చెప్పాను. జులై 2వ తేదీన కూడా దీనిపై ప్రకటన రిలీజ్‌చేశాను. ఆ సమయంలో డికె శివకుమార్‌కూడా అక్కడే ఉన్నారు. ఆయన కూడా పోటీదారే. అందులో తప్పు ఏముంది. 'కుర్చీ ఇప్పుడు ఖాళీగా లేదు' అని శివకుమారే అన్నారని తెలిపారు. నాయకత్వం మార్పుపై పార్టీ హైకమాండ్ టైమ్‌లైన్ లేదా సూచనలు ఏమీ చేయలేదని సిఎం సిద్ధ రామయ్య ప్రకటించారు. రెండున్నర సంవత్స రాల అంశాన్ని ఎవరూ నిర్ణయించలేదని వెల్లడించారు. హైకమాండ్ నిర్ణయం తీసుకొంటే తమకు చెబుతుందని, వాటిని తాము అమలు చేస్తామని వివరించారు. ఇక పార్టీ నాయకత్వంపై కాంగ్రెస్ రణ్‌దీప్ సుర్జేవాలా ఎటువంటి ప్రశ్నలు లేవనెత లేదని చెప్పారు. అయితే, డికె శివకుమార్‌కు మద్దతు ఇచ్చే కొద్దిమంది ఎమ్మెల్యేలు కూడా ఉన్నారని ఆయన అంగీకరించారు. తాను గురువారం అగ్రనేత రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ కోరానని, కానీ ఇప్పటివరకు దానిపై ఎలాంటి కన్ఫర్మేషన్‌లేదని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఆరోగ్యకరంగానే ఉందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు.

# కోర్టుకంటే ఐఎఎస్ అధికారి గొప్పవారా?

## జిసిసి కమిషనర్‌కు హైకోర్టు చురకలు

**చెన్నై,జులై 10:** ఐఎఎస్‌అధికారి కోర్టుకంటే గొప్పవారా అని జిసిసి కమిషనర్ కుమరగురుపరన్‌ను ఉద్దేశించి మద్రాస్ హైకోర్టు ప్రశ్నించింది. కోర్టు ఉల్లంఘన కేసులో గురువారం విచారణకు తప్పనిసరిగా హాజరుకావల్సిందేనని ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. జిసిసి పరిధిలోని ఐదవ జోన్ రాయపురంలో అనుమతి లేకుండా నిర్మించిన భవనాలపై జిసిసి ఎటువంటి చర్యలు చేపట్టలేదని దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు చట్టవిరుద్ధ నిర్మాణాలపై చర్యలు తీసుకోవల్సిందిగా 2021 డిసెంబర్‌లో ఉత్తర్వులు జారీచేసింది. అయితే ఎటువంటి చర్యలు తీసుకోని జిసిసికి వ్యతిరేకంగా రుక్మాంగదన్ హైకోర్టులో కోర్టు ఉల్లంఘన కేసు దాఖలు చేశారు. బుధవారం ఈ పిటిషన్ విచారణకు రాగా, హైకోర్టు ప్రథమ ధర్మాసనం ముందు అడినల్ సోలిసిట్ జనరల్ జె.రవీంద్రన్ హాజరై జిసిసి కమిషనర్‌కు విధించిన రూ.లక్ష జరినామా ఉత్తర్వులను రద్దుచేయాలని కోరారు. అప్పుడు జోక్యంకలుగజేసుకున్న ప్రధాన న్యాయమూర్తి శ్రీరామ్ తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. తన తరుఫు న్యాయవాదులు సమర్పించే ప్రమాణపత్రాలను చదవకుండా సంతకం పెడితే ఆయన కమిషనర్‌గా ఉండేందుకు అర్హత లేదన్నారు. కోర్టు కంటే ఐఏఎస్ అధికారి గొప్పవారా అని మందలింపు ధోరణిలో ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించారు. కోర్టు ఉల్లంఘన కేసు విచారణకు మంగళవారం హాజరుకాని జిసిసి కమిషనర్ కుమరగురుపరన్ తప్పనిసరిగా హాజరుకావల్సిందేనని ఉత్తర్వులు జారీచేశారు.

# వడోదరలో 17కి పెరిగిన మృతుల సంఖ్య

**వడోదర,జులై 10:** గుజరాత్‌లోని వడోదరలో నదిపై కూలిన వంతెన ప్రమాదంలో మృతుల సంఖ్య 17కి పెరిగింది. సహాయక బృందాలు మరో నలుగురు మృతదేహాలను వెలికితీసారు. మహీసాగర్ నదిపై నిర్మించిన వంతెన కూలిపోయి పదిమందికిపైగా మృతిచెందిన సంగతి తెలిసిందే. బుధవారం రాత్రినుంచి నిర్వహించిన గాలింపుచర్యల్లో మరో నలుగురి మృతదేహాలు లభించాయని వడోదర కలెక్టర్ అనిల్ ధామేలియా వెల్లడించారు. ఇప్పటికీ ముగ్గురు వ్యక్తుల ఆచూకీ లభించడంలేదని ఆయన చెప్పారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలునదిలో ఇప్పటికీ గాలింపు జరుపుతూనే ఉన్నాయి. ప్రజలు తాము ఏర్పాటుచేసిన కంట్రోల్‌రూమ్‌కు కాల్ చేయవచ్చని ఆయన స్పష్టంచేసారు. భారీ వర్షాలు నదిలో భారీగాఉన్నబురద కూడా గాలింపుచర్యలకు విఘాతం కలిగిస్తోంది. ఈ వంతెన కూలిన ప్రాంతంలో మరో ప్రత్యేక వంతెనను నిర్మించి ముందు నదిలో కూలిపోయిన వాహనాలను వెలికి తీసేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. ముజ్‌పూర్‌బ్రిడ్జి శ్లాబు కూలిపోవడంతో ఈ ఘోరప్రమాదం జరిగింది.

# బీహార్ ఓటరు జాబితా సవరణకు సుప్రీం ఓకే



## ప్రాథమిక పత్రాలుగా ఆధార్, రేషన్‌కార్డు, ఐడి కార్డును పరిగణనలోకి తీసుకోవాలని సూచన

**న్యూఢిల్లీ, జులై 10:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు గురువారం సుప్రీంకోర్టు అనుమతించింది. ఎస్ఐఆర్‌ను నిర్వహించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయంపై స్టే విధించేందుకు నిరాకరించింది. ప్రాథమిక పత్రాలుగా ఆధార్, రేషన్‌కార్డుతో పాటు స్వయంగా ఎన్నికల సంఘం జారీ చేసిన ఐడి కార్డును పరిగణనలోకి తీసుకోవాల్సిన సూచించింది. వెరిఫికేషన్ కోసం పరిశీలించాలనుకుంటున్న 11 పత్రాల్లో ఆధార్, ఓటర్ ఐడి కార్డులను చేర్చకపోవడం వివాదాస్పదమైంది. ఎన్నికల సంఘం ప్రస్తావించిన ఆ పత్రాలు సమగ్రంగా లేవని తాజాగా అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ఆధార్, ఓటర్, రేషన్ కార్డులను పరిగణనలోకి తీసుకోవడం న్యాయబద్ధమైందని మా అభిప్రాయం. వాటిని పరిగణించాలా లేదా? అన్నది ఎన్నికల సంఘమే నిర్ణయించాలి.. ఒకవేళ తీసుకోకపోతే అందుకు గల కారణాలను వెల్లడించాలి అని సుప్రీం పేర్కొంది.

ఇసిని అనుమానించడానికి ఏమీ లేదని, ఈ అంశంపై మరింత విచారణ జర గాల్సి ఉందని వ్యాఖ్యానించింది. అలాగే తదుపరి విచారణను జులై 28కి వాయిదా వేసింది. జులై 21కి కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయాలని ఈసిని ఆదేశించింది. ఇదే అంశంపై గురువారం జరిగిన విచారణలో కొన్ని ప్రశ్నలు సంధించింది. ఈ ప్రక్రియలో ఎలాంటి తప్పులేదు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఒక వ్యక్తి ఓటును కోల్పోతే దాని గురించి అడిగేందుకు సదరు వ్యక్తికి సమయం ఉండదు. ఆ సవరించిన జాబితాను సవాలు చేసేందుకు వీలు ఉండదు. అలాగే ఈ ప్రక్రియ నిర్వహించడానికి ఇసికి ఉన్న అధికారం ఈ సవరణ ప్రక్రియ చెల్లుబాటు నిర్వహిస్తున్న సమయంపై వివరణ ఇవ్వాలి అని ఆదేశించిన సంగతి తెలిసిందే. దాదాపు 20 ఏళ్ల క్రితం ఓటర్ల జాబితా ప్రక్షాళన జరిగింది. ఈ క్రమంలో మరోసారి సవరణలు చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఎన్నికల సంఘం ఎంచుకున్న సమయంపై కొంత వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ వివాదంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంలో నేడు విచారణ జరిగింది.

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను నిర్వహించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయం బీహార్ రాజకీయాల్లో వివాదాస్పదమవుతోంది. దీనిని వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు సుప్రీంకోర్టును ఆశ్రయించగా అక్కడ చుక్కెదురైంది. ఇసి చర్యలను సుప్రీం ధర్మాసనం సమర్థించింది. ఇది రాజ్యాంగం ప్రకారం జరుగుతోన్న ప్రక్రియే నని వ్యాఖ్యానించింది. అయితే ఎన్నికల ముందు నిర్వహించడాన్ని మాత్రం ప్రశ్నించింది.

# హసీనాపై ప్రత్యేక ట్రిబ్యునల్ అభియోగాలు




**ఢాకా, జులై 10:** బంగ్లాదేశ్‌లో పదవీచ్యుతి పొంది భారత్‌లో ఆశ్రయం పొందుతున్న మాజీ ప్రధాని షేక్ హసీనాపై పలు అభియోగాలను నమోదుచేస్తూ ప్రత్యేక విచారణకమిటీ నిర్ణయించింది. ఆమెతోపాటు ఆనాటి హోంమంత్రి అసదుజ్జమాన్‌ఖాన్, మాజీ పోలీస్‌చీఫ్ చౌదరి అబ్దుల్లా అల్‌మమన్‌లపైనా ఐదు అభియోగాలు నమోదుచేసారు. హసీనా వీరు లేకుండానే వీరిపై విచారణచేసి తీవ్రస్థాయి నేరాలకు పాల్పడినట్లు ముగ్గురుసభ్యుల ప్రత్యేకకమిటీ నిర్ణయించింది. జస్టిస్ గోలమ్ మొర్తుజా మొజుందార్ అధ్యక్షతన ఉన్న ఈకమిటీ వీరుముగ్గురిపైనా ఐదు అభియోగాలునమోదుచేసింది. ఈట్రిబ్యునల్ జూన్ ఐదో తేదీ ప్రారంభం అయింది. హసీనాను హాజరుకావాలని, వార్తాపత్రికల్లో ప్రకటనలు కూడా ఇచ్చారు. గత ఏడాది ఆగస్టు ఐదోతేదీ నుంచి షేక్ హసీనా భారత్‌లోనే ఆశ్రయం పొందుతున్నారు. నోబల్ పురస్కార గ్రహీత మహ్మద్‌యూనస్ అధ్యక్షతన తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటయింది. హసీనాను తమదేశానికి అప్పగించాలంటూ భారత్‌కు విజ్ఞప్తిచేసింది. అల్‌మమెన్‌ను గురువారమే అరెస్టుచేసారు. జడ్జిలు ఆమనపై అభియోగాలు నమోదుచేసిన వెంటనే ఆయన్ను అరెస్టుచేసారు. ఆలహమమన్ తాను నిర్దోషినని, విచారణలో ప్రాసిక్యూషన్‌కు అనుకూలంగానే నివేదిక ఇస్తానని ఆయన అభ్యర్థించారు.

ప్రాసిక్యూటర్లు హసీనా చేసిన వ్యాఖ్యలకు సంబంధించి లీక్ అయిన ఆడియో లను ఆధారాలుగాచూపిస్తున్నారు. షేక్ హసీనా, ఖాన్‌ల తరపున ప్రభుత్వమే న్యాయవాదిని నియమించింది. ట్రిబ్యునల్‌ముందు ఆయన తమ క్లయింట్లపేర్లను విత్‌డ్రాచేయాలనికోరుతూ పిటిషన్‌వేస్తే ట్రిబ్యునల్ వాటిని తిరస్కరించింది. తదుపరి విచారణను ఆగస్టు 3వ తేదీకి వాయిదా వేసింది. ఆమరుసటిరోజు ప్రాసిక్యూషన్ అందించిన నివేదికపై విచారణ జరుగుతుందని, సాక్షుల వాంగ్మూలాలుకూడా నమోదు అవుతా యని ట్రిబ్యునల్ జడ్జి వెల్లడించారు. హసీనా, ఆమె అవామీ లీగ్‌పార్టీలు ట్రిబ్యునల్, ప్రాసిక్యూ షన్ టీమ్‌ను తీవ్రస్థాయిలో విమర్శించాయి. వీరికి రాజకీయ పార్టీలతో సంబంధాలున్నాయని, ప్రత్యేకించి జమాతే ఇస్లామీ పార్టీతో విస్తృత సంబంధాలున్నాయని ఆరోపించారు. రాష్ట్ర బలగాలకు ఆదేశాలు జారీచేసినందుకుగాను హసీనా బాధ్యతవహిస్తారని ఆవామీ లీగ్‌పార్టీ అనుబంధ విభాగాలు మూకుమ్మడి దాడులు చేసి సామూహిక దాడులు, హత్యలు తీవ్రంగా గాయపరచడం వంటి హింసాత్మక విధానాలు అవలంభించడానికి కారణం అయ్యారని ప్రాసిక్యూషన్ ఆరోపిస్తోంది.

క్షతగాత్రులకు చికిత్సను కూడా నిరాకరించారని ఆరోపించారు. గత ఫిబ్రవరిలోనే ఐక్యరాజ్య సమితి మానవహక్కుల విభాగం సుమారు 1400 మందికిపైగా చనిపో యారని, విద్యార్థుల నిరసనలతో కూడిన హింసాత్మక వాతావరణంతో ఈ మారణకాండ కొనసాగిందని ఆరోపించింది. 227 మంది హత్యకు బాధ్యులైన షేక్ హసీనా హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారని చెపుతూ ఆరునెలల జైలు శిక్ష విధించింది. ఈట్రిబ్యునల్‌ను షేక్ హసీనా 2009లో ఏర్పాటుచేసారు. బంగ్లాదేశ్ విముక్తిపోరాటంలో జరిగిన నేరాల విచారణకు ఈ ట్రిబ్యునల్ ఏర్పాటయింది. జమాతే ఇస్లామీ పార్టీకి చెందిన అనేక మందిని ఈ ట్రిబ్యునల్ విచారించింది. తొమ్మిది నెలల యుద్ధంలో ఈ పార్టీనేతలపైనే ఎక్కువ విచారణ చేసింది.

# తైవాన్ తీరంలో చైనా భారీ సైనిక విన్యాసాలు



**తైపేయి, జులై 10:** చైనా మరోసారి పసిఫిక్ మహాసముద్రంలో సైనిక ఉద్రిక్తతలను పెంచింది. తైవాన్ తీరాన్ని గురువారం చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి చెందిన 12 యుద్ధవిమానాలు, 7 నౌకలు చుట్టుముట్టాయి. తమ పరిసర జలాల్లో యుద్ధ విమానాలు, నౌకలు కదలాడినట్లు తైవాన్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ విమానాల్లో పది విమానాలు మధ్యరేఖను దాటి, తైవాన్ దక్షిణ–పశ్చిమగగన రక్షణ గుర్తింపు మండలిలోకి చొరబడ్డాయని వివరించింది. అయితే చైనాకు దీటుగా బదులిచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఎంఎన్‌డీ పేర్కొంది. చైనా సైనిక కదలికలపై తైవాన్ తగిన జవాబు ఇచ్చింది. మా సార్వభౌమత్వాన్ని, ప్రాంతీయ భద్రతను పరిరక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. మా విమానాలు, నావికాదళ నౌకలు, తీర రక్షణ క్షిపణి వ్యవస్థలు మోహరించాం. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తైవాన్ రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. తీరంలో చైనా ఉద్రిక్తతలు పెంచుతున్న నేపథ్యంలో 'హాన్ గువాంగ్ 2025' పేరుతో తైవాన్ భారీ స్థాయిలో సైనిక డ్రిల్స్ చేపట్టింది. ఇప్పటి వరకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఎక్కువ రోజులుపాటు ఈ డ్రిల్స్ నిర్వహించాలని తైవాన్ నిర్ణయించింది. ఈ డ్రిల్స్‌లో తాజా తయారు చేసిన ఆయుధాలు, అమెరికా నుంచి దిగుమతి చేసిన అబ్రామ్స్ ట్యాంకులు, హై మొబిలిటీ ఆర్టిల్లరీ రాకెట్ సిస్టమ్ వంటివి వినియోగించనున్నారు. ఈ డ్రిల్స్‌లో అన్ని సర్వీసుల రెగ్యులర్ దళాలతో పాటు 22,000 మంది రిజర్వ్ ఫోర్స్ కూడా పాల్గొననుంది. రాత్రి పగలు అనే తేడా లేకుండా ఈ డ్రిల్స్ జరగనున్నాయి. సైనిక విన్యాసాల సమయంలో విమాన ప్రయాణాలు, రవాణా వ్యవస్థలో తాత్కాలిక అంతరాయాలు ఏర్పడే అవకాశమున్నాయని తైవాన్ ప్రభుత్వం హెచ్చరించింది. అలాగే డ్రిల్స్ నేపథ్యంలో ప్రచారమవుతున్న తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. తైవాన్ సైనిక డ్రిల్స్‌పై చైనా ధ్వజమెత్తింది. హాన్ గువాంగ్ డ్రిల్స్ పేరుతో తైవాన్ అధికార పార్టీ డిపిపి ఆదేశ ప్రజలను మోసం చేస్తోందని చైనా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధి కర్నల్ జియాంగ్ బింగ్ విమర్శించారు. డిపిపి పార్టీ ప్రస్తుతం తైవాన్‌లో అధికారంలో ఉంది. తైవాన్‌పై చైనా ఆధిపత్యాన్ని డిపిపి వ్యతిరేకిస్తోంది. తైవాన్ స్వతంత్ర్యాన్ని డిపిపి కోరుతోంది. ఈ క్రమంలో అధికార డిపిపి చర్యలపై చైనా తీవ్ర విమర్శిస్తోంది. తైవాన్ ప్రజలను 'స్వతంత్ర్యం' పేరిట డిపిపి భ్రమింపజేస్తోందని కర్నల్ జియాంగ్ బింగ్ అన్నారు. వాళ్లు ఎంత శిక్షణ తీసుకున్నా, ఎంత ఆధునిక ఆయుధాలు వినియోగించినా, చైనా దాడిని తట్టుకోలేరు. తైవాన్ – చైనా పునఃఏకీకరణ చారిత్రక అవసరం అని ఆయన వ్యాఖ్యానించారు.

# మరణశిక్ష పడిన కేరళ నర్సుపై విచారణకు సుప్రీంకోర్టు ఆమోదం



**న్యూఢిల్లీ, జులై 10:** యెమెన్‌లో వ్యాపార భాగస్వామిని హత్య చేసిన కేసులో కేరళ నర్సు నిమిష ప్రియకు మరణశిక్ష పడిన సంగతి తెలిసిందే. ఈ నెల 16న ప్రియకు ఉరిశిక్ష అమలుకానున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుపై నమోదైన పిటిషన్‌ను విచారించేందుకు తాజాగా అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది. మరణశిక్ష నుంచి నిమిషను రక్షించేందుకు దౌత్యమార్గాన్ని ఉపయోగించాలని కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంలో పిటిషన్ దాఖలైంది. తాజాగా ఈ పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం అంగీకరించింది. దీనిపై తదుపరి విచారణ ఈ నెల 14న ఉండనున్నట్లు తెలిపింది. కాగా 16న మరణశిక్ష అమలు నేపథ్యంలో దౌత్య చర్చలకు కేవలం రెండు రోజులు మాత్రమే ఉంటుందని, అది ప్రభావం చూపకపోవచ్చని సీనియర్ న్యాయవాది రాజేంత్ బసంత్ పేర్కొన్నారు. కాబట్టి త్వరగా విచారణ జరపాలని కోరారు.

ఈ సందర్భంగా షరియత్ చట్టం ప్రకారం బాధిత కుటుంబ సభ్యులకు నష్ట పరిహారం చెల్లిస్తే నిమిషను విడుదల చేయవచ్చని ఆయన ధర్మాసనానికి తెలిపారు. పాలక్కాడ్ జిల్లాకు చెందిన నిమిష నర్సు కోర్సు పూర్తిచేసిన తర్వాత 2008లో యెమెన్‌కు వెళ్లారు. 2011లో వివాహం చేసుకున్న ఆమె అక్కడే ఓ క్లినిక్ తెరవాలనుకున్నారు. యెమెన్ చట్టాల ప్రకారం ఆ దేశానికి చెందిన తలాల్ అదిబ్ మెహదీనికి ఆమె వ్యాపార భాగస్వామిగా చేసుకుంది. వీరిద్దరూ కలిసి అల్ అమన్ మెడికల్ కౌన్సిల్ అనే సెంటర్‌ను ప్రారంభించగా అది కొంతకాలం సజావుగా సాగింది. భర్త, కుమార్తె కేరళకు వెళ్లిపోయాక నిమిష ప్రియకు మెహదీ నుంచి వేధింపులు మొదలయ్యాయి. 2017లో అక్కడి నుంచి పారిపోయేందుకు ఆమె ప్రయత్నించింది. మెహదీకి మత్తుమందు ఇచ్చి, తన పాస్‌పోర్టు లాక్కోవాలని భావించింది. ఈ ప్రయత్నంలో మత్తుమందు మోతాదు ఎక్కువకావడంతో మెహదీ చనిపోయాడు. ఈ కేసును విచారించిన కోర్టు ఆమెకు మరణశిక్ష విధించింది. గత ఏడాది నిమిష తల్లి ప్రేమకుమారి యెమెన్‌కు వెళ్లారు. బాధిత కుటుంబానికి నష్ట పరిహారం ఇచ్చి తన కుమార్తెను కాపాడుకునేందుకు ప్రయత్నించినప్పటికీ అవి ఫలించలేదు.



## బ్రెజిల్‌సహా 8 దేశాలపై

# ట్రంప్ భారీగా సుంకాలు!

**వాషింగ్టన్,జులై 10:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి గ్లోబల్ వాణిజ్యాన్ని ఉలిక్కిపడేలా చేశారు. బ్రెజిల్‌తో సహా ఎనిమిది దేశాలపై భారీ దిగుమతి సుంకాలు విధిస్తున్నట్టు బుధవారం అధికారికంగా ప్రకటించారు. వాటిలో బ్రెజిల్‌పై ఏకంగా 50 శాతం టారిఫ్ విధించడం సంచలనంగా మారింది. ఆగస్టు 1 నుంచి కొత్త సుంకాలు అమల్లోకి రానున్నాయి. ఈ విషయాన్ని ట్రంప్ తన ట్రూత్ సోషల్ వేదికగా వెల్లడించారు. ఈ మేరకు బ్రెజిల్ సహా 8 దేశాలకు సుంకాల విధింపుపై లేఖలు రాసినట్లు పేర్కొన్నారు. కొత్తగా టారిఫ్‌లు విధించిన 8 దేశాల్లో బ్రెజిల్– 50శాతం, అల్జీరియా, ఇరాక్, లిబియా, శ్రీలంక–30 శాతం, బ్రునై, మోల్డోవా – 25 శాతం, ఫిలిప్పీన్స్ – 20 శాతం. ఈ దేశాలతో ట్రంప్ సుంకాలు విధించిన దేశాల సంఖ్య 22కి పెరిగింది. కేసు విచారణ వల్ల ఏప్రిల్‌లో అమలు చేసిన 10శాతం టారిఫ్‌ను ఇప్పుడు ఐదింతలుగా పెంచారు. ట్రంప్ దక్షిణ కొరియా, జపాన్‌లపై25శాతం టారిఫ్ విధించిన అనంతరం మయన్మార్, లావోస్, దక్షిణాఫ్రికా, కజకస్తాన్, మలేషియా, టునీషియా, ఇండోనేసియా, బోస్నియా, బాంగ్లాదేశ్, సెర్బియా, కంబోడియా, థాయ్‌లాండ్‌పై సుంకాలను పెంచారు. ఇప్పుడు మరో 8 దేశాలపై సుంకాలను విధించారు. బ్రిక్స్ కూటమిపై ఇప్పటికే ట్రంప్ తీవ్ర విమర్శలు చేశారు. బ్రిక్స్ కూటమి ఉద్దేశపూర్వకంగా అమెరికాకు నష్టం కలిగించేందుకు ఏర్పాటయ్యిందని ఆరోపించారు. అందుకే అందులో భాగస్వాములైన భారతదేశంతో సహా అన్ని దేశాలపై త్వరలో 10 శాతం టారిఫ్ విధిస్తామని తెలిపారు. బ్రిక్స్‌లో ఉన్న ఎవరైనా 10శాతం టారిఫ్ చెల్లించాల్సిందే.

బ్రిక్స్ ఏర్పాటుఅనేది అమెరికా డాలర్‌ను దిగజార్చడా నికే అని స్పష్టంగా కనిపిస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. ప్రపంచ వాణిజ్యంలో డాలర్ ప్రామాణిక కరెన్సీగా కొనసాగాలి. అదే ఒక దేశ బలాన్ని నిర్ధారిస్తుంది. గతంలో పాలన సాగించిన కొందరు నేతల వల్లే డాలర్ స్థానం ప్రమాదంలో పడింది. కానీ నేను అలా జరగనివ్వనని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అంతేకాక, తమ దేశంలో ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పే విదేశీ కంపెనీలకు ఈ టారిఫ్‌ల నుంచి మినహాయింపు కల్పిస్తామని ట్రంప్ వెల్లడించారు.

# చైనాతో అరుణాచల్‌కు సరిహద్దేలేదు..

## మా సరిహద్దు అంతా టిబెట్‌తోనే: సిఎం పెమా ఖండూ

**ఇటానగర్, జులై 10:** అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండు, చైనాకు గట్టి షాకిచ్చేలా సంచలన వ్యాఖ్యలు చేశారు. అరుణాచల్ ప్రదేశ్‌కు చైనాతో అసలు సరిహద్దే లేదని, తమ రాష్ట్రానికి టిబెట్‌తో మాత్రమే సరిహద్దు ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదంపై కొత్త చర్చకు దారితీశాయి. ప్రముఖ వార్తా సంస్థ పిటిఐకి ఇచ్చినఇంటర్వ్యూలో పెమాఖండు ఈ వ్యాఖ్యలు చేశారు. ఇంటర్వ్యూలో భాగంగా, అరుణాచల్ ప్రదేశ్ చైనాతో 1200 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటుందని విలేకరి ప్రస్తావించగా, సిఎం ఖండు వెంటనే కలగజేసుకున్నారు. ఈ విషయంలో నేను మిమ్మల్ని సరిదిద్దాలి. మాకు చైనాతో కాదు, టిబెట్‌తో సరిహద్దు ఉందని ఆయన వివరించారు. భారతదేశంలోని ఏ రాష్ట్రానికీ చైనాతో సరిహద్దు లేదని ఆయన అన్నారు. చారిత్రక అంశాలను ప్రస్తావిస్తూ, 1950లో చైనా టిబెట్‌ను బలవంతంగా ఆక్రమించుకుందని పెమా ఖండు గుర్తుచేశారు. అధికారికంగా టిబెట్ ఇప్పుడు చైనాఆధీనంలో ఉందని మాకు తెలుసు. కానీ వాస్తవానికి మా సరిహద్దు ఎప్పుడూ




టిబెట్‌తోనే ఉండేది. అరుణాచల్ ప్రదేశ్ భూటాన్, మయన్మార్‌లతో పాటు టిబెట్‌తో అంతర్జాతీయ సరిహద్దులను పంచుకుంటోందని ఆయన తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌ను తమ భూభాగంలోని దక్షిణ టిబెట్ (జాంగ్నాన్) అని చైనా చాలాకాలంగావాదిస్తోంది. తమ మ్యాపుల్లో కూడాచూపిస్తూ వివాదాన్ని రాజేస్తోంది. అయితే, చైనా వాదనలను భారత్ ఎప్పటికప్పుడు తీవ్రంగా ఖండిస్తూ వస్తోంది. అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని తేల్చి చెబుతోంది. ఈ నేపథ్యంలో పెమా ఖండు చేసిన వ్యాఖ్యలు చైనా వాదనను మరింత బలహీనపరిచేలా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# సంక్షిప్తంగా..

## గాలిలోనే విమానాలు ఢీకొని కేరళ పైలట్‌మృతి

**టొరంటో, జులై 10:** కెనడాలో జరిగిన విమాన ప్రమాదంలో కేరళకు చెందిన భారతీయ యువ పైలట్ ఒకరు మరణించారు. మానిటోబా ప్రావిన్స్‌లో రెండు శిక్షణా విమానాలు గాల్లో ఢీకొనడంతో ఈ విషాదకర సంఘటన చోటుచేసుకుంది. మృతుడిని కేరళకు చెందిన శ్రీహరి సుకేష్ (21)గా గుర్తించారు. ఈ ప్రమాదంలో కెనడాకు చెందిన సవన్నా మే రాయ్స్ (20) అనే మరో యువ పైలట్ కూడా మరణించాడు. శ్రీహరి, సవన్నా ఇద్దరూ మానిటోబాలోని హార్వ్స్ ఎయిర్ పైలట్ ట్రైనింగ్ స్కూల్‌లో శిక్షణ పొందుతున్నారు. స్టెయిన్‌బాచ్ పట్టణం వద్ద శిక్షణలో భాగంగా చిన్న విమానాల్లో టేకాఫ్, ల్యాండింగ్‌లను ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరూ ఒకే రన్‌వేపై ఒకేసారి ల్యాండ్ అయ్యేందుకు ప్రయత్నించారు. దీంతో సుమారు 400 మీటర్ల ఎత్తులో వారి విమానాలు ఒకదానికొకటి ఢీకొన్నాయని ట్రైనింగ్ స్కూల్ అధ్యక్షుడు ఆడమ్ పెన్నర్ పేర్కొన్నారు.

## మాకూ 'నోబెల్' ఇవ్వాలి: కేజ్రీవాల్



**చండీగఢ్, జులై 10:** తన పాలనకు గానూ తనకు నోబెల్ బహుమతి ఇవ్వాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారాన్ని రేపాయి. ఆయన వ్యాఖ్యలపై బిజెపి తీవ్రస్థాయిలో మండిపడింది. చండీగఢ్‌లో జరిగిన ది కేజ్రీవాల్ మోడల్ పుస్త కావిష్కరణ కార్యక్రమంలో కేజ్రీవాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ సహా ఎన్నో శక్తులు మా ప్రభుత్వాన్ని అడ్డుకున్నా, మేము అద్భుతంగా పనిచేశాం. ఇన్ని అడ్డంకుల మధ్య ఇంత గొప్ప పాలన అందించినందుకు నాకు నోబెల్ బహుమతి ఇవ్వాలని కేజ్రీవాల్ అన్నారు. ఈవ్యాఖ్యలపై బిజెపి ఢిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా స్పందిస్తూ.. అసమ ర్థత, అరాచకం, అవినీతి విభాగాల్లో నోబెల్ బహుమతి ఉండుంటే కేజ్రీవాల్‌కు తప్పకుండా వచ్చేదని ఎద్దేవా చేశారు.

## ట్రంప్‌పై దాడి కేసు: ఆరుగురి సస్పెన్షన్

**వాషింగ్టన్, జులై 10:** అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో పెన్సిల్వేనియాలోని బట్లర్ కౌంటీలో డొనాల్డ్ ట్రంప్‌పై కాల్పులు ఘటనకు సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ల వైఫల్యమే కారణమని తేల్చారు. ఈ క్రమంలో నాడు విధుల్లో ఉన్న ఆరుగురిని సస్పెండ్ చేస్తూ సీక్రెట్ సర్వీస్ నిర్ణయం తీసుకొంది. ఈ విషయాన్ని ఆ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ మ్యాట్ క్విన్న్ వెల్లడించారు. వీరందరిని భవిష్య త్తులో కీలక విధులకు దూరంగా ఉంచుతామన్నారు. బట్లర్‌లో జరిగిన ఘటనకు పూర్తి బాధ్యత సీక్రెట్ సర్వీస్‌దేనని చెప్పారు. అదో ఆపరేషనల్ వైఫల్యమని అంగీకరించారు. మరోసారి ఇలాంటివి జరగకుండా జాగ్రత్త పడతామన్నారు. ట్రంప్‌పై దాడి జరిగి మరో మూడు రోజుల్లో యేడాది పూర్తికానున్న వేళ సీక్రెట్ సర్వీస్ ఏజెన్సీ ఈ నిర్ణయం వెలువరించడం గమనార్హం.

## తాయెత్తులతో సంపాదన రూ.106 కోట్లు!

**లక్నో, జులై 10:** ఒకప్పుడు సైకిల్‌పై తిరుగుతూ ఉంగరాలు,తాయెత్తులు అమ్ముకునే ఒక సాధారణ వ్యక్తి ఇప్పుడు ఏకంగా రూ.106 కోట్ల సామ్రాజ్యాన్ని సృష్టించాడు. ఉత్తరప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన మతమార్పిడుల ముఠా గుట్టు రట్టుకావడంతో జమాలుద్దీన్ అలియాస్ ఛంగూర్ బాబా అక్రమాల పుట్ట పగిలింది. ఈ కేసు తీవ్రత దృష్ట్యా ఇప్పుడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కూడా రంగంలోకి దిగింది. బలరాంపూర్ జిల్లాకు చెందిన ఛంగూర్ బాబా, అతని సహచరి నీతూ అలియాస్ నస్రీన్‌ను పోలీసులు ఇటీవల లక్నోలో అరెస్ట్ చేశారు. పేదలు, నిస్సహాయ కార్మికులు, వితంతువులే లక్ష్యంగా డబ్బు,పెళ్లి ఆశచూపి లేదా బెదిరించి ఈముఠా మత మార్పిడులకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఛంగూర్ బాబాకు చెందిన 40 వేర్వేరు బ్యాంకు ఖాతాల్లోకి మధ్యప్రాచ్య దేశాల నుంచి రూ.106 కోట్లకు పైగా నిధులు వచ్చినట్టు అధికారులు గుర్తించారు.

## రష్యాకు గట్టి ఎదురుదెబ్బ

**బ్రస్సెల్స్, జులై 10:** అంతర్జాతీయ వేదికపై రష్యాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దశాబ్దం క్రితం మలేసియా ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఎంహెచ్17 విమానాన్ని కూల్చివేసింది రష్యానే అని యూరప్ అగ్రశ్రేణి మానవ హక్కుల న్యాయస్థానం (ఇసిహెచ్ఆర్) సంచలన తీర్పు వెలువరించింది. అంతేకాకుండా, 2022 నుంచి ఉక్రెయిన్‌లో రష్యా పాల్పడుతున్న హత్యలు, అత్యాచారాలు, మౌలిక సదుపాయాల ధ్వంసం వంటి అఘాయిత్యాలకు కూడా మాస్కోనే బాధ్యురాలని స్పష్టం చేసింది. 2014 జులై 17న ఆమ్‌స్టర్‌డామ్ నుంచి కౌలాలంపూర్‌కు వెళ్తున్న మలేసియా ఎయిర్‌లైన్స్ విమానం తూర్పు ఉక్రెయిన్‌లో కూలిపోయిన విషయం తెలిసిందే.

# రాష్ట్ర వ్యాప్తంగా తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం





విజయవాడలోని నిర్మల హైస్కూల్‌లో మెగా తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో తల్లిదండ్రులకు స్వాగతగీతం పాడుతున్న విద్యార్థినిలు

**విజయవాడ, జూలై 10,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణంలో మెగా తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలు జరిగాయి.రాష్ట్రమంతటా ప్రభుత్వ,.ప్రైవేటు పాఠశాలలలో ఈ ఉత్సవాలు జరిగాయి.సత్యసాయి జిల్లాలోని పుటపర్తిలో కొత్తచెరువు జిల్లాపరిషత్ హైస్కూలులో నిర్వహించిన మెగా పిటిఎం కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు,నారా లోకేష్ పాల్గొన్నారు.విద్యార్దులతో వారు ముచ్చటగా గడిపారు.వారికి పాఠాలు చెప్పారు.రాష్ట్రంలో మిగిలిన 25జిల్లాల్లోను తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలుకు మంత్రులు, ఎంఎల్ఏలు ,వివిధ రంగాల ప్రముఖులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు., ఉపాధ్యాయుల, తల్లిదండ్రులు సమావేశమై పిల్లల విద్యా పురోగతితో పాటు వారిలో ఆయా రంగాల్లో ప్రతిభ గురించి చర్చించారు.ప్రతి పాఠశాలల్లో విద్యార్దులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.పటమట నిర్మలా హై స్కూల్ లో గురువారం నిర్వహించిన మెగా తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ఎంతో స్ఫూర్తిదాయకంగా సాగింది. ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రుల చురుకుగా పాల్గొనడంతో పూర్తి విజయవంతం అయ్యింది. పరస్పర సహకారం ఫలితంగా ప్రభుత్వ సూచనల అమలు దిశగా కార్యక్రమం సజావుగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్కిల్ ఇండియా మిషన్ కన్సల్టింగ్ అడ్వైజర్ డాక్టర్ భాస్కర్ రెడ్డి, హైకోర్టు అడ్వకేట్ కేసి శివ శంకర్, నిర్మలా హై స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ మాథ్యూ, ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ గిబి ఆంటొనీ హాజరై తమ విలువైన అభిప్రాయాలను పంచుకున్నారు.ˇబాల్యం అనేది తియ్యని జ్ఞాపకం. అలాంటి అమూల్యమైన బాల్యాన్ని కోల్పోకుండా, విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులద్దే అని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. సమాజంలో వేగంగా మారుతున్న ప్రతికూల ధోరణులు పిల్లలపై చెడు ప్రభావం చూపకుండా చూసుకోవడం అందరి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ ఆత్మీయ సమావేశం తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల మధ్య సన్నిహిత సంబంధాలను బలోపేతం చేయడమే కాక, విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసింది.దాదాపు ప్రతి పాఠశాలల్లోను పండుగ వాతావరణం కన్పించింది.

# పేదరిక నిర్మూలనకు పి 4 పథకాన్ని పరుగులు పెట్టిద్దాం : సిఎం చంద్రబాబు

## - ఆగస్టు 15 నాటికి లక్షమంది మార్గదర్శకులను గుర్తిద్దాం



**విజయవాడ, జులై 10,ప్రభాతవార్తప్రతినిధి:** పేదరిక నిర్మూలన కీలక లక్ష్యం,అందులో భాగంగా అమలులోకి తీసుకుని వచ్చిన పీ4 పథకాన్ని పరుగులు పెట్టించాలని సీఎం చంద్రబాబు అన్నారు.మార్గదర్శులు,బంగారు కుటుంబాల విషయంలో సమగ్ర ప్రణాళిక,అవగాహన ఉండాలన్నారు.ఈ పథకాన్ని కచ్చితంగా అమలు చేస్తే ఎవ్వరి నోట పేదరికం అనే మాట రాదన్నారు.పీ4 (పబ్లిక్‌ప్రైవేట్‌పీపుల్ పార్టనర్ షిప్) కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం కీలక ప్రణాళికలు సిద్దం చేస్తోంది. త్వరలో మార్గదర్శకులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భేటీ కాబోతున్నారు. పీ4 - జీరో పావర్టీ కార్యక్రమంపై గురువారం సాయంత్రం దాటిన తరువాత తన క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్షించారు. పథకంలో నిర్దేశిత అంశాలు, మార్గదర్శకుల నుంచి లభిస్తున్న స్పందన తదితరంశాలపై ఆయన సమగ్రంగా చర్చించారు. పీ4 కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఇప్పటి వరకు ఈ కార్యక్రమంలో మార్గదర్శులుగా ఉండేందుకు18,332 మంది ముందుకు వచ్చారు. వీరిలో పారిశ్రామిక వేత్తలు, ఎన్ఆర్ఐలు, ఉన్నత వర్గాల వారు ఉన్నారు. వీరి ద్వారా 1,84,134 బంగారు కుటుంబాలకు చేయూత లభిస్తోంది. అయితే ఆగస్టు 15వ తేదీ నాటికి ఒక లక్ష మంది మార్గదర్శులను గుర్తించేలా ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించుకుంది. ఈ మేరకు కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంతో పాటు.. మార్గదర్శిగా ఉండే వారిని ప్రోత్సహించేందుకు పలు చర్యలు చేపట్టాలని సిఎం నిర్ణయం తీసుకున్నారు. మార్గదర్శులుగా ఉండేవారిని ప్రోత్సహించడానికి స్వయంగా వారితో చంద్రబాబు సమావేశం కానున్నారు. మార్గదర్శులుగా ఉండే 200 మంది టాప్ ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు, భారీ నిర్మాణ సంస్థల ప్రతినిధులు, ఎమ్ఎన్సీ కంపెనీల ప్రతినిధులు, సెలబ్రిటీలతో సీఎం సమావేశం కానున్నారు. ఈ నెల 18వ తేదీన అమరావతిలో వీరిని డిన్నర్ కు ఆహ్వానించాలనే చర్చ ఈ సమీక్షలో జరిగింది. పీ4 లక్ష్యాలను వివరించి మరింత మందిని ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని చంద్రబాబు ఆదేశించారు. సమాజంలో పేదలకు అండగా ఉండేందుకు సిద్ధంగా ఉన్న అనేక వర్గాల వారిని ఒక తాటిపైకి తెచ్చేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని సీఎం భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రణాళిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని జిల్లాల్లో అమలు చేయాలి

## ఆహార కమిషన్ సభ్యుడు గంజి మాలాదేవి

**విజయవాడ, జూలై 10,ప్రభాతవార్త ప్రతినిధి:** జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని జిల్లాల్లో కచ్చితంగా అమలు చేయాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు గంజి మాలాదేవి అన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో జాతీయ ఆహార భద్రత చట్టం అమలును గురువారం రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు గంజి మాలాదేవి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా విజయవాడ రూరల్ ప్రసాదంపాడు, రామవరప్పాడు, ఇబ్రహీం పట్నం మండలం కొండపల్లి, కుంటముక్కల గ్రామంలోని అంగన్వాడీలు, చౌక ధర దుకాణాలు, సంక్షేమ వసతి గృహాలలో తనిఖీ నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆహార భద్రతను సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమైన చట్టం అన్నారు. దీని ద్వారా ఆహార భద్రతను నిర్ధారించి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం జరుగుతుందని తద్వారా పేదరికాన్ని తగ్గించడానికి దోహదపడుతుం దన్నారు. పోషకాహార లోపాన్ని నివారించి పేదలకు సహాయపడుతుందని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు గంజి మాలాదేవి అన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో డీఎస్ఓ, పౌరసరఫరాల, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేడు తిరుపతి-చిక్కమగళూరు కొత్త రైలు ప్రారంభం

**గుంతకల్లు రైల్వే, జూలై 10,ప్రభాతవార్త** రాష్ట్రంలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ తిరుపతి నుంచి నైరుతి రైల్వే మైసూర్ డివిజన్ చిక్కమగళూరు మధ్య కొత్తగా ప్రవేశపెట్టిన నెంబర్ 07424ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసును నేడు(ఈ నెల 11)నుంచి ప్రారంభిస్తున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో రాయలసీమ,కర్నాటక ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం నేటి నుంచి ప్రారంభం కాబోతున్న ఈ ప్రారంభోత్సవ ప్రత్యేక రైలు నిర్వహణకు సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి. చిక్కమగళూరు నుంచి తిరుపతికి బయలుదేరే నెంబర్ 07424 ప్రారంభోత్సవ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ శుక్రవారం మధ్యాహ్నం 12.00 గంటలకు చిక్కమగళూరు నుంచి బయలుదేరి శనివారం తెల్లవారుజామున 2.30గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. ఈ రైల్లు మార్గమధ్యలో శేఖరపు పట్టణం, బీరళహళ్లి,కొడూరు,బి దూర్,దేవనూరు, అరిసికెరె, తిప్తూరు, తుమకూరు,చిక్ భనవర, బెంగళూరు, క్రిష్ణారాజపురం, వైట్ ఫీల్డ్, బంగారుపేట్, కుప్పం, జోలార్‌పేట్, కాట్పాడి, చిత్తూరు,పాకాల స్టేషన్లలో నిలుస్తాయి.

# స్కిట్ ఇంజినీరింగ్ కళాశాల ఆగస్టు 4న పునఃప్రారంభం

**శ్రీకాళహస్తి,జూలై 10 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో 1999లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్కిట్ ఇంజినీరింగ్ కళాశాల 2019లో మూత పడింది. అయితే ఎన్నికలకు ముందు ప్రచారంలో శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి, యువగళం పాదయాత్రలో నారాలోకేష్ స్కిట్ పునఃప్రారంభానికి భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం స్కిట్ కళాశాల పునఃప్రారంభానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ క కళాశాల నిర్వహణను ప్రభుత్వం అనంతపురం జేఎన్‌టీయుకు అప్పగిస్తున్నట్లు విలీనం చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇంజనీరింగ్ కళాశాల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.120కోట్లు నిధులు మంజూరు చేస్తూ ఫైనాన్షియల్ క్లియరెన్స్ ఇచ్చినట్లు గురువారం శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి తెలియచేశారు. ఈ మేరకు ఆయన స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణను పరిశీలించి పరిస్థితి పరిశీలించారు. స్కిట్ కళాశాలలో ఆగస్టు 4 నుంచి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమౌతాయని సుధీర్‌రెడ్డి తెలియజేసి ప్రకటన చేసారు. విద్యాపోషిణి శ్రీకాళహస్తి, శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని విద్యాపోషిణి తీర్చి దిద్దుటకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. తన తండ్రి హయాంలో ప్రతిష్టాత్మకమైన ఐఐటి, ఐసర్ కేంద్ర విద్యాసంస్థలు ఏర్పాటు చేసి విద్యాపోషిణి రోజుల్లో నాసా స్పేస్ యూనివర్సిటీ ఏర్పాటుప్రతిపాదన ఉందన్నారు.

# కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశాకు గవర్నర్ ప్రశంసలు

## - రెడ్‌క్రాస్‌కు నిధుల సమీకరణ సభ్యత్వ నమోదు, సామాజిక సేవలో కృషికి గుర్తింపు..



ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు బంగారు పతకాన్ని అందజేస్తున్నరెడ్ క్రాస్ సంస్థ రాష్ట్ర చైర్మన్, ఏపీ గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్

**విజయవాడ,జూలై 10,ప్రభాతవార్తప్రతినిధి:** రెడ్‌క్రాస్‌కు నిధుల సమీకరణ, సభ్యత్వ నమోదులో విశేష ప్రతిభ కనబరచడమే కాకుండా.. సామాజిక సేవలో చేసిన కృషికి గుర్తింపుగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు అవార్డు లభించింది. రెడ్ క్రాస్ సంస్థ రాష్ట్ర ఛైర్మన్, ఏపీ గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ నుంచి కలెక్టర్ లక్ష్మీ ఈ అవార్డును అందుకున్నారు. జిల్లా కలెక్టర్ గురువారం విడుదల చేసిన సమాచారం ప్రకటనలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం జరిగిన వార్షిక సమావేశంలో అవార్డును బంగారు పతకాన్ని అందజేస్తూ "వెల్ డన్.. కీప్ ఇట్ అప్" "అంటూ లక్ష్మీశను గవర్నర్ అభినందించారని వివరించింది. ఇదే స్ఫూర్తితో రెడ్‌క్రాస్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి, సంస్థకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పార్వతీపురం ఐటీడీఏ పీఓగా విధులు నిర్వహించిన సమయంలో ట్రైబల్ ప్రాంతాల్లో ప్రెగ్నెంట్ ఉమెన్ హాస్టల్ ఏర్పాటుకు శ్రీకారంచుట్టింది మొదలు ఆ తర్వాత ఎక్కడ పనిచేసినా విధి నిర్వహణలో ప్రత్యేక గుర్తింపు సాధించారు లక్ష్మీశ. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ ఎన్టీఆర్ జిల్లాలోనూ రెడ్‌క్రాస్ ద్వారా పెద్దఎత్తున కార్యక్రమాలకు సారథ్యం వహిస్తున్నారు. నవ్య రాజధానికి గేట్‌వే అయిన విజయవాడలో ఎప్పటికప్పుడు భారీ కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఈ కార్యక్రమాల్లోనూ రెడ్‌క్రాస్ భాగమై వాటి విజయవంతంలో కీలకపాత్ర పోషిస్తోంది. రక్తదాన శిబిరాల ఏర్పాటు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై యువతను జాగృతం చేయడం.. ఇలా వివిధ కార్యక్రమాల్లో జిల్లా రెడ్‌క్రాస్ యూనిట్ ముందుంటోంది. పేదరికం లేని సమాజ నిర్మాణం లక్ష్యంగా గౌరవ ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడాలేని విధంగా ఆవిష్కరించిన వినూత్న పీ4 విధానం అమల్లోనూ రెడ్‌క్రాస్ ఓ గొప్ప అడుగుతో అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఏకంగా ఒక సచివాలయ పరిధిలోని మొత్తం 278 బంగారు కుటుంబాలకు మార్గదర్శిగా వ్యవహరించేందుకు తాజాగా ముందుకొచ్చింది. గౌరవ గవర్నర్ నుంచి అవార్డు స్వీకరించడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని.. ఈ విజయం స్ఫూర్తితో రెడ్‌క్రాస్ ద్వారా సామాజిక సేవలో జిల్లాకు మరింత గుర్తింపు తెచ్చేందుకు కృషిచేస్తానని.. ఆదేవిధంగా స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనకు టీమ్ ఎన్టీఆర్‌తో కలిసి ముందుకు వెళ్తానని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి ఏకే ఫరీడా, ఛైర్మన్ వైడీ రామారావు, వైస్ ఛైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు, ట్రెజరర్ పి.రామచంద్రరాజు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# దేశీయ, విదేశీయ వస్తువుల నాణ్యతను భారత ప్రమాణాల బ్యూరో పరిశీలిస్తోంది

## - పరిశ్రమల శాఖ అదనపు డైరెక్టర్ రామలింగేశ్వరరాజు

**విజయవాడ,జూలై 10,ప్రభాతవార్తప్రతినిధి:** భారత ప్రమాణాల బ్యూరో (బిఐఎస్) దేశంలో తయారైన వస్తువులు,ఇతర దేశాల నుండి వస్తున్న వస్తువుల దేశీయ క్వాలిటీ కలిగి ఉన్నాయో లేదో పరిశీలిస్తుందని ఏపీ పరిశ్రమల శాఖ అదనపు డైరెక్టర్ ఏ. రామలింగేశ్వరరాజు అన్నారు.. గురువారం మినర్వా హోటల్ లో భారత ప్రమాణాల బ్యూరో (బిఐఎస్) ఆధ్వర్యంలో పరిశ్రమల శాఖ, ఫెడరేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ ఇండియా ల సహకారంతో ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ మీట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిశ్రమల శాఖ అడిషనల్ డైరెక్టర్ ఏ. రామలింగేశ్వరరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా అడిషనల్ డైరెక్టర్ ఏ. రామలింగేశ్వరరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో 16 లక్షల ఎమ్ఎస్ఎమ్ఈ పరిశ్రమలు, 1100 భారీ పరిశ్రమలు ఉన్నాయన్నారు. బిఐఎస్‌మార్క్ తీసుకోని వాటిలో ఎక్కువగా చిన్న పరిశ్రమలు ఉంటాయన్నారు. బిఐఎస్‌మార్క్ తీసుకోవడానికి ఎక్కువ ఖర్చు అవుతుందనే కారణంతో అంత ఆసక్తి చూపించడం లేదన్నారు. ఇతర దేశాలకు ఈ వస్తువులను పంపేటప్పుడు వచ్చినప్పుడు బిఐఎస్ సర్టిఫికేషన్ అవసరం తప్పనిసరి అవుతుందన్నారు. మారుతున్న పరిస్థితుల్లో సర్టిఫికేషన్ పొందటం చాలా సులువుగా ఉందన్నారు. ఎమ్ఎస్ఎమ్ఈ లు బిఐఎస్ సర్టిఫికేషన్ పొందటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు కూడా అందిస్తున్నాయని రామలింగేశ్వర రాజు అన్నారు. బిఐఎస్ డైరెక్టర్ ప్రేమ్ సజని పట్నాల మాట్లాడుతూ ఇండియాలో స్టాండర్డ్స్ చేయాలంటే అది బిఐఎస్ మాత్రమే చేయాలన్నారు. ఇండియాలో ప్రొడక్ట్ తయారీ, నిల్వ, అమ్మకాలు చేయాలన్నా తీని సర్టిఫికేషన్ చేయాలన్నారు. ఇండియాలో 816 వస్తువులకు బిఐఎస్ సర్టిఫికేషన్ పొందాలి తప్పనిసరి చేశారన్నారు. ఇతర దేశాలకు చెందిన వస్తువులు ఇండియాలో అమ్మాలన్నా బిఐఎస్ సర్టిఫికేషన్ అవసరం ఉందన్నారు. సంవత్సరానికి రెండుసార్లు తనిఖీలు నిర్వహిస్తామని, ఫిర్యాదులు వస్తే దాడులు నిర్వహిస్తామని ఆమె చెప్పారు. ఆన్‌లైన్‌లో నాణ్యత నియంత్రణలో ఆ వస్తువు వివరాలు రెండుసార్లు కంటే ఎక్కువ కనిపించపోతే, ఎవరైనా తీని మార్క్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని ఆమె చెప్పారు.

# శాకంబరి ఉత్సవాలకు పూర్ణాహుతితో స్వస్తి

## - గురు పౌర్ణమి సందర్భంగా వేదపండితులకు గురుపూజ

**ఇంద్రకీలాద్రి, జూలై 10, ప్రభాతవార్త** ఇంద్రకీలాద్రిపై శాకంబరి ఉత్సవాలను పూర్ణాహుతితో స్వస్తి పలికారు. గురువారం నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఇఓ వికె శీనా నాయక్ దంపతులు పాల్గొన్నారు. సప్తశతి పారాయణం, మహావిద్యా పారాయణము, హోమము, శాంతి పౌష్టిక హోమాలు, మంటపపూజ, ఉదయం 9.30కు పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఓ వికె శీనా నాయక్ మాట్లాడుతూ సుమారు 2 లక్షల మంది భక్తులు ఈ ఉత్సవాల్లో దుర్గమ్మవారిని సజావుగా ఆనందంగా దర్శించుకున్నారన్నారు. శాకంబరి మాతగా దుర్గమ్మను దర్శించుకోవడానికి చివరి రోజు కావడంతో భక్తులు పోటెత్తారు. ఒక దశలో చాలా సేపు అంతరాలయ దర్శనాలను నిలిపేయాల్సి వచ్చింది. ఇఓ వికె శీనా నాయక్ పలు సూచనలు ఆదేశాలిస్తూ అధికారులను అప్రమత్తం చేయడంతో క్యూలైన్లు త్వరితగా ముందుకు సాగి భక్తులందరికీ సాఫీ దర్శనమయింది. ఈ సందర్భంగా భక్తులందరికీ శ్రీ అమ్మవారి అన్న ప్రసాదం అందేలా ఇఓ ఆదేశాల మేరకు ఆలయాధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మూడురోజుల ఉత్సవాల్లో అలంకరించిన పండ్లు కూరగాయలతో రూపొందించిన కదంబం ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు. దుర్గమ్మ వారు వేంచేసియున్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. ఆషాఢమాస గురు పౌర్ణమి సందర్భంగా ఉదయం 5.55కకు ఘాట్‌రోడ్‌లో వేంచేసియున్న శ్రీ కామధేను అమ్మవారి ఆలయం వద్ద ప్రారంభించారు. ఇఓ వికె శీనా నాయక్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్యాసపౌర్ణమి సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొని శ్రీ అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. గిరి ప్రదక్షిణ సందర్భంగా భక్తబృందాలు కోలాట ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, విచిత్రవేషధారణలతో ముందు ప్రదర్శనగా సాగుతుండగా డప్పు, ఢమరుక, డోలు, సన్నాయి నాదాలతో వేదమంత్రాలను పఠిస్తూ గిరి ప్రదక్షణను పూర్తి చేశారు. దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమానికి ఇఓ వికె శీనా నాయక్ శ్రీ అమ్మవారి ఆలయంలో అందిన తదా మొదటి జీతంలో రూ.50వేలు విరాళంగా గురువారం అందించారు. ఈ సందర్భంగా ఈఓకు వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

# సూపర్ సిక్స్ హామీలతో మోసం చేస్తున్న చంద్రబాబు

## - మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



**సదుం, జూలై 10, ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేశాడని మాజీ మంత్రి పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం సదుం మండలం ఎర్రతివారిపల్లెలో చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుచేస్తూ బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు చెప్పిన హామీలు అమలు చేయకుండా ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపుతున్నాడని ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచారని చెప్పారు. ముఖ్యమంత్రిగా ప్రజలకు జవాబు దారీతనం ఉండాలని చంద్రబాబు అహంకారంతో మాట్లాడుతున్నాడని పైగా హామీలన్నింటినీ అమలు చేశారంటూ మాట్లాడడం విడ్డూరం ఉందని పేర్కొన్నారు. ఎవరైనా హామీల అమలు చేయలేదంటే వారి నాలుక మందం అంటూ బెదిరింపులకు దిగుతున్నాడని ఇది చంద్రబాబు నైజం అన్నారు. ఏ ఎన్నికల్లో చంద్రబాబులా వైయస్ జగన్మోహన్ రెడ్డి అబద్ధపు హామీలు ఇవ్వలేదని, 2019లో సీఎం అయిన తర్వాత రాష్ట్రంలో అర్హులకు ఎన్ని సమస్యలు వచ్చినా ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి రైతు ఇబ్బంది పడుతున్నాడని మిర్చి మామిడి పొగాకు రైతులకు ధరలు లేక ఆందోళన చెందుతున్నారు చిత్తూరు జిల్లాలో మామిడికాయ ఎక్కువగా పండిస్తున్నారని మంత్రి అచ్చం నాయుడు రైతులపై అన్ని అబద్ధాలు చెబుతున్నాడు అన్నారు. బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాల్లో నియోజకవర్గంలోనూ తర్వాత మండల స్థాయిలోను గ్రామస్థాయిలో నిర్వహిస్తామని ఆయన చెప్పారు వైఎస్ఆర్సీపి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన 143 హామీల్లో ఒక వాగ్దానం కూడా పూర్తిగా అమలు చేయలేదని చెప్పారు 85 లక్షల మందికి తల్లికి వందనం ఇవ్వాల్సి ఉండగా 50 లక్షల మందికి ఇచ్చి మిగిలిన వారి జగనాము పెట్టారన్నారు. ఆగస్టు నుంచి ఉచిత బస్సు ప్రయాణం జిల్లాకే పరిమితం అంటున్నారని ఎద్దేవా చేశారు. బంగారు పాళెం మార్కెట్ యార్డ్ పర్యటనకు వేలాది మంది పోలీసులతో వలయం సృష్టించి నారని అయితే రైతులు కొందరు తువ్వులు దాటుకుని జగన్మోహన్ రెడ్డి పర్యటనకు వచ్చారని చెప్పారు చంద్రబాబు చేస్తున్న ద్రోహాన్ని మోసాన్ని తెలుసుకొని ప్రజలు భారీగా వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

# మరో రూ.363 కోట్లతో 5 కొత్త విద్యుత్ ప్రాజెక్టులు

## రూ.12,000 కోట్ల విలువైన ట్రాన్స్‌మిషన్ నెట్ వర్క్ ప్రాజెక్టులను అమలు చేస్తోన్న రాష్ట్ర ట్రాన్స్‌కో

## - ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష చేసిన సిఎస్ కె. విజయానంద్



**విజయవాడ, జూలై 10, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా ఏపీట్రాన్స్‌కో ఆధ్వర్యంలో దాదాపు రూ.12,000 కోట్ల విలువైన ట్రాన్స్‌మిషన్ నెట్ వర్క్ ప్రాజెక్టులను చేపట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాజెక్టుల పురోగతిపై గురువారం జేఎండీ కీర్తి చేకూరి, డైరెక్టర్లు కె వి భాస్కర్, .వెంకటేశ్వర రావు, సీఈఓ సుధీన్ కుమార్ తో పాటు రాష్ట్రం లోని ట్రాన్స్‌కో యస్ ఈ లతో సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చేందుకు , వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు , విద్యుత్ ట్రాన్స్మిషన్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసే లక్ష్యం లో భాగంగా ఏపీట్రాన్స్‌కో దాదాపు రూ.12,000 కోట్లకు పైగా విలువైన ట్రాన్స్మిషన్ ప్రాజెక్టులను చేపట్టిందని, వీటిలో గత రెండు నెలల్లో రూ.155.04 కోట్లు విలువ చేసే 7 ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. అలాగే రూ.8,131 కోట్లు విలువ చేసే 62 ప్రాజెక్టులు ప్రస్తుతానికి వివిధ దశల్లో ఉన్నాయని, రూ.363.13 కోట్లు విలువచేసే 5 ప్రాజెక్టులు చేపట్టేందుకు అనుమతులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. మరో రూ.3,614 కోట్లు విలువ చేసే 31 విద్యుత్ ప్రసార పనులకు టెండర్లు ఆహ్వానించినట్లు సిఎస్ తెలిపారు . ఈ ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలని ఏపీట్రాన్స్‌కో అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. రాష్ట్రంలో ప్రత్యేకించి పారిశ్రామిక కారిడార్లు, పట్టణ క్లస్టర్ వంటి ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల్లో ప్రాజెక్టులపై రోజువారీ స్థాయిలో సమీక్షించాలని, వారానికోసారి పురోగతి నివేదికలు సమర్పించాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు, స్థానిక సంస్థలతో సమన్వయం తో ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేయాలని, ప్రత్యేకంగా రాజధాని ప్రాంతంలోని ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఇది రాష్ట్ర అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. నిర్మాణ పనులన్నీ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, థర్డ్ పార్టీ ద్వారా నాణ్యత పరీక్షలు చేయాలని క్రమం తప్పకుండా ఆడిట్లు నిర్వహించాలని ఆదేశించారు.

# పిఐబి డైరెక్టర్‌గా పి.రత్నాకర్

## సిబిఐ, పిఆర్‌జిఐలో అదనపు బాధ్యతలు

**విజయవాడ జూలై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డైరెక్టర్‌గా పి.రత్నాకర్ నియమితులయ్యారు. ఏపీ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్‌గా రత్నాకర్ అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. విజయవాడలోని పిఐబి కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను అందరితో సమన్వయం చేసుకుంటూ సమర్థంగా నిర్వహిస్తా నన్నారు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ సీనియర్ అధికారి అయిన రత్నాకర్ ఇప్పటి వరకు సీబీసీలో ప్రాంతీయ కార్యాలయ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు.

# ఏసిబి గాలానికి చిక్కిన అవినీతి సబ్ రిజిస్ట్రార్

## - 50వేలు లంచం డిమాండ్

**గిద్దలూరు,జూలై 10,ప్రభాతవార్త** లంచం అనే మహమ్మారి సోకి బలైన గిద్దలూరు సబ్ రిజిస్ట్రార్ అవినీతి అడ్డాగా గిద్దలూరు ప్రభుత్వ కార్యాలయాలున్నట్లే డీడ్ చేసేందుకు డబ్బులు డిమాండ్ చేసిన గిద్దలూరు సబ్‌రిజిస్ట్రార్ ఎస్ కృష్ణమోహనను అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు గురువారం సాయంత్రం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గిద్దలూరు పట్టణానికి చెందిన భారద్ బాషా తన తల్లికి చెందిన ఇంటిని తనకు గిఫ్ట్ డీడ్ చేయాలని కోరగా ప్రభుత్వ చలానా కాకుండా అదనంగా తనకు రూ 50వేలు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేయగా, రూ 35వేలు ఇస్తానని రిజిస్ట్రార్ చేయాలని కోరాడు. అయితే డాక్యుమెంటు సక్రమంగా ఉన్నప్పటికీ లంచం ఇవ్వడం ఇష్టంలేని భారద్ భాషా ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ వారి సూచనల మేరకు గురువారం భారద్‌బాషా రూ.35 వేలను స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక భాగంలో సబ్‌రిజిస్ట్రార్ ఎస్.కృష్ణమోహన్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పట్టుబడిన డబ్బుతోపాటు సబ్ రిజిస్ట్రార్ ఎస్ కృష్ణమోహన్ ను ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని కర్నూలు ఏసీబీ, ప్రకాశం ఏసీబీ ఇంచార్జి డీఎస్పీ సోమన్న తెలిపారు. తీరు మార్చుకోని ప్రభుత్వ అధికారులుగాతంలో పట్టణ ప్రణాళిక విభాగం, పోలీస్‌స్టేషన్లో పట్టుబడినప్పటికీ అవినీతి అధికారుల తీరు మాత్రం మారడం లేదు. ఇంకా ఇంకా పేద ప్రజలు రక్తం చిందించి కష్టపడిన సొమ్మును దోచుకుంటూనే ఉన్నారు.

# ఆస్తుల రిజిస్ట్రేషన్లు అక్రమంగా జరిగితే వాటిని రద్దుచేసే అధికారాన్ని జిల్లా కలెక్టర్‌కే.. - నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం

**విజయవాడ జూలై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆస్తుల రిజిస్ట్రేషన్లు అక్రమంగా జరిగితే వాటిని రద్దుచేసే అధికారాన్ని జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని ప్రత్యేక కమిటీకి దాఖలు పరుస్తూ కూటమిప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. ఇది వెంటనే అమలులోకి వచ్చింది. రాష్ట్రంలోని అన్ని రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఉత్తర్వులు అందాయి. ఇవి అందిన వెంటనే అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. 2023 మార్చిలో చట్టసభల ద్వారా ఆమోదం పొందిన బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించడంతో జారీచేసిన ఈ నోటిఫికేషన్ అమల్లోకి వచ్చిందని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి జయలక్ష్మి వెల్లడించారు. సివిల్ కోర్టులకు మినహా అక్రమ ఆస్తుల రిజిస్ట్రేషన్లు రద్దుచేసే అధికారి ప్రస్తుతం ఎవరికీ లేదు. దీనివల్ల ఫోర్జరీ డాక్యుమెంట్లు, ఇతర అక్రమ పద్ధతుల్లో ఆస్తుల విక్రయాల రిజిస్ట్రేషన్లకు అడ్డుపడటం లేదు. ఈ నేపథ్యంలో అక్రమ ఆస్తుల రిజిస్ట్రేషన్లను నిరోధానికి జాతీయ రిజిస్ట్రేషన్ చట్టం- 1908 ను సవరించిన బిల్లుకు 2023 మార్చి 20న శాసనసభ ఆమోదం తెలిపింది. దీనికి రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. దీని అమలు ఉత్తర్వులు ఇప్పుడు వెలువడ్డాయి. రిజిస్ట్రేషన్ల అక్రమ పద్ధతుల్లో జరిగినట్టు ఫిర్యాదులందగానే జిల్లా రిజిస్ట్రార్ వాటిని పరిశీలిస్తారు. ఆధారాల ప్రాతిపదికన కలెక్టర్ నేతృత్వంలో ఏర్పడే కమిటీకి సిఫార్సు చేస్తారు. ఈ కమిటీ లో జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా రిజిస్ట్రార్ ఇతర అధికారులు ఉంటారు. నిషిద్ధ జాబితా నుంచి విడిపించిన 13 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల్లో 25వేల ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇందులో అక్రమాలు జరిగినవి 7వేల ఎకరాల వరకు ఉన్నాయి. తాజా ఉత్తర్వులతో ఇలాంటి రిజిస్ట్రేషన్లను రద్దుచేయడం సులువవుతుంది. నిషిద్ధ జాబితాలో ఉన్న భూములకు రిజిస్ట్రేషన్లు చేసినా ఒకే ఆర్టికి రెండుసార్లు రిజిస్ట్రేషన్ చేసినా, కోర్టు ఎటాచ్‌మెంట్‌లో ఉన్నవాటికి రిజిస్ట్రేషన్ చేసినా అలాంటి సబ్-రిజిస్ట్రార్లకు మూడేళ్ల వరకు జైలుశిక్ష విధిస్తారు. ఈ మేరకు సవరించిన చట్టంలో పేర్కొన్నారు. విధినిర్వహణలో సబ్-రిజిస్ట్రార్ అవకతవకలకు పాల్పడినట్లు తేలితే ఏడేళ్ల వరకు జైలుశిక్ష విధించవచ్చని ఇప్పటికే అమల్లో ఉన్న రిజిస్ట్రేషన్ చట్టంలో పేర్కొన్నారు.


తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 11 - జూలై - 2025



## విద్య ద్వారానే ఉన్నత భవిత : దేవస్థానం చైర్మన్ ఐవి రోహిత్



**అన్నవరం , జులై 10 , ( ప్రభాతవార్త ) :**
అన్నవరం దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల మరియు జూనియర్ కళాశాలల్లో గురువారం మెగా పేరెంట్, టీచర్స్ మీట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవస్థానం చైర్మన్ రాజా ఐవి రోహిత్, ఇఓ వీర్ల సుబ్బారావు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ రోహిత్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు విద్య ద్వారానే ఉన్నతమైన భవిష్యత్తు ఉంటుందని, జీవితంలో ఒడిదుడుకులు ఎన్ని ఎదురైనా బాగా చదువుకొని ఉన్నత స్థానం లో ఉండాలన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులను పాఠశాలకు ఆహ్వానించి, పాఠశాల యొక్క ప్రాముఖ్యత విద్యా, విధానం వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అల్లాడ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు తోటి వారితో ఎలా మెలగాలో తెలిపారు. విద్యార్థులకు గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ గురించి వివరించారు.తల్లికి వందనం గురించి మాట్లాడుతూ విద్యార్థులు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులకు పువ్వులతో పాదపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లితండ్రులచే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించారు.విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలసి మధ్యాహ్న భోజనం చేసారు. అనంతరం తల్లిదండ్రులు వారి పిల్లలతో ఆడి, పాడి ఆనందంగా గడిపారు. అనంతరం విద్యార్థులకు ఇఓ, చైర్మన్ లు మేమెంటోలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ రాయప్రోలు కామేశ్వరశర్మ, స్కూల్ కమిటీ చైర్మన్ శానపల్లి దేవి, కో ఆప్షన్ సభ్యులు తుమ్మలపల్లి సత్యేంద్ర, నాయకులు మెరపల నరసయ్య, బొమ్మిడి సత్యనారాయణ, దారా వెంకట రమణ, మద్దు వీరబాబు, దడాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.జూనియర్ కళాశాలలో : పేరెంట్స్, టీచర్స్ మీట్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ కుమారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపకులు సుంకర వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ శాఖ బాలికల నూతన వసతి గృహాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**జగ్గంపేట , జులై 10 , ( ప్రభాతవార్త ) :**
స్థానిక సచివాలయం 2 వద్ద సాంఘిక సంక్షేమ శాఖ బాలికల నూతన వసతి గృహాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా ప్రారంభించారు. తరగతి గదులను ఎస్వీఎస్ అప్పలరాజు, విశ్రాంతి గదులను జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్, వంటశాలను మారిశెట్టి భద్రం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థిని లను పేరుపేరునా పలకరించి చక్కగా చదువుకోవాలని సూచించారు. అనంతరం హాస్టల్ వార్డెన్ రోజా ఎమ్మెల్యే నెహ్రూ కు ఇంతటి చక్కటి వసతి సముదాయాన్ని బాలికలకు ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ రామవరం ఇందిరా యానాదుల కాలనీలో సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహం శిథిలావస్థకు చేరుకోవడంతో వారికి ఇక్కడ నూతన వసతి గృహం ఏర్పాటు చేశామని వారికి



అన్ని రకాల సౌకర్యాలు ఇక్కడ కల్పించడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషలాఫీసర్ సత్యనారాయణ, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వై వాణి, ఎండిఓ చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బో దిరెడ్డి శ్రీనివాస్ వేములకొండ జోగారావు, ఈవోపీఆర్డి భాస్కరరావు, హాస్టల్ వార్డెన్స్ రోజా, ప్రభాకర్, నండ్ల చిరంజీవి, రాయి సాయి, పంచాయతీ సెక్రెటరీ శివ అధిక సంఖ్యలో విద్యార్థిని ల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం



**గండేపల్లి , జులై 10 , ( ప్రభాతవార్త ) :**
గండేపల్లి మండలం మల్లేపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు.విద్యా కమిటీ చైర్మన్ కంచెర్ల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నేను చైర్మన్ గా ఉన్నంతకాలం పాఠశాలకు ఎనలేని కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ప్రత్యేక పరిశీలకులుగా ఎంపీడీవో కర్రి చంద్ర రావు పాల్గొన్నారు.విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సంస్కృతి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు కే హెచ్ నాయక్, వెంకటరెడ్డి, హెచ్ఎం అన్నపూర్ణ, పోతుల మోహన్ రావు, అడబాల భాస్కర రావు, బలిరెడ్డి గంగరాజు, సొసైటీ చైర్మన్ దిడ్డి వెంకట్రాజు, అడబాల ఆంజనేయులు, తెలగ రెడ్డి భద్రరావు, ప్రకాష్,కాటేపల్లి భద్రం, సింగులూరి రామదీపు, కొల్లి త్రిమూర్తులు ,చింతపల్లి వీరభద్రం, కార్యదర్శి కట్టా చంద్రశేఖర్, కూటమి నాయకులు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.అదేవిధంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మెగా పిటిఎం 2.0 ఘనంగా నిర్వహించారు.

## కె.గంగవరం మండలంలో మెగా పేరెంట్స్ - టీచర్స్ మీట్

**కె.గంగవరం , జులై 10 , ( ప్రభాతవార్త ) :**
గంగవరం మండలంలో 12 హైస్కూలు ,11 ప్రైమరీ మోడల్ స్కూల్స్,52 ప్రాథమిక పాఠశాలలు, 10 ప్రైవేట్ స్కూల్స్, 2 ప్రైవేటు కాలేజీల లో మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించబడింది అని ఎంఈఓ లు చోడిశెట్టి ఆంజనేయులు, నాగ రాజు తెలిపారు. గంగవరం హైస్కూల్లో చదువు తున్న సుమారు 300 మంది విద్యార్థులలో 240 మంది తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ప్రతి విద్యార్థి తరగతి గదిలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో విడిగా చర్చలు జరిపారు. వారి అభిప్రాయాలను,సూచనలను సేకరించి నమోదు చేశారు. విద్యార్థుల ప్రగతి, ప్రవర్త న, అవసరాలపై సమీక్షించబడింది. ఈ సందర్భంగా ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేసిన



ఫోటో బూత్ తల్లిదండ్రులను ఎంతో ఆకట్టుకుంది. కుటుంబాలతో తీసిన ఫోటోలను ప్రింట్ చేసి అందించేందుకు ఏర్పాట్లు చేశారు . ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, చిర్ర రాజకుమార్, పేరాబత్తుల నాగేశ్వర రావు, తామరపల్లి సర్పంచ్ శ్రీనివాస్, వెంకటరమణ, ఎస్ఎంసి చైర్‌పర్సన్ పెంటపాటి శివరామకృష్ణ ,వైస్ చైర్మన్ కాద మణికంఠ గ్రామ ప్రజలు,కూటమి నాయకులు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు పొడగట్లపల్లి వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు సమన్వయంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## ఎమ్మెల్యే నెహ్రూను కలిసిన సొసైటీల నూతన చైర్మన్ లు



**గండేపల్లి , జులై 10 , ( ప్రభాతవార్త ) :**
గండేపల్లి మండలం లోగల గండేపల్లి,జడ్. రాగంపేట,మల్లేపల్లి సొసైటీల చైర్మన్ లుగా నూతనంగా నియమితులైన కంటిపూడి సత్యనారాయణ, కందుల కొండయ్య చౌదరి (బాబ్జి) దిడ్డి శ్రీను లు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను మర్యాద పూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. గండేపల్లి, జెడ్ రాగంపేట, మల్లేపల్లి సొసైటీ త్రిసభ్య కమిటీ డైరెక్టర్లుగా నియమితులైన గొల్లవిల్లి అన్నవరం, కంటిపూడి రామారావు, మద్దిపాటి రాంబాబు, వైభోగుల వెంకటేశ్వర్లు వెలిది సుబ్రహ్మణ్యం, ఇల్లంకల నాయుడు,ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన కమిటీల ఆధ్వర్యంలో గండేపల్లి, జెడ్ రాగంపేట, మల్లేపల్లి సొసైటీలు మరింత అభివృద్ధి చెందాలని అన్నారు. నూతన చైర్మన్లు మాట్లాడుతూ మమ్మల్ని గుర్తించి సొసైటీ చైర్మన్లు గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే నెహ్రూ కి, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని వారి సహకారంతో సొసైటీలను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తూ రైతులకు సొసైటీ ద్వారా లభించే రాయితీలు అందిస్తూ వారికి ఎప్పుడూ అందుబాటు లో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోతుల మోహనరావు, అడబాల భాస్కర రావు, కందుల చిట్టిబాబు, కేతిన వెంకన్న చౌదరి, శీలామంతుల వీరబాబు,బొల్లం రెడ్డి రామకృష్ణ, కందుల గోవింద చౌదరి, కురుకూరి వీర వెంకట చౌదరి,కందుల విజయ్, కందుల వినయ్, కంటే సురేంద్ర, తెలగ రెడ్డి భద్ర రావు, బోండా శ్రీనుబాబు, చిట్యాల బాబ్జి, కాటేపల్లి భద్రరావు, కొల్లు త్రిమూర్తులు, పంచికట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత చదువులతోనే వ్యక్తిత్వ వికాసం..పండుగలను తలపించిన పాఠశాలలు

### - తొండవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ 2.0లో పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి

**అంబాజీపేట , జులై 10 , ( ప్రభాతవార్త ) :**
ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలతో వినూత్నంగా నిర్వహించిన మెగా పేరెంట్స్,టీచర్స్ మీటింగ్ (పి.టీ.ఎం) 2.0 దేశ రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలుస్తుందని, ఉన్నత చదువులతోనే వ్యక్తిత్వ వికాసం వృద్ధి చెందుతుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాల లో మెగా పిటిఎం 2.0 గురువారం పండుగ వాతావర ణంలో జరిగింది.తొండవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పి.వి.కేశవాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన మెగా పీటీఎం 2.0 లో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారా యణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో బోధిస్తున్న విద్యతో పాటు పాఠశాల అభివృద్ధి,క్రీడలు వంటి కార్యక్రమాలపై విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య ఉన్నతమైన అవగాహనతో ముందుకు వెళ్లే అవకాశం కలుగుతుందనే భావనతో రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి ఉన్నతమైన కార్యక్రమానికి గత ఏడాది శ్రీకారం చుట్టిందన్నారు. చదువు అందరికీ అందాలనే ఉద్దేశంతో ప్రతి విద్యార్థికి అవసరమైన పుస్తకాలు,బ్యాగు, బూట్లు, సాక్స్ లు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంతో పాటు ఒకటి నుండి 12వ తరగతి వరకు ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకంలో భాగంగా తల్లుల ఖాతాలలో రూ.13 వేలు జమ చేస్తున్నారన్నారు.ప్రతి మనిషి వ్యక్తిత్వం కల మనిషిగా



జీవించడానికి చదువు ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే గిడ్డి అన్నారు. ఏ గ్రామంలో అయితే ఐఏఎస్, ఐపీఎస్ సర్వీస్కు చెందినవారు ఉంటే ఆ గ్రామంతో పాటు రాష్ట్రం, దేశం ఎంతో అభివృద్ధి సాధిస్తుందన్నారు. చదువు అంటరానితనాన్ని రూపు మారుస్తుందని, ఉన్నత విద్యతోనే పరిపూర్ణ జ్ఞానం లభిస్తుందని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆనాడే చెప్పారన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్య ఆయనే ఆయుధాన్ని ఇచ్చి ప్రతి విద్యార్థిని ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. పిల్లల చదువులో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.'తల్లికి వందనం' పై రచించిన కవితను వినిపించిన విద్యార్థినిని ఎమ్మెల్యేతో పాటు ఎన్డీఏ కూటమి శ్రేణులు, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే పాఠశాలలో వివిధ రంగాలు (విద్య,క్రీడలు, ఎగ్జిబిషన్, టైక్వాండో) లలో రాణించిన విద్యార్థులను, సహకరించిన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే అభినందిం చారు..'అమ్మ పేరుతో ఒక మొక్క' కార్యక్రమాన్ని ప్రారం భించి విద్యార్థులకు మొక్కలు అందజేసి, గ్రీన్ పాస్పోర్ట్ ను అందించారు. మొక్క పెరుగుదల బాధ్యత విద్యార్థుల దేనన్నారు. అనంతరం ఇరువైపులా నిలుచుని తాడును పట్టి లాగే (టగ్ ఆఫ్ వార్ )క్రీడను ఎమ్మెల్యే ప్రారంభిం చారు..అంతకుముందు విద్యార్థులచే పల్లెటూరి పల్లకిలో నృత్య రూపకం అలరించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివి కేశవాచార్యులు పాఠశాల అభివృద్ధిని వివరిస్తూ మరిన్ని మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యేను సభాముఖంగా కోరారు. అనంతరం పాఠశాల సిబ్బంది, యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అలాగే ఇసుకపూడి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ ఎల్ వరప్రసాద్ ఆధ్వర్యంలో మెగా పిటిఎం 2.0ను ఘనంగా నిర్వహిం చారు. విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతి కార్యక్ర మాలను అలరించాయి. తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో తల్లులకు పాద నమస్కారాలు చేయించారు. అలాగే పుల్లేటికుర్రు,ముక్కామల, గంగల కుర్రు, గంగలకుర్రు అగ్రహారం, చిరుతపూడి, అంబాజీపేట ఉన్నత పాఠశాలలో మెగా పీటీఎం 2.0 నిర్వహించారు. పాఠశాలల వద్ద అంబాజీపేట,ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పీటీసీ లతోపాటు,ఆయా గ్రామ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, కూటమి శ్రేణులు, అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులలో ఉన్న నైపుణ్యం గుర్తించి ప్రోత్సాహం అందించడం ముఖ్యం : కలెక్టర్ ప్రశాంతి

**గోపాలపురం , జులై 10 , ( ప్రభాతవార్త ) :**
విద్యార్థులలో ఉన్న నైపుణ్యం, ఇతర లోపాలను గుర్తించి వాటిపై చర్చించేందుకు పే టి యం సమావేశాలు చక్కటి వేదిక అని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. విద్యార్థి తన భవిష్యత్తుని మెరుగు పరుచుకోవడానికి ఉపాధ్యాయుల పాత్ర అంతే బాధ్యత తల్లితండ్రులపై కూడా ఉందన్నారు.గురువారం గోపాలపురం మండలం కొవ్వూరుపాడు, రాజంపాలెం జడ్పీ హైస్కూల్ లలో నిర్వహించిన పేరెంట్ టీచర్స్ మీటింగ్ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, చిన్నారులకు పిన్నవయసులోనే మంచి అలవాట్లను అలవర్చుకునే విధంగా తగు శిక్షణ తల్లిదండ్రులే ఇవ్వాలని, ఉదయం లేచిన మొదలు స్కూల్ కి , టిఫిన్ భోజనం వంటి కార్యక్రమాలు సక్రమంగా ముగిం చు కోవడం తోటి విద్యార్థులతో మంచి ప్రవర్తనతో నడుచుకోవడం సాయంత్రం ఇంటికి రాగానే బుద్ధిగా చదువుకొని తల్లిదండ్రులకు పనులలో సహకరించి, పిల్లలకు విద్య విషయంలో సాయంత్రం పడుకునేవరకు తల్లిదండ్రులే దగ్గర ఉండి నేర్పించి మంచి పౌరులుగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఇరువురిపై ఉందన్నారు.

## మండలంలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



**అంబాజీపేట , జులై 10 , ( ప్రభాతవార్త )**
గురు పౌర్ణమి సందర్భంగా మండలంలోని షిరిడి సాయి నాథుని మందిరాలలో గురు పౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు.కొర్లపాటివారిపాలెంలో ఉన్న శ్రీ గురుదత్త సద్గురు శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో ఆలయ అర్చకులు కంచినాధం కృష్ణ ఫణిశర్మ స్వామి వారికి లక్ష పత్రి పూజ, అభిషేకములు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన చేపట్టారు. శ్రీ శ్రీనివాస భక్తి భజన బృందం వారిచే భక్తి గీతాలను ఆలపించారు. వాకలగరువులో శ్రీ సంతాన సిద్ధివినాయక, దత్తాత్రేయ, షిరిడీ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.చిరతపూడి, గంగలకుర్రు అగ్రహారం, ఇరుసుమండ, పుల్లేటికుర్రు తదితర గ్రామాలలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



**కాట్రేనికోన , జులై 10 , ( ప్రభాతవార్త ) :**
కాట్రేనికోన మండల పరిధిలోని దొంతుకుర్రు గ్రామంలో వేంచేసి ఉన్న షిరిడి సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను గురువారం వైభవంగానిర్వహించారు. భక్తులతో కిటకిటలాడిన సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు ,అలంకరణలు,అన్న సమారాధన నిర్వహించారు, వేకువ జాము నుండి సాయంత్రం వరకు సాయి బాబాకి ప్రత్యేక పూజలు చేశారు. షిర్డి సాయి బాబాకు గురుపౌర్ణమి సందర్భంగా అన్న సమారాధన కమిటీ సభ్యులు అధర్వంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ పూజా కార్యక్రమాలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్ధ ప్రసాదాలను స్వీకరించారు .ఆలయానికి పువ్వులు , పచ్చని తోరణాలతో విద్యుత్ కాంతులతో అలంకరణ చేశారు.

## ఓఎన్జీసీ తీరుపై ఆందోళన..భరోసా కల్పించాలని స్థానికుల డిమాండ్

**మామిడికుదురు , జులై 10 , ( ప్రభాతవార్త ) :**
ఓఎన్జీసీ డ్రిల్లింగ్ బావి వద్ద జరిగిన గ్యాస్ లీక్ సంఘటన నేపథ్యంలో స్థానికులు గురువారం ధర్నా చేశారు.తమకు రక్షణ కల్పించాలని అధికారులు సంఘటనా స్థలానికి వచ్చి స్వయంగా పరిశీలించి ప్రజలకు తగిన రక్షణ కల్పించాలంటూ ఆందోళన చేపట్టారు. పాశర్లపూడి-పాశర్లపూడి లంక గ్రామాల సరిహద్దులో డ్రిల్లింగ్ నిర్వహిస్తున్న రిగ్వద్ద ధర్నా చేశారు. ఓఎన్జీసీ కార్యకలాపాలతోతాము తాము అనుక్షణం భయం భయంగా గడుపుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు.అక్కడ చేపట్టిన పనులను అడ్డుకున్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొనుకు



నాగరాజు,పొన్నమండ రామస్వామి,బిరుదుగంటి నరసింహమూర్తి, మోకా దుర్గారావు, అడబాల దొర బాబు, గోనిపాటి మధుబాబు, తాడి శ్రీనివాస్,రొక్కాల రాజశేఖర్,పోలమూరి గోపాల్,ఉండ్రు చిన్న,కోలా సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ లో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల



**సీతానగరం , జులై 10 , ( ప్రభాతవార్త ) :**
మండలంలోని రఘుదేవపురం జడ్పీ హైస్కూల్లో గురువారం ఏర్పాటు చేసిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, జాయింట్ కలెక్టర్ చిన రాముడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యార్థుల నైపుణ్యం, సృజనాత్మకత పెంపొందించి, వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయడానికి ఈ సమావేశాలు ఉపయోగపడతాయని అన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం, సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లు, తల్లికి వందనం కింద పదిహేను వేల రూపాయలు జమ చేశామని , పరీక్షల్లో ఉత్తమమైన ఫలితాలు కనబరిచిన వారికి షైనింగ్ అవార్డులు పేరిట సత్కరించారని తెలిపారు. ప్రతి విద్యార్థికి సంవత్సరానికి ప్రభుత్వం 83,000 ఖర్చు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తెచ్చామని, ఈ సందర్భంగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నామని, తల్లిదండ్రులు పాల్గొనడం సంతోషకరమని తెలిపారు. ఈ సమావేశం ద్వారా పిల్లల ప్రగతి, ప్రభుత్వ విద్యా కార్యక్రమాలు తెలుసుకో వచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇండిగమెల్లి చంద్రలీల,మట్ట వెంకటేశ్వరరావు, గెద్దాడ త్రిమూర్తులు, దాసరి రమేష్, పలువురు కూటమి నాయకులు, మండల అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జనసైనికుడికి బండారు శ్రీనివాస్, ఆర్ధిక సాయం

**ఆత్రేయపురం , జులై 10 , ( ప్రభాతవార్త ) :**
ప్రమాదంలో తీవ్ర గాయలయ్యి వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గుర్తించి జన సైనికులు కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ ల సహకారంతో రూ.1,90,500లు భారీ ఆర్థిక సాయం దుర్గాప్రసాద్ కు అందజేశారు.మెర్లపాలెం గ్రామానికి చెందిన రంకిరెడ్డి దుర్గాప్రసాద్ తన వృత్తి పనిమీద వెళుతుండగా ప్రమాదం జరిగింది. దుర్గాప్రసాద్ ఇంటికి కొత్తపేట జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ఈ మొత్తాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మెర్ల రాము, ఎంపిటిసి వీరబాబు, జనసేన పార్టీ మండల కన్వీనర్ చేకూరి కృష్ణంరాజు, జనసేన పార్టీ నాయకులు



సూరపురెడ్డి సత్య, సలాది జయప్రకాశ్ నారాయణ(జేపి), పుత్ర సాయిరాం, మెర్ల నాగేశ్వరరావు, బద్దెల గురవయ్య, నామాల ఏసు, బద్దెల నాగన్న, బాలు, సత్య, అశోక్ కుమార్, పాల్రాజు, సంజు, గోప మనోహర్, గోప తరుణ్, లోవరాజు, ప్రకాష్ పలువురు వీర మహిళలు చుట్టు గుల్ల వరలక్ష్మి, నేతునూరి సుందరి, పాల్గొన్నారు.

# సమాజ భాగస్వామ్యం ఉన్నప్పుడే ఏ రంగమైనా అభివృద్ధి చెందుతుంది : కలెక్టర్



**మామిడికుదురు , జులై 10 , ( ప్రభాతవార్త )**

సమాజ భాగస్వామ్యం ఉన్నప్పుడే ఏరంగమైన అభివృద్ధి చెందుతుందని, రాష్ట్ర ప్రభుత్వం బలంగా విశ్వసించి మెగా పిటీఎం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ పేర్కొన్నారు.గురువారం మామిడి కుదురు జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలో మెగా పిటీఎం కార్యక్రమాలు నిర్వహణ తీరును పరిశీలించారు. అదేవిధంగా జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ ల్యాబ్,విద్యా సంస్థలలో వసతులు,మరుగుదొడ్లు ఆరో ప్లాంట్లు నిర్వహణ తీరును తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సమన్వయంతో నిర్వహి స్తున్న మెగా పీటీఎం కార్యక్రమాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యా ర్థుల ఉజ్వల భవిష్యత్తుకు అందరూ సమన్వయంతో పాటుపడాలని సూచించారు. విద్యాభివృద్ధిలో కూడా సమాజం కీలక భాగ స్వామి కావాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఆకాంక్ష అన్నారు. పేద రికంలేని సమాజ నిర్మాణమే ధ్యేయంగా విద్యారంగంలో అనేక సంస్కరణలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. తల్లిదం డ్రులు, ఉపాధ్యా యులు పాఠశాల మధ్య సంబంధాలను బలపరచడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేసి రాబోయే 2047 సంవత్స రాంతానికి స్వర్ణాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దాలని సంకల్పించారన్నారు.ఇందులో భాగంగానే పేరెంట్ టీచర్స్ మీటింగ్ ఆదర్శవంతంగా నిర్వహించారన్నారు.తల్లిదం డ్రులు తమ పిల్లలు విద్యా పరంగా, ప్రవర్తనా పరంగా ఏ స్థాయి లో ఉన్నారో, సమాజ అంశాల పట్ల ఎలాంటి అవగాహనా కలిగి ఉన్నారో తెలుసుకునేందుకు, తల్లిదండ్రులు, ఉపాధ్యా యుల నుండి ఎలాంటి సహకారం కోరుకుంటున్నారో పరస్పరం తెలుసుకునేందుకు ఒక మంచి వేదికగా పిటిఎం నిలిచిందన్నారు. ఈ కార్యక్రమం జిల్లాలోని ప్రతి పాఠ శాల, జూనియర్ కళాశాలలో ఒక పండగ వాతా వరణంలో నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠ శాలల మధ్య బలమైన బంధాన్ని ఏర్పరచి, విద్యార్థుల విద్యా ప్రగతికి, పాఠశాలల అభివృద్ధికి ఉమ్మడిగాకృషి చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు.ప్రతి విద్యార్థి తల్లి పేరున గ్రీన్ పాస్ పోర్టు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వ హించారన్నారు. మొక్క నాటడంతో పాటు డొక్కా సీత మ్మ మధ్యాహ్న భోజనం పేరెంట్స్, టీచర్స్, ప్రజాప్రతి నిధులతో ఒక పండగ వాతావరణంలో కలసి సహపంక్తి భోజనాలు నిర్వహించా రన్నారు.ఈ కార్య క్రమంలో ఆయా ప్రభుత్వ,ప్రైవేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల ఆత్మీయ కలయిక అద్భుతం : ఎస్.ఐ అవినాష్



**కాట్రేనికోన , జులై 10 , ( ప్రభాతవార్త ) :**

కాట్రేనికోన మండలం దొంతికుర్రు హైస్కూల్లో మెగా పేరెంట్స్ & టీచర్స్ మీటింగ్ ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి తల్లిదండ్రులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.ఈ సమావేశం ఉదయం 9:00 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1:00 గంట వరకు కొనసాగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కాట్రేనికోన సబ్ ఇన్స్పెక్టర్ అవినాష్ హాజరైనారు. ఈ సందర్భంగా అయన మాట్లడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమర్థవంతమైన సమన్వయం ఎంత ముఖ్యమో వివరించారు. ప్రధానోపాధ్యురాలు మరియా బీబీ విద్యార్థుల విద్యా ప్రగతి, క్రమశిక్షణ, మరియు పాఠశాల కార్యకలాపాల గురించి చర్చించారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి యొక్క విద్యా ప్రగతి నివేదికలను తల్లిదండ్రులకు అందజేశారు. విద్యార్థుల బలహీనతలు, వాటిని అధిగమించడానికి తీసుకోవలసిన చర్యలు మరియు వారి బలాలు గురించి వివరంగా చర్చించారు. తల్లిదండ్రులు తమ పిల్లల అభ్యాసంలో ఎదుర్కొంటున్న సమస్యలను ఉపాధ్యాయులతో పంచుకున్నారు. ఉపాధ్యాయులు వారికి తగిన సూచనలు మరియు సలహాలు అందించారు. ఈ సమావేశంలో తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా వాతావరణాన్ని అందించడానికి ప్రభుత్వం మరియు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని వారు అభినందించారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సమావేశాలను తరచుగా నిర్వహించడం ద్వారా తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల మధ్య అనుబంధాన్ని మరింత పటిష్టం అవుతుందని తెలిపారు. ఇది విద్యార్థుల విద్యా ప్రమాణాల ను మెరుగుపరచడానికి మరియు వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడానికి సహాయ పడుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశం పాఠశాల అభివృద్ధికి ఒక ముఖ్యమైన ముం దడుగు అని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు అర్.వెంకటేశ్వరరావు ,మట్టపర్తి రాజశేఖర్ , అరుణ ,కమల ,దుర్గ లక్ష్మి ,అనంత లక్ష్మి , గ్రామ సర్పంచ్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు పిల్లల పట్ల విద్య పై అవగాహన కల్పించి బాధ్యతో మెలగాలి

## మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఎంపీడీఓ వెంకటరామన్

**ఆత్రేయపురం , జులై 10 , ( ప్రభాతవార్త ) :**

తల్లిదండ్రులు పిల్లల పట్లఎప్పటికప్పుడు విద్యపై అవగాహన కల్పిస్తూ బాధ్యతగా వ్యవహరించినప్పుడు పిల్లలు విద్యతో పాటు మంచి నడవడికతో రానిస్తారని ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్.వెంకట రామన్ అన్నారు. గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం 2.%వా% లో భాగంగా ఆత్రేయపురం ఎంపిడిఓ బి.కె.ఎస్. ఎస్.వెంకట రామన్ పర్యవేక్షణ అధికారి అంకంపాలెం గ్రామాన్ని సందర్శించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అంకంపాలెం గ్రామ సర్పంచ్ ముత్తా బత్తుల రాజు గ్రామ టి.డి.పి.నాయకులు కుడప కృష్ణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్.వెంకట రామన్ మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు పిల్లలకు విద్య పట్ల సమాజం పట్ల అవగాహన కల్పిస్తూ బాధ్యత గా వ్యవహరించినప్పుడు మంచి భవిష్యత్తు ను వారికి అందించిన వారు అవుతారని అన్నారు.విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి పాఠశాల అభివృద్ధిలో తాము కూడా భాగస్వాములమవుతామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, అతిథులు, విద్యా కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు కలిసి పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం పిల్లలకు మొక్కలు పంపిణీ చేసారు.17 గ్రామాల పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమములో పాఠశాల ప్రదానోపాధ్యాయులు జి.పరిమళ కుమారి, పి.ఇ.టి. టి.శోభారాణి, పంచాయితీ కార్యదర్శి, కె.ఎస్.ఎన్.మూర్తి, గ్రేడ్-5 కార్యదర్శి, షేక్ అబ్దుల్ ఖాదర్ జిలాని, గ్రామ సచివాలయ సిబ్బంది, విద్యార్థులు, తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.




# కార్పొరేట్ కు ధీటుగా ప్రభుత్వ విద్య

## - విద్యా వ్యవస్థలో సమూల మార్పులు : కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు



**రావులపాలెం , జులై 10 , ( ప్రభాతవార్త ) :**

రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చి కార్పోరేట్ కు ధీటుగా ప్రభుత్వ విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ ఎస్.వి. సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీట్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భావి భారత పౌరుల భవిష్యత్తు బాగుండాలంటే విద్యే పునాదిగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో విద్యాపరంగా సమూలమైన మార్పులు ప్రారంభమయ్యాయనడానికి ఈ మెగా పేరెంట్, టీచర్ మీట్ ఒక ఉదాహరణని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని నిలిపివేస్తే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పునరుద్ధరించామని ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు. రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల జిల్లాలో ఉన్నతంగా నిలిచిందని, గత ఏడాది కన్నా ఈ ఏడాది కళాశాలలో అడ్మిషన్లు బాగా పెరిగాయని దీనికి కారణమైన ఇక్కడి అధ్యాపకుల కృషి అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర పథకం కింద విద్యార్థులకు అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాల ప్రదర్శనను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, కొత్తపేట నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి.వి. రమణ, సూపర్వై జర్లు ఎం.భాగ్యరాజ్, జి. కోటేశ్వరరావు, ఎంపీటీసీ దొండపాటి వీర్రాజు,కళాశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి, కార్యదర్శి కొవ్వూరి నరేష్ కుమార్ రెడ్డి, సభ్యులు జక్కంపూడి రామకృష్ణ, పెచ్చెట్టి చిన్నారావు, కొవ్వూరి వెంకటరెడ్డి, పల్లా శ్రీను, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు గొలుగూరి వెంకటరెడ్డి (విక్టరీ), సత్తి సోమిరెడ్డి, కొవ్వూరి వెంకట కృష్ణారెడ్డి, రామకృష్ణ, చిన్న కేవీ, టీడీపీ నాయకులు గుత్తుల పట్టాభి రామారావు, వెలగల శ్రీనివాసరెడ్డి, జక్కంపూడి వెంకట స్వామి, చిన్నం శ్రీనివాసరెడ్డి, పడాల బులి కొండారెడ్డి, కొవ్వూరి అచ్చిరెడ్డి, రాచకొండ శ్రీనివాస్, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, కొప్పిశెట్టి ప్రసాద్, విళ్ళ రాము, బొంతు రాంబాబు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


# రోడ్డు ప్రమాదంలో యువకుని దుర్మరణం



**రావులపాలెం , జులై 10 , ( ప్రభాతవార్త )**

రావులపాలెం మండలం గోపాలపురం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలాఉన్నాయి. కొత్తపేట మండలం గంటి చిన్న పేటకు చెందిన యడ్ల సుభాష్ (24)అనే యువకుడు తన మోటార్ సైకిల్ పై రావులపాలెం వైపు నుంచి గోపాలపురం వెళుతుండగా వెనుక వస్తున్న లారీవేగంగా ఢీకొట్టి కొంత దూరం ఈడ్చుకెళ్ళడంతో తీవ్ర గాయాల తో అక్కడికక్కడే మృతిచెందాడు. లారీ చక్రాలు అతని మీద నుంచి వెళ్లడంతో శరీరం నుజ్జు నుజ్జు య్యింది. మృతుని చిన్నాన్న యడ్ల రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సిఐ ఎం. శేఖర్ బాబు తెలిపారు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# మరిడమ్మ తల్లికి భారీగా సారె



**అన్నవరం , జులై 10 , ( ప్రభాతవార్త )**

అన్నవరంలో కొలువు తీరిన శ్రీ మరిడమ్మ వారికి గురు వారం అమ్మవారికి ఎంతో ప్రీతికరమైన ఆషాడ పౌర్ణమి మహా పర్వదినం సందర్భంగా సుమారు 500 మంది ముత్తైదువులు సారె సమర్పించారు. వీరంతా వివిద రకముల స్వీట్లు, పిండివంటలు, పండ్లు, పుష్పములు, చీర, రవికలు , పసుపు, కుంకుమ, గాజులు కలిగిన సారె బిందెలు శిరస్సున ధరించి, గ్రామంలో ప్రధాన రహదారుల గూండా భాజా భజంత్రీల నడుమ ఊరేగింపుగా మరిడమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకొని వైభవంగా సారె సమర్పణ గావించారు. ఈ పదార్థాలు అమ్మవారికి నివేదించిన అనంతరం భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేసారు. అన్ని రకాల కాయగూరలు, ఆకు కూరలు వస్త్రంగా ధరించి శాఖాంబరీగా భక్తులకు దర్శణమిచ్చారు. అన్నవరం దేవస్థానం చైర్మన్ రాజా ఐవి రోహిత్ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంతం రద్దీగా మారింది. ట్రాఫిక్ సమస్యలు రాకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

# శ్రీ షిరిడి సాయి బాబా ఆలయాల్లో గురు పౌర్ణమి వేడుకలు



**మామిడికుదురు , జులై 10 , ( ప్రభాతవార్త ) :**

మండల పరిధిలోని శ్రీ షిరిడి సాయి బాబా ఆలయాల్లో గురువారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. మామిడికుదురు, మొగలికుదురు, పెద్దపట్నం, మగటపల్లి,పెద్దపట్నం లంక,బి .దొడ్డవరం, లూటుకుర్రు ,పాశర్లపూడి బాడవ తదితర ఆలయాల్లోవిభూది పాలతో ప్రత్యేక పూజలు జరిపించారు.అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని ముడుపులు,మొక్కుబడులు చెల్లించుకున్నారు. పలు గ్రామాల్లో ఆలయాల వద్ద భారీ స్థాయిలో అన్నాడ మారాధనలు ఏర్పాటు చేశారు.గురు పౌర్ణమి సందర్భంగా పలు ఆలయాల్లో ఆధ్యాత్మిక,సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

# శాకాంబరీ దేవిగా శ్రీ విజయ కనకదుర్గమ్మ దర్శనం



**అంబాజీపేట , జులై 10 , ( ప్రభాతవార్త )**

ఆశాడ మాసాన్ని పురస్కరించుకుని అంబాజీపేట పశువుల మార్కెట్ వద్ద వేంచేసియున్న శ్రీ విజయ కనకదుర్గ అమ్మ వారు శాకాంబరి దేవిగా భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. స్థానికులు, భక్తులు సమకూర్చిన వివిద రకాల కూరగాయలతో అమ్మవారిని కనువిందులుగా అలంకరించారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ,ప్రసాదములు అందజేశారు.

# ఆదిత్యలో ఘనంగా గురుపూర్ణిమ వేడుకలు

**గండేపల్లి , జులై 10 , ( ప్రభాతవార్త ) :**

గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ప్రాంగణంలో గల షిర్డీసాయి బాబా మందిరంలో గురుపూర్ణిమ పర్వదిన సందర్భంగా విశేష పూజలు,అభిషేకాలు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.బాబా వారికి విశేష అభిషేకాలు,పుష్పాలతో విశేష అర్చన,త్రికాల హారతి తదితర పూజా కార్యక్రమాలు ఆదిత్య అధినేతలు డాక్టర్ నల్లమిల్లిశేషారెడ్డి లక్ష్మీరాజ్యం దంపతులు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో యూనివర్సిటీ ఛాన్సలర్.డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి,శృతి రెడ్డి, డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాసరెడ్డి, విభాగాధిపతులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయి బాబా పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి : రాష్ట్ర టిఎస్టియుసి ఉపాధ్యక్షులు శివ



**శంకవరం , జులై 10 , ( ప్రభాతవార్త ) :**

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని రాష్ట్ర టిఎస్టియుసి ఉపాధ్యక్షులు వెన్న శివ పేర్కొన్నారు. మండలంలోని కత్తిపూడిలో గల జిల్లా పరిషత్ హై స్కూల్ శ్రీనిధి జూనియర్ కళాశాల ఎంపీపీ స్కూల్ నందు హై స్కూల్ హెచ్ఎం రామలింగేశ్వరరావు కళాశాల ప్రిన్సిపాల్ నాయుడు రవి అధ్యక్షతన "మెగా పేరెంట్స్ మీట్" ఘనంగా నిర్వహించడ మైనది. స్థానిక శాసనసభ్యులు సత్యప్రభ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సమావేశం నిర్వహిం చారు.ఈ సందర్భంగా శివ విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ 'ప్రభుత్వ విద్యా సంస్థల పట్ల తల్లిదండ్రులలో విశ్వాసాన్ని పెంచుటకు, సాధారణ విద్యార్థులను అసాధారణ విద్యార్థులుగా మెరుగు పరిచి, వెలుగులోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక చర్యగా అభివర్ణించారు.విద్యార్థుల బంగారు భవిష్యత్తు కు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న విద్యా పరమైన ప్రోత్సాహకాలను, పథకాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమం లో మండల విద్యాశాఖ అధికారి సూరిశెట్టి వెంకటరమణ హై స్కూల్ చైర్మన్ సురేష్ మార్కెట్ కమిటీ నెంబరు నాయుడు సూరిబాబు జనసేన రాష్ట్ర కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ వేణుమాధవ్ స్వామి ఆలయ చైర్మన్ కాలింగ్ నూకరాజు గాబు కృష్ణ కంచిపోయిన శ్రీను కంద గోవిందు ఉపాధ్యాయులు నూకరాజు ఎంపీపీ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులుశివ చంటిబాబు విద్య కమిటీ ఉపాధ్యక్షురాలు జిలకరసుజాత గజ్జి సుబ్బరాజు లోవరాజు తదితరులు పాల్గొన్నారు

# కాటవరంలో దహించు అగ్ని మినిస్ట్రీస్ మెగా వైద్య శిబిరం



**సీతానగరం , జులై 10 , ( ప్రభాతవార్త ) :**

మండలంలోని కాటవరం గ్రామంలో దహించు అగ్ని మినిస్ట్రీస్ బిషప్ డాక్టర్ థామస్ పుట్టినరోజు సందర్భంగా గురువారం దహించు అగ్ని క్యాంపస్ లో మెగా వైద్య శిబిరం, రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. రాజమహేంద్రవరం నుండి వచ్చిన నిపుణులైన వైద్య బృందం అధునాతన పరికరాలతో ఉచిత వైద్య సేవలు అందించింది. ఈ సందర్భంగా బిషప్ డాక్టర్ థామస్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా సుమారు ఐదు వందల మందికి పైగా ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఎంతోమంది యువకులు బృందాలుగా విచ్చేసి రక్తదానం చేశారని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# చింతలూరు నూకాలమ్మ ఆలయానికి కుమారబాబు భారీ విరాళం..రాజగోపురానికి రూ.5.50 లక్షలు



**ఆలమూరు , జులై 10 , ( ప్రభాతవార్త ) :**

ఆలమూరు మండలం చింతలూరు నూకాలమ్మ ఆలయానికి మండపేటకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, తెలుగుదేశం నాయకులు వంక సాయికుమార్ బాబు భారీ విరాళాన్ని అందజేశారు. ఆషాడ పౌర్ణమి సందర్భంగా గురువారం ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న రాజగోపురాల నిర్మాణ పనుల నిమిత్తం రూ. 5.50 లక్షలను విరాళంగా అందజేశారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నిమిత్తం ఈ మొత్తాన్ని వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో అల్లంరాజు రామకృష్ణమూర్తి, వైట్ల గంగరాజు, గన్ని వెంకట్రావు,గన్ని సూరిబాబు , బొబ్బా ఏసుప్రభాకర్,మురళి తదితరులు పాల్గొన్నారు.

# గుర్రపాలెంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశం




**జగ్గంపేట , జులై 10 , ( ప్రభాతవార్త ) :**

జగ్గంపేట మండలం గుర్రంపాలెం గ్రామపంచాయతీ సగరపేటలోని మోడల్ ప్రైమరీ స్కూల్లో జిల్లా ఐక్య ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి పడాల వీర వెంకట సత్యనారాయణ (పీవీ మాస్టర్) అధ్యక్షతన జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ పాఠశాల అభివృద్ధి కోసం యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పివి మాస్టారు 3 లక్షల రూపాయలు విరాళంగా అందించారు. భగీరథ యూత్ ఆధ్వర్యంలో సరస్వతి దేవి విగ్రహం, సగరపేట గ్రామ పెద్దలు 15000, మెగా ఫ్యాన్స్ యూత్ 10000, నందమూరి ఫ్యాన్స్ యూత్ 5000, టిడిపి నేతలు పోంద్రు బాలనాగు కంప్యూటర్, పడాల బాలాజీ కంప్యూటర్, డాక్టర్ రమణ 25000, నక్క పెద్ద వెంకటేశులు, నక్క చిన్న వెంకటేశులు, ముల్కి వీర అప్పలరాజు, గాది జీయ్యాన్న, స్కూల్ స్టేజి నిర్మాణం, గండికోట రామస్వామి 15,000, గాది నాగరాజు 10000, విరాళాలు అందించి స్కూల్ అభివృద్ధికి తోడ్పాటు అందించారు. 3 లక్షల రూపాయలు అందించిన పడాల వీర వెంకట సత్యనారాయణ (పివి మాస్టారు) ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఘనంగా సత్కరించారు. స్కూల్ అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో పెను మార్పులు తీసుకురావడానికి ప్రతి సంవత్సరం మెగా పేరెంట్స్, టీచర్స్ డే ఏర్పాటు చేసి రెండో సంవత్సరం కూడా విజయవంతంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని తీసుకున్నారని ప్రతి ఒక్కరు కూడా ఆ గ్రామంలో ఉన్న పెద్దలు విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా విరాళాలు ఇవ్వాలని అన్నారు. విద్యార్థిని విద్యార్థులు ఈ మౌలిక వసతులు ఉపయోగించుకుని మంచి విద్యను అభ్యసించి మంచి ఉన్నత స్థితికి చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సగర పేటకుటమి నాయకులు, గ్రామ ప్రజలు, నియోజవర్గ కూటమి నాయకులు విద్యాశాఖ అధికారులు, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యతోనే విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తు : రిఫరల్ చైర్మన్ ఎన్ స్లెస్సర్ బాబు

**శంఖవరం, జులై 10 , ( ప్రభాతవార్త ) :**

విద్యతోనే విద్యార్థి ఉజ్వల భవిష్యత్తు సాధించవచ్చని రిఫరల్ చైర్మన్ స్లెసర్ బాబు పేర్కొన్నారు. శంఖవరం మండలంలోని కత్తిపూడి శివారు సీతమ్మపేట గ్రామంలో గల రిఫరల్ స్కూల్ లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.0" ఎంతో ఆత్మీయ వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థుల సమగ్ర అభివృద్ధిపై చర్చించారు. ఈ సమావేశానికి వచ్చిన తల్లిదండ్రులు తమ పిల్లల విద్యా ప్రగతిని ఉపాధ్యాయులతో తులనాత్మకంగా సమీక్షించారు. విద్యార్థుల ఫలితాలు, గ్రేడ్లు, అభ్యాసన శైలి, వారి బలహీనతలు మరియు మెరుగుపరచాల్సిన అంశాలపై ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరంగా వివరించారు. ప్రతి సబ్జెక్టులోను విద్యార్థులు ఎదుర్కొంటున్న సవాళ్లపై మార్గదర్శకాలను అందించారు. తల్లిదండ్రులకు ముఖ్యంగా విద్యార్థులు ఇంటికి వచ్చిన తర్వాత గడపవలసిన సమయాన్ని సద్వినియోగం చేసేందుకు మార్గదర్శకాలు సూచించారు. సాంఘిక మాధ్యమాల ప్రభావం, పాఠశాల శ్రద్ధ, స్నేహితుల మధ్య అనుసంధానం, నైతిక విలువలు, ఒత్తిడి నిర్వహణ వంటి అంశాలపై చర్చలు జరిపారు. పిల్లల్లో నైతిక బోధ, సున్నితమైన భావోద్వేగాలు, చదువుపై శ్రద్ధ, భవిష్యత్ లక్ష్యాలు తదితర విషయాల్లో తల్లిదండ్రులు చూపవలసిన సహకారంపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రిఫరల్ చైర్మన్, కరస్పాండెంట్ ఎన్ స్లెస్సర్ బాబు మాట్లాడుతూ ఈ రోజు సమాజంలో విద్యార్థులు అనేక ఒత్తిడులను ఎదుర్కొంటున్నారని, మంచి మార్గదర్శకత, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమిష్టి సహకారమే వారిని విజయపథంలో నడిపించగలదని పేర్కొన్నారు. కార్పొరేట్ స్థాయి సదుపాయాలతో రిఫరల్ స్కూల్ను తీర్చిదిద్దామని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని కొనసాగించాలని కోరారు. రిఫరల్ డైరెక్టర్ రవీంద్ర. ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ ప్రసంగించారు కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులకు క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించారు. విజేతలకు బహుమతులు అందజేశారు



Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# స్త్రీల ఆత్మగౌరవాన్ని తగ్గించకూడదని..

**చిన్న పిల్లలకోసం ఓ క్లినిక్, కుక్క పిల్లలకోసం ఓ క్లినిక్.. ముక్కు, గొంతు, చెవి, కన్ను అంటూ అవయవానికో ఆసుపత్రి ఉండటం మనకు తెలిసిందే. కానీ, బిహార్‌లోని బిషన్‌పుర్ బాగ్‌నగరి సర్పంచ్ బబితా కుమారి మాత్రం వాళ్ల ఊరిలో ఓ 'టాయిలెట్ క్లినిక్' ఏర్పాటు చేశారు. అదెందుకో తెలుసుకుందాం..**



మార్పు ఒక్కరోజులో రాదు.. కానీ, ఆ ప్రయత్నాలకు మహిళలు తోడైతే సామాజికాభివృద్ధిలో విప్లవం మొదలవుతుంది. అంటారు బబిత. అందుకే స్త్రీల ఆత్మగౌరవాన్ని తగ్గనివ్వకూడదని.. పాడైన, నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను బాగు చేయడానికి నడుం బిగించారు. మరుగుదొడ్ల క్లినిక్' ఏర్పాటు చేశారు. తమ ప్రాంతంలో స్వచ్ఛభారత్ మిషన్-గ్రామీణ్ కింద నిర్మించిన 1269 మరుగుదొడ్లలో దాదాపు 190 శిథిలావస్థకు చేరాయని తెలిశాకే తాను ఈ నిర్ణయం తీసుకున్నా అంటారామె. 11 మంది కార్మికులను అందులోనూ ఆరుగురు ఆడవాళ్లను పారిశుద్ధ్య కార్మికులుగా నియమించి ఈ పనిచేస్తున్నారు. డిస్ట్రిక్ట్ వాటర్ అండ్ శానిటేషన్ కమిటీ, యేనిసెఫ్ మద్దతుతో, జీవిక లైవ్లీ హుడ్ మిషన్ వంటి సంస్థలు ఈ విషయంలో బబితకు తోడుగా నిలుస్తున్నాయి. 'స్వచ్ఛతా హీ సేవా' ప్రచారం సందర్భంగా ఇంటింటికీ వెళ్లి తోలు బొమ్మల ప్రదర్శనలు, కొవ్వొత్తుల ప్రచారంతో పారిశుద్ధ్య శుభ్రత సామాజిక వ్యవహారంగా మారింది.

**గృహహింస నుంచి బయటపడేలా..**
2021లో సర్పంచ్‌గా ఎన్నికైన బబిత అందరిలా భర్త చాటు భార్యలా కాకుండా.. స్పష్టమైన ప్రణాళికలతో మహిళ భాగస్వామ్యంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనికున్నారు. తాను ఎన్నికయ్యాక మొదటిసారి ఏర్పాటు చేసిన గ్రామసభలో మహిళలెవరూ లేకపోవడాన్ని గుర్తించారు. వారికోసమే ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రతి పనిలోనూ వారిని భాగస్వాముల్ని చేయాలనుకున్నారు. గృహహింస నుంచి డ్రైనేజీ ప్రణాళికల వరకూ అనేక నిర్ణయాల్లో మహిళల పాత్రను పెంచారు. హింస నుంచి బయటపడటానికి మహిళలకు నైతిక మద్దతు ఇస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసేలా పంచాయతీ వ్యవస్థలను అలర్ట్‌గా ఉంచుతున్నారు. ఇక, టాయిలెట్ల పునర్వినియోగంతో పాటు నీటి కొరతను కూడా తీర్చారామె. గ్రామ ప్రణాళికలో బావుల పునరుజ్జీవనాన్ని చెర్చారు. ఎండిపోయిన 27 బావుల్లో 17ని వినియోగంలోకి తెచ్చారు. చెట్ల పెంపకం ద్వారా భూగర్భ జలాలను రీఛార్జ్ చేస్తున్నారు. అంతేనా, గ్రామంలో తొమ్మిది రకాల కంపోస్ట్‌లను తయారు చేస్తూ వాటిని అమ్ముతూ ఆదాయాన్ని అందుకుంటున్నారు. ఈ కృషికే ఎన్నో అవార్డులూ, రివార్డులూ బబితను వరించాయి.

# పర్యావరణ పరిరక్షణకు కృషి

**పెళ్లిళ్లు, రాజకీయ, సామాజిక కార్యక్రమాలు ఎక్కడికెళ్లినా ఆమె సందడే. తాను స్వయంగా తయారుచేసిన తాను ఉత్పత్తులను బహుమతులుగా అందరికి అందిస్తాను కూడా. తనెవరు? ఎందుకలా వస్తోందో తెలుసుకుదాం..**



కన్యాకుమారికి దగ్గర్లోని ఎతవిలై గ్రామం ఈఎల్ ప్రతీజీన్‌ది. ఎత్తైన తాటి చెట్లు, వాటినుంచి వచ్చే చల్లని గాలి, తాటి ఆకుల్లో షర్బత్ తాగటం.నార చాపలపైనే పడుకోవటం, తాటి బెల్లం, ముంజలు తినటం.. తన బాల్యమంతా గడిచిపోయింది. ఇలానే ఇలాంటి వాతావరణంలో పెరగటం వల్లేమో, తాటి చెట్లతో ఆమెకు తెలియని అనుబంధం ఏర్పడింది. పెరిగి పెద్దయ్యాక ఆ ప్రేమ పోలేదు హిస్టరీలో పిజి, తమిళ్ లిటరేచర్‌లో డిగ్రీ, మాంటిస్సోరి ట్రైనింగ్ తీసుకున్న జీన్ టీచర్‌గా పనిచేసింది. పదేళ్లకు పైగా అనుభవం సంపాదించాక ఆ వృత్తిని విడిచిపెట్టి, 40 ఏళ్ల వయసులో జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. అదే తాటి చెట్ల సంరక్షణ. తన చిన్ననాటి రోజులు మళ్లీ రావాలనుకుంది. తాటి చెట్లు కోల్పోయిన వైభవాన్ని తిరిగి తీసుకురావాలనే తపనతో తాన్(టిఎఎన్) పామ్ ఫౌండేషన్ ప్రారంభానికి శ్రీకారం చుట్టింది.

**టీచింగ్ అనుభవంతోనే...**
ఈ ఫౌండేషన్ ద్వారానే తమిళనాడు అంతటా తిరుగుతూ తాటి మొక్కల ప్లాంటింగ్ డ్రైవ్‌లు నిర్వహిస్తోందీమె. భవిష్యత్ తరాలకూ తాటి చెట్లు, వాటి ఉత్పత్తుల వల్ల లాభాలు ఏముంటాయో తెలియజేయాలని స్కూళ్లు, కాలేజీల్లో వర్క్‌షాప్‌ఐ నిర్వహిస్తోంది. రైతులకి తాటి విత్తనాలను పంచుతూ, అవగాహన కార్యక్రమాలూ చేపడుతోంది. అంతేకాదు, తాటాకులతో బుట్టలు, టోపీలు, ఫ్యాన్‌లు, డెకరేటివ్ ఉత్పత్తులు వంటివి తయారుచేయటంలో మహిళలకు శిక్షణా ఇస్తోంది కోస్తా తీరంలో నీటి వనరులు ఉన్న చోట తాటి చెట్లు పెంచటం వల్ల అవి నేల కొట్టుకుపోకుండా కాపాడతాయి. జీవవైవిధ్యానికి సాయపడతాయి. వీటన్నింటి గురించీ ప్రజలకు తెలియజేస్తోంది. ఇవి అక్కడి వాళ్లను బాగా ఆకర్షించాయి. ఆలోచింపచేశాయి కూడా. అందుకే, అక్కడి వాళ్లంతా జీన్‌ను 'పామ్ స్టార్' అంటూ పిలుచుకుంటారు. అంతగా ప్రజల్లోకి ఈ



విషయాలు చేరువ చేయటంలో జీన్‌కు ఉన్న టీచింగ్ అనుభవం బాగా ఉపయోగ^పడిందట. చిన్నప్పటి నుంచీ తాటిచెట్ల మధ్యే పెరిగా. అవి కేవలం చెట్లు కాదు. మా జీవితంలో ఓ భాగం, జీవనరేఖ. ఆహారం, నివాసం, ఆదాయం.. ఇలా అన్నింటినీ ఇస్తాయి మరి. వాటినిసంరక్షిస్తే.. మన వారసత్వాన్ని రక్షించుకున్నట్లే. ఇది కేవలం చెట్ల సంరక్షణ గురించి చేసే ఓ పోరాటం కాదు, పర్యా వరణాన్ని కాపాడే జీవన విధానం కూడా. హోమియో వైద్యురాలైన అమ్మ లీలాబాయి వల్లే ఈ జీవన విధానం నాకు అలవాటయ్యింది. దీనిపై గౌరవం పెరిగింది. అని చెబుతోంది జీన్. తాటి చెట్ల సంరక్షణ మీద, వాటి ఉత్పత్తుల ప్రోత్సాహం కోసంఎంతగానో కృషిచేస్తున్నారు జీన్ అంటూ అక్కడి అధికారుల మెప్పునూ పొందింది జీన్. తాటిచెట్ల సంరక్షణకూ, తద్వారా సస్టైనబుల్ జీవన విధానానికీ, పర్యావరణ పరిరక్షణకూ కృషి చేస్తోన్న జీన్ ప్రయత్నం అభినందనీయమే కదా!

# తమలపాకు పండింది..



**అమ్మాయి అరచేయి..** ఎర్రగాపండి కనిపిస్తోంటే ఎంత అందమో కదా! వేడుకలప్పుడు చేతిపై ఆ అందం లేకపోతే బోసిపోయినట్లే అనిపిస్తుంది. కానీ అస్తమానం గోరింటాకేకావాలంటే చాలామందికి కష్టమే. అయితే తమలపాకు తెచ్చేసుకోండి. దానితోనూ అరచేత ఎర్రదనం పండించుకోవచ్చు. ఎలాగంటే తాజా తమలపాకులు ఓ పది తీసుకుని, కాడలు తీసేయండి. వాటికి అరస్పూను చొప్పున పసుపు, సున్నం కలిపి, మెత్తగా మిక్సీ పట్టండి. నీళ్లు కలపొద్దు, నిల్వ ఉన్న ఆకుల్నీ వాడొద్దు. తరవాత రసాన్ని వడకట్టి, బాగా ఎర్రగా ఉన్న కుంకుమ కలుపుకోవాలి.



ఆ మిశ్రమంతో చేతిపై నచ్చిన డిజైను వేసుకోండి. ఆరిన తరువాత కడిగేసి చూసుకోండి. అచ్చమైన గోరింటాకు లాగే పండుతుంది. మొత్తం ప్రక్రియకు ఎక్కువ సమయం కూడా పట్టదు. కావాలంటే ప్రయత్నించి చూడండి.

# సేమియా బొబ్బట్లు

**కావలసినవి:**
సేమియా, గోధుమపిండి కప్పు చొప్పున, పంచదార, కొబ్బరి తురుము ముపా కప్పు చొప్పున, నూనె రెండు స్పూన్లు, నెయ్యి తగినంత, ఉప్పు రుచికి సరిపడా, బాదం, జీడిపప్పు రెండు టేబుల్‌స్పూన్ల చొప్పున, యాలకుల పొడి అర చెంచా



**తయారీ:** ఒక గిన్నెలో గోధుమపిండి, తగినన్ని నీళ్లు, ఉప్పు, నూనె వేసి కలపండి. పిండి మెత్త అయ్యిందనుకున్నాక పక్కన పెట్టండి బాదం, జీడిపప్పులను గ్రైండ్ చేయండి. కడాయిలో నెయ్యి వేడయ్యాక సేమియాను వేయించి.. లేత గోధుమరంగులోకి మారాక పళ్లెంలోకి తీయండి. కడాయిలో రెండు కప్పుల నీళ్లను మరిగించి.. అందులో వేయించిన సేమియా, పంచదార వేసి దగ్గరగా అయ్యేవరకు ఉడికించండి. సెగ తగించి కొబ్బరి తురుము, బాదం, జీడిపప్పుల పొడి యాలకుల పొడి వేసి కలియబెట్టి, నిమిషం తర్వాత సెగ తీసేయండి. సేమియా మిశ్రమం చల్లారాక.. చిన్న బాల్స్ చేయండి. గోధుమ పిండితో చపాతీ చేసి.. మ సేమియా ముద్ద ఉంచి మరోసారి రోల్ చేయండి అన్నీ అయ్యాక.. నేతితో రెండువైపులా కాల్చుకోండి. అంతే టేస్టీ సేమియా బొబ్బట్లు తయారై పోతాయి. వీటి మీద కాస్త నెయ్యి రాసు తింటే మరింత రుచిగా ఉంటాయి.

# పిల్లలకు లెక్కలు సులభంగా..

కొంతమంది చిన్నారులు కొన్ని సబ్జెక్టుల్లో ముందుంటే లెక్కల్లో మాత్రం వెనకబడి ఉంటారు. మీ పిల్లల్లో



కూడా ఇదే తీరు కనిపిస్తే ఈ చిన్న చిట్కాలు పాటించండి. ఇవి ముందు వారిలో ఆ సబ్జెక్టుపై ఉంటే భయాన్ని పోగొడతాయి..

ఏ అంశాన్నైనా సరదాగా చేయిస్తే పిల్లలు సులభంగా గుర్తుంచుకుంటారు. లెక్కలను పాఠంలా కాకుండా ఒక ఆటలా నేర్పించాలి. అందుకే వారికి కార్డు గేమ్, సుడోకు, బోర్డు గేమ్‌లు, కలర్ చార్టు చూపిస్తూ చెప్పాలి. అప్పుడే వాటిపై ఆసక్తి పెరుగుతుంది. అంతేకాదు, ఆటలతో వారిలో నైపుణ్యాలు మెరుగుపడతాయి. లెక్కలపై ఆసక్తి పెరుగుతుంది నిజానికి మనం రోజూ చేసే పనుల్లోనే లెక్కలు దాగున్నాయని వారికి తెలిస్తే చాలు, ఉదాహరణగా కూరగాయలు కొనడం, తోటి పిల్లలకి ఎత్తూ, బరువులు కొలవడం నేర్పండి. వారికిచ్చే ప్యాకెట్ మనీని పిగ్గీ బ్యాంక్‌లో దాచుకుని ప్రతి నెలా ఎంత మొత్తం పెరిగిందో లెక్కేసి చెప్పమనండి. వారిలో పొదుపుపై అవగాహన కలగడమే కాదు. సులభంగా లెక్కలూ నేర్చు కుంటారు. ఏదైనా పని సాధనలోనే దాగుందనే రహస్యాన్ని చెప్పాలి, సులభమైన వర్క్‌లతో సాధన ప్రారంభించడం కష్టంగా ఉంటే పరిష్కరించేలా చూడాలి, అప్పుడే వాటిని, మరచిపోకుండా ఉంటారు చేసిన తప్పులు పునరావృతం కాకుండా ఉండేందుకు అర్థమయ్యేలా చెప్పండి. ఎంత చెప్పినా తప్పులు తెలియకుండా వాటిని వివరిస్తే తిరిగి ప్రయత్నించాలంటే ఉత్సుకత పెరుగుతుంది.

# బొమ్మలు వేయడానికి చిట్టి పెన్సిళ్లు

**అక్షరాలు రాకపోయినా పిల్లలు బొమ్మలు గీయడం, రంగులు వేయడం వంటివి ఎంచక్కా చేసేస్తారు.** ప్రీస్కూల్లోనే వీళ్లకి ఇవి పరిచయం అవుతున్నాయి. అంటే పెన్సిల్ ఎంతముఖ్యమో రంగు పెన్సిళ్లే, క్రేయాన్లూ అంతే అవసరమనేగా! మనమేమో. అరెరే ఎంత చక్కగా బొమ్మలు గీస్తున్నారో, ఎంత ముచ్చటగా రంగులద్దుతున్నారో' అని పెద్ద పెద్ద కలరింగ్ బాక్సులు కొని తెచ్చేస్తాం. వాళ్లేమో అన్నింటినీ కలగా



పులగం చేస్తారు. అంతటితో ఆగుతారా? ఎంత ఖర్చు పెట్టి కొన్నవైనా వాళ్లకి కొద్దిరోజుల్లోనే బోర్ కొట్టేస్తాయి. వాటిని విరిచేయడం, పడేయడం సరేసరి. ఇక్కడ రంగు లేకపోయినా మళ్లీ బాక్సు అంతా కొనాల్సిందే ఆ పాత వాటిని వేయడానికి మళ్లీ ఓ డబ్బా వెతకాలి. ఎందుకొచ్చిన శ్రమ ఇదంతా? పైగా డబ్బులూ వృథా వీటన్నింటికీ 'మినీ' ఉపాయం. ఏం లేదండీ.. కలర్ పెన్సిళ్లు, క్రేయాన్స్ చిట్టి సైజుల్లో దొరుకుతాయి. వాటిని తెచ్చేయండి. ఇవైతే చక్కగా డబ్బాల్లోనూ వస్తాయి. పనయ్యాక



వాళ్లే దానిలో సర్దుకుంటారు. ఖర్చు తక్కువే కాబట్టి, పోగొట్టినా, బోర్ కొట్టాయన్నా కొనడానికి మనకీ ఇబ్బంది అనిపించదు ఏమంటారు?

# మహాభారతం

**దేవతలంతా దేవేంద్రునితో** అగ్నికుమారుడు చాలా పరాక్రమవంతుడు. నీ పదవి ఆక్రమించాలనే దురుద్దేశ్యముతో ఉన్నాడు. ముందు నువ్వే పోయి అతణ్ణి సంహరించు అన్నారు. వెంటనే సప్త మాతృకల్ని అగ్నిపుత్రుణ్ణి చంపటానికి పంపాడు. వారు అగ్నిపుత్రుణి తేజస్సుకు భయపడి శరణు వేడారు. ఆ బాలుడు వారికి అభయమిచ్చి పంపేశాడు. ఇంద్రుడే స్వయంగా దండెత్తాడు. కానీ చివరకు ఆయన కూడా అగ్నిపుత్రుణ్ణి (కుమారస్వామిని) శరణువేడాడు. ఋషులు, దేవతలు, ఇంద్ర పదవిని నువ్వే చేపట్టు అని అన్నారు. దేవేంద్రుడు కూడా దేవతలు కోరినట్టు నీవే ఇంద్రపదవిని చేపట్టు. నీవే అర్హుడవు, అన్నాడు అపుడు కుమారస్వామి ఇంద్రునితో, నీవే ఇంద్ర, పదవిలో కొనసాగు, నేను నీ శ్రేయోభిలాషిగా నీకు సాయపడుతాను, నీసైన్యాధిపతిగా వ్యవహరిస్తాను అన్నాడు. దేవతలందరి సమక్షంలో కుమారస్వామికి సర్వసైన్యాధ్యక్షుడిగా పట్టం కట్టాడు ఇంద్రుడు. ఇది కథ (పుటలు 359, 360. అరణ్యపర్వము పంచమాశ్వాసము శ్రీమదాంధ్ర మహాభారతము, రామకృష్ణ మఠం) నేటి రాజకీయనాయకులకు, సంస్థల్లో, సంఘాల్లో పదవుల కొరకుపాటుబడేవారికి కావాలసినంత నీతి లభిస్తుంది. భారతములోని ఈ చిన్న కథలో. కుమారస్వామి ఒక బాలుడు పదవిపై కాంక్ష ఎందుకుంటుంది? దేవతలు వెళ్లి దేవేంద్రునితో నీ పదవిని చేపట్టాలనే దురుద్దేశము కుమార స్వామికి ఉందని చెప్పారు. అలా చెప్పేవారు నేడు అన్నిట్లోనూ ఉన్నారు. జాగ్రత్తపడాలి అది నిజమా, కాదా అని విచారించక దేవేంద్రుడు కుమారస్వామిని అంతమొందించాలని పోయి అవమానాల పాలయ్యాడు. అదే దేవతలే మళ్ళీ ఇంద్రుని ఎదుటే కుమారస్వామితో, నీవే ఇంద్రపదవి చేపట్టు అన్నారు. అచ్చం అలాగే ఉంటారు. నేడు ఎంతో మంది తప్పని పరిస్థితుల్లో, ఔను, వారు చెబుతున్నది సరైనదే, నీవే ఇంద్రపదవి చేపట్టు అన్నాడు ఇంద్రుడు కూమారస్వామితో. అప్పుడు కుమారస్వామి, పదవిలో నీవే ఉండు, నేను నీకు తోడ్పడుతాను. అన్నాడు. ఎంత బాగుంది నేడు సేవా సంస్థల్లో కూడా పదవులకు పోటీపడుతున్నారు. పదవిలో ఉండటానికి ఎవరు ముందుకు వచ్చినా వారికి పదవినిచ్చి కేవలం సేవలో ఇతరులు నిమగ్నం కావాలి.


**- రాచమడుగు శ్రీనివాసులు**

ఆధ్యాత్మికం

# ఇవి ఇతరులతో పంచుకోరాదు

**ఆపాదమస్తకం అందంగా మెరిసిపోవలని అందరికీ ఉంటుంది. అందుకోసం మేకప్‌ను కూడా ఆశ్రయిస్తూ ఉంటాం. ఈ క్రమంలో కొందరు మేకప్ ఉత్పత్తులు అందులో ఉపయోగించే బ్రష్‌లను సైతం ఇతరులతో పంచుకొంటూ ఉంటారు. మీరూ అంతేనా? అయితే జాగ్రత్త! అలా చేయడం వల్ల చర్మానికి హాని కలిగే అవకాశాలు చాలానే ఉన్నాయంటున్నారు నిపుణులు. మరి, సౌందర్య సంరక్షణలో భాగంగా ఏయే ఉత్పత్తులను ఇతరులతో పంచుకోకూడదో తెలుసుకుందామా..**


స్నేహితులు లేదా బంధువుల్లో ఎవరివైనా లిప్‌స్టిక్/లిప్‌గ్లాస్/ మేకప్ నరబష్.. ఇలా ఏది కనిపించకపోయినా వెంటనే పక్కనున్న వాళ్లు ఇదిగో.. నాది తీసుకో అంటూ అందించడం లేదంటే మనమే వాళ్లను అడగడం సర్వసాధారణమే. అయితే ఆ క్షణానికి అందంగా కనిపించడానికి అది ఉపయోగపడినా ముందు ముందు మాత్రం సౌందర్యపరంగా చాలా నష్టాలే ఎదుర్కోవాల్సి రావచ్చు. అందుకే సౌందర్య సంరక్షణలో భాగంగా కొన్ని ఉత్పత్తులను ఇతరులతో అస్సలు పంచుకోకూడదు.



**పౌడర్ రూపంలో ఉంటే...** మేకప్‌లో ఉపయోగించే ఫౌండేషన్, ఐ షాడో.. వంటివి కొన్ని పౌడర్ రూపంలో కూడా ఉంటాయి. అయితే వీటిని ఒకరి కంటే ఎక్కువమంది చేతితో తాకినా లేదా బ్రష్‌తో అప్లై చేసుకున్నా అందులో బ్యాక్టీరియా చేరే అవకాశాలు ఎక్కువ. ఫలితంగా మొటిమలు రావడం, చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లు దరిచేరడం వంటి సమస్యలు రావచ్చు. కాబట్టి పౌడర్ రూపంలో ఉన్న ఉత్పత్తులను ఇతరులతో అస్సలు పంచుకోకూడదు.




**లిప్‌స్టిక్/లిప్‌గ్లాస్:..** చాలామంది రంగు బాగుందనో లేక మంచి లుక్ ఇస్తుందనో ఇతరుల లిప్‌స్టిక్/ లిప్‌గ్లాస్ ఉపయోగిస్తూ ఉంటారు. అయితే ఇతరులవి మనం ఉపయోగించడం వల్ల వాటిపై ఉన్న బ్యాక్టీరియా మన అధరాల పైకి చేరే అవకాశాలు లేకపోలేవు. అలాగే మన అధరాలపై ఉన్న తేమలో ఉండే బ్యాక్టీరియా కూడా వాటికి తోడై పెదాలకు హాని కలిగించవచ్చు. కాబట్టి ఇవి కూడా ఎవరివి వారూ ఉపయోగించుకోవడం శ్రేయస్కరం.



**కళ్ల సంబంధిత ఉత్పత్తులు.....** ఐ షాడో, మస్కారా, ఐ లైనర్.. వంటి ఐ మేకప్ ఉత్పత్తులను చాలా జాగ్రత్తగా ఉపయోగించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఇతరుల ఐ మేకప్ ఉత్పత్తులు ఉపయోగించేటప్పుడు వారికి ఏమైనా కళ్ల సంబంధిత ఇన్ఫెక్షన్లు ఉంటే అవి మనకు కూడా వచ్చే అవకాశాలు లేకపోలేవు. అలాగే ఆ ఉత్పత్తుల్లోని బ్యాక్టీరియా వల్ల కళ్లు ఎర్రబడడం, నీళ్లు కారడం, మండడం.. వంటి సమస్యలు కూడా తలెత్తుతాయి.

**మూతలు ఉండేవి..** కొన్ని రకాల క్రీమ్‌లు, పౌడర్లు మూతలు ఉండే చిన్న చిన్న సీసాల్లో లభ్యమవుతుంటాయి. వీటిని కూడా ఇతరులతో పంచుకోకూడదు. అలా షేర్ చేసుకోవడం వల్ల వారు ఉపయోగించినప్పుడు వారి చేతుల్లో ఉండే హానికారక బ్యాక్టీరియా ఈ ఉత్పత్తుల్లోకి చేరుతుంది. అవి మనం వాడడం వల్ల మన చర్మానికి కూడా నష్టం వాటిల్లుతుంది.

**మేకప్ బ్రష్‌లు...** మేకప్ వేసుకోవడానికి ఉపయోగించే బ్రష్‌లను కూడా ఇతరులతో పంచుకోకూడదు. ఇతరులు వాటిని ఉపయోగించినప్పుడు వారి చర్మం మీద ఉండే బ్యాక్టీరియా, క్రిములు వంటివి మేకప్ ఉత్పత్తుల్లోకే కాదు. వాటిని తిరిగి మనం ఉపయోగించినప్పుడు మన చర్మం మీదకు కూడా చేరతాయి. కాబట్టి మేకప్ వేసుకోవడానికి ఉపయోగించే బ్రష్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడంతో పాటు ఇతరులతో పంచుకోకుండా ఉండడం మంచిది.



ఇవి కూడా.. లిక్విడ్ ఫౌండేషన్, లిక్విడ్ ఐ లైనర్, క్రీమ్ రూపంలో ఉండే ఉత్పత్తులు, నెయిల్‌పాలిష్, హెయిర్ బ్రష్‌లు, క్లెన్సింగ్‌కి ఉపయోగించే స్పాంజ్‌లు మేకప్ వేసుకోవడానికి వాడే పఫ్‌లు, ఐ లాష్ కర్లర్, ట్వీజర్స్, ప్లక్కర్స్, లిప్‌బామ్, స్నానానికి ఉపయోగించే ఉత్పత్తులు, సాధనాలు.. మొదలైనవన్నీ ఇతరులతో పంచుకోకుండా ఉండడం మంచిది.

# డైటింగులు అవసరం లేదు

**అందానికి ప్రాధాన్యం** ఇచ్చేవారిలో అమ్మాయిలే ముందుంటారు కదా! దానికోసం చేయని డైటింగులు, శారీరక వ్యాయామాలుండవు. అంతేకాదు, వారు బరువు పెరగకుండా ఉండేందుకు ఆహారాన్ని చాలవరకు పరిమితం చేసుకుంటారు. ఎంత బరువు తగ్గినా ఇంకా పెరిగిపోతున్నామనే భయం వీరిని వెంటాడుతుందట. దీనివల్ల తరవాత వారికి తినాలని ఆసక్తి కొద్దీ తిన్నా పొట్ట కుంచించుకుపోయి, ఆహారం కాస్త ఎక్కువైనా వాంతులు అవుతుంటాయి. నెమ్మదిగా ఇదే వ్యాధిలా కూడా మారుతుంది. దీనినే



అనోరెక్సియా అంటారు. ఈ లక్షణం ఉన్నవారు ఎంత బరువు తగ్గినా ఇంకా పెరిగిపోతున్నామనే భయం వీరిని వెంటాడుతుందట. అయితే ఈ లక్షణాలు, టీనేజీ అమ్మాయిల్లోనూ, ముప్పైల్లోపు స్త్రీలలోనూ ఎక్కువగా కనిపిస్తుంది. దీనివల్ల పోషకాహారలోపానికి గురవ్వడమే కాకుండా, మెదడు, గుండె, మూత్రపిండాలతో సహా శరీరంలో ప్రతి అవయవం దెబ్బతినే ప్రమాదం ఉందట. దీనిని అదుపు చేయాలంటే మాత్రం వైద్యుల్ని సంప్రదించి ఆహార నియమాల్లో మార్పులు తప్పనిసరి అంటున్నారు నిపుణులు. కాబట్టి అమ్మాయిలు ముందు మనం ఆరోగ్యంగా ఉంటేనే ఎన్ని జాగ్రత్తలు అయినా పాటించవచ్చు.

# తెర

## లంబకోణాలు నేర్పిన చోటే..
# కుంభకోణాలు

స్నేహ చిత్ర పిక్చర్స్ బ్యానర్‌లో ఆర్ నారాయణ మూర్తి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం యూనివర్సిటీ (పేపర్ లీక్). ఈ చిత్రం ఆగస్టు 22 న ప్రేక్షకుల ముందుకు వస్తున్న సందర్భంగా ప్రసాద్ ల్యాబ్ లో మీడియా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ నారాయణ మూర్తి, గోరేటి వెంకన్న, అద్దంకి దయాకర్, దేశపతి శ్రీనివాస్, అందేశ్రీ, జయరాజ్, నందిని సిద్దారెడ్డి, ప్రొఫెసర్ ఖాసీంతో పాటు పలువురు విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు. వక్తలు ప్రసంగిస్తూ .. యూనివర్సిటీ పేపర్ లీక్ సినిమా కేవలం విద్యార్థులే కాదు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందరూ చూడదగిన మంచి చిత్రం అని కొనియాడారు. ఆర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ ఈ సినిమాలో 5 పాటలు ఉన్నాయి. కీర్తిశేషులు స్వర్గీయ గద్దర్ గారు, జలదంకి సుధాకర్, వేల్పుల నారాయణ, మోటపలుకుల రమేష్ గొప్పగా రాశారు. ఈ చిత్రం కథాశం ఏమిటంటే..గత కొన్నేళ్లుగా మన విద్యారంగంలో జరుగుతున్న పేపరు లీక్‌లు..గ్రూపు 12 లాంటి ఉద్యోగ ప్రశ్న పత్రాల లీకులు చూస్తుంటే ఈ చదువులకేమైంది అని పిస్తుంది. ఇలా జరుగుతూ వుంటే విద్యార్థుల భవిష్యత్ ఏం కావాలి ? నిరుద్యోగుల జీవితాలు ఏమైపోవాలి ? లంబకోణాలు నేర్పిన వాళ్ళే కుంభకోణాలు జేస్తూ ఉంటుంటే రెక్కలు తెగిన జ్ఞాన పావురాలు విలవిల కొట్టుకుంటూ ఊపిరాడక నెల రాలుతుంటే కన్న తల్లితండ్రులు ఏమై పోవాలి. వాళ్లకు పాఠాలు బోధించిన గురువులు ఏమి కావాలి. రెండవ ప్రపంచ యుద్ధంలో అమెరికా నాగాసాకి హీరోషిమాల మీద వేసిన ఆటంబాంబులు కంటే హైడ్రోజెన్ బాంబులు కంటే టొర్నాడోటార్పిడో ల కంటే సునామీల కంటే చాలా ప్రమాదకరమైనది కాపీయింగ్. చూసి రాసిన వాళ్ళు డాక్టర్లు అయితే పేషెంట్ బ్రతుకుతాడా?? అలాంటి వాళ్లు ఇంజినీర్ అయితే బ్రిడ్జిలు నిలబడుతయా? పేషెంట్లు బ్రతకాలి అన్న బ్రిడ్జిలు కూలిపోకుండా ఉండాలి అన్న, ప్రశ్న పత్రాలు లీకులు మాయం కాకూడదు. అందుకే విద్యను ప్రవేటు మాఫియా కబంధ హస్తాల నుంచి విముక్తి చేసి విద్యను జాతీయం చేయాలి. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి. అని చాటి చెప్పేదే ఈ యూనివర్సిటీ పేపర్ లీక్ చిత్రం. ఆగస్టు 22 న ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నాము అని అన్నారు.





# సూర్యుడికే కన్ను గప్పి..

పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా జ్యోతి కృష్ణ తెరకెక్కించిన చిత్రం హరిహర వీరమల్లు. ఏ.ఎం.రత్నం నిర్మించారు. నిధి అగర్వాల్ కథానాయిక. ఈ నెల 24న చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది. బాబీ డియోల్ ప్రతినాయకుడి పాత్రను పోషించారు. పవన్ తొలిసారి చారిత్రక యోధుడి పాత్రను పోషించడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలు ఆకట్టుకున్నాయి. తాజాగా, ఈ సినిమా నుంచి ఎవరది ఎవరది.. అతగాడో పొడుపు కథ.. దొరకనే దొరకడే అతగాడో మెరుపుకథ.. సూర్యుడికే కన్నుగప్పి సంచరించే యోధుడు.. చంద్రుడ్నే సంచికెత్తి తస్కరించె ధీరుడు అంటూ సాగే పాటను విడుదల చేసింది చిత్రబృందం.

# రాజా సాబ్‌తో చిందు ?


ప్రభాస్ నటిస్తున్న ది రాజా సాబ్ సినిమాలో తమన్నా ఐటెమ్ సాంగ్ చేస్తుందన్న వార్తలు సినీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి.

మిల్కీ బ్యూటీ ఇటీవల ఐటెమ్ సాంగ్‌తో సందడి చేస్తోంది. తాజాగా ఈ చిత్రంలో తమన్ కంపోజ్ చేసిన బీట్స్ పై ప్రభాస్‌తో కలిసి డాన్స్ చేస్తుందట. గతంలో వీరిద్దరు రెబల్ సినిమాలో జంటగా కనిపించారు. ఇప్పుడు మళ్లీ ఈ కాంబో ఐటెమ్ సాంగ్‌లో రీయూనియన్ కానుందన్న టాక్‌తో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. డిసెంబర్ 5న విడుదలయ్యే ఈ హారర్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లో ఐటెమ్ సాంగ్ మినహా షూటింగ్ పూర్తయిందని సమాచారం. సినిమా అంటే ప్రేక్షకులకు ఎమోషన్. మూడ్ బాగున్నా, బాగోలేకపోయినా, అకేషన్ ఉన్నా, సెలబ్రేషన్ ఉన్నా సినిమా చూస్తేనే అదొక కిక్కు. సినిమాల్లో కథ, స్క్రీన్‌ప్లే ఎంత బాగున్నా సాంగ్స్ కూడా రిజల్ట్‌ని డిసైడ్ చేస్తుంటాయి. మూవీలో హీరో హీరోయిన్ల మధ్య ఎన్ని సాంగ్స్ ఉన్నా ఐటెమ్ సాంగ్స్ కూడా పెడుతుంటారు మేకర్స్. ఇందులో అందంతో పాటు డ్యాన్స్ బాగా చేసే నటీమణులను తీసుకుంటుంటారు. గతంలో తెలుగు సినిమాల్లో ఎన్టీఆర్, ఏఎన్నార్ తరంలో ఐటెమ్ సాంగ్స్ చేసేందుకు జ్యోతిలక్ష్మి, జయమాలిని, అనురాధ, సిల్క్‌స్మిత, ఆ తర్వాత అభినయశ్రీ, ఆల్ఫాన్సా లాంటి తారలు ప్రత్యేకంగా ఉండేవారు.




## పత్తి మంటల్లో
# దిగాలుగా

నేషనల్ అవార్డ్ విన్నింగ్ యాక్టర్ ధనుష్ తన లేటెస్ట్ బ్లాక్‌బస్టర్ కుబేర తర్వాత ఇదే జోరులో 54వ చిత్రం అధికారికంగా అనౌన్స్ చేశారు. విమర్శకుల ప్రశంసలు పొందిన థ్రిల్లర్ పోర్ తోజిల్ ఫేం విఘ్నేష్ రాజా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ఈరోజు ప్రారంభమైంది. రెగ్యులర్ షూటింగ్ కూడా ప్రారంభమైంది. అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో ధనుష్ పవర్ ఫుల్ లుక్‌లో, అగ్ని దగ్గర నిలబడటం సినిమా సీరియస్ టోన్‌ని సూచిస్తుంది. ఇందులో ధనుష్ నిలబడి దిగాలుగా కనిపిస్తుండగా తన పత్తి పంట కాలిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. దీనితో ఈ సినిమాలో ధనుష్ ఒక రైతుగా కనిపిస్తాడని అనిపిస్తుంది. మొత్తానికి మాత్రం ధనుష్ మరో సాలిడ్ రూరల్ ఎమోషనల్ డ్రామాతో రాబోతున్నాడని చెప్పవచ్చు. ఇక ఈ చిత్రానికి జీవి ప్రకాష్ సంగీతం అందిస్తుండగా వేల్స్ ఫిల్మ్స్ ఎంటర్టైన్మెంట్స్ అలాగే థింక్ స్టూడియోస్ వారు నిర్మాణం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ మొదలు పెట్టుకుంది.



# ఈసారి గూఢచారి?

అక్కినేని నాగచైతన్య రీసెంట్‌గా తండేల్ చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్నాడు. ఈ సినిమా ఇచ్చిన బూస్ట్‌తో ఆయన ఇప్పుడు తన నెక్స్ట్ చిత్రాన్ని విరూపాక్ష ఫేం దర్శకుడు కార్తీక్ దండుతో చేస్తున్నాడు.

ఈ సినిమా మిస్టిక్ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే, ఇప్పుడు చైతూ ఈ సినిమా షూటింగ్ దశలో ఉండగానే మరో ప్రాజెక్ట్‌ని ఓకే చేసే పనిలో ఉన్నాడు. తమిళ దర్శకుడు పిఎస్. మిత్రన్ డైరెక్షన్‌లో చైతూ ఓ సినిమా చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమాలో నాగ చైతన్య ఓ స్పై పాత్రలో నటిస్తాడనే టాక్ సినీ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. మిత్రన్ ఇప్పటికే అభిమన్యుడు, సర్దార్ వంటి సినిమాలతో మంచి ఫేం తెచ్చుకున్నారు. ఇక ఇప్పుడు మరోసారి యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రంతో నాగచైతన్యను స్పై గా మనకు చూపెట్టేందుకు ఆయన రెడీ అవుతున్నారు. మరి ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఎప్పుడు వస్తుందో చూడాలి.




# మార్షల్ షూటింగ్ షురూ

సత్యం సుందరంతో అలరించిన హీరో కార్తీ ఇప్పుడు విమర్శకుల ప్రశంసలు పొందిన తానక్కారన్ ఫేం డైరెక్టర్ తమిజ్ తో కలిసి తన 29వ చిత్రం కోసం చేతులు కలిపారు. ఈ ప్రాజెక్టును డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్ఆర్ ప్రకాష్ బాబు,ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తారు. ఇషాన్ సక్సేనా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కార్తీని ఇంటెన్స్‌గా ప్రెజెంట్ చేసిన అద్భుతమైన పోస్టర్‌తో మేకర్స్ మార్షల్ అనే టైటిల్‌ను రిలీజ్ చేశారు. గురూరం శుభ పూజా కార్యక్రమంతో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. ఈ భారీ బడ్జెట్ చిత్రంలో కళ్యాణి ప్రియదర్శన్ కథానాయికగా నటిస్తోంది. సత్యరాజ్, ప్రభు, లాల్, జాన్ కొక్కెన్, ఈశ్వరి రావు, మురళీ శర్మ ఇందులో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మార్షల్‌ను అత్యున్నత స్థాయి సాంకేతిక, నిర్మాణ విలువలతో భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. ప్రఖ్యాత సినిమాటోగ్రాఫర్ సత్యన్ సూర్యన్ కెమెరామెన్‌గా వ్యవహరిస్తుండగా, సంగీత సంచలనం సాయి అభ్యాంకర్ సంగీతం అందిస్తున్నారు. ఫిలోమిన్ రాజ్ ఎడిటర్‌గా, అరుణ్ వెంజరమూడు ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. ఎక్సయిటింగ్ టైటిల్ రివీల్‌తో మార్షల్ కార్తీ ఫిల్మోగ్రఫీకి మెమరబుల్ మూవీగా ఉంటుందని హామీ ఇచ్చారు.



# గ్రామీణ ప్రేమకథగా ఉసురే

యదార్థ సంఘటనలతో, సమాజంలో జరిగిన వాస్తవ కథను తెరపై ఆసక్తికరంగా చూపిస్తే ఆ చిత్రాలు తప్పకుండా ప్రేక్షకాదరణ పొందుతాయి. ఇప్పుడు ఈ కోవలోనే యదార్థ సంఘటనలతో రూపొందిన ఓ వైవిధ్యమైన గ్రామీణ ప్రేమకథగా ఉసురే ఆగస్టు 1న థియేటర్స్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. టీజయ్ అరుణాసలం, జననీ కునశీలన్ హీరో, హీరోయిన్స్‌గా రూపొందుతోన్న ఈ చిత్రానికి నవీన్ డి.గోపాల్ దర్శకుడు. శ్రీకృష్ణ ప్రొడక్షన్స్ సమర్పణలో బకియా లక్ష్మీ మ టాకీస్ పతాకంపై మోళి ఎం రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాణానంతర పనులు తుదిదశకు చేరుకున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 1న విడుదల చేస్తున్నారు మేకర్స్. సీనియర్ హీరోయిన్ రాశి ఈ చిత్రంలో ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. దర్శకుడు చిత్ర విశేషాలను తెలియజేస్తూ ఇదొక వైవిధ్యమైన ప్రేమకథ. ఎంతో రియలిస్టిక్ అప్రోచ్‌తో ఈ ప్రేమకథ అందరి హృదయాలకు హత్తుకుంటుంది. సమాజంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించాం. రొమాన్స్, కామెడి, డ్రామా గా రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రతి అంశం ఎంతో ఆస్తకికరంగా, ఉత్కంఠగా ఉంటుంది.



# ఏ ఊరికి వెళతావే పిల్లా..

యాక్షన్ కింగ్ అర్జున్ తొలిసారి తెలుగులో దర్శకత్వం వహిస్తూ కూతురు ఐశ్వర్యను హీరోయిన్‌గా టాలీవుడ్‌కు పరిచయం చేస్తున్న చిత్రం సీతా పయనం. అర్జున్ స్వయంగా నిర్మిస్తూ, కథ, స్క్రీన్ ప్లే అందించిన ఈ సినిమాతో కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర సోదరుడి కుమారుడు నిరంజన్ హీరోగా ఎంట్రీ ఇస్తున్నాడు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించాడు. అర్జున్, ప్రకాశ్ రాజ్, ధృవ్ సర్జా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే.. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదల చేసిన టీజర్ సినిమాపై మంచి హైప్ తీసుకు రాగా తాజాగా ఈ ఏ ఊరికి వెళతావే పిల్లా అంటూ సాగే మెలోడీ పాటను విడుదల చేశారు. అస్కార్ విన్నర్ చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను రాహుల్ సిప్లీగంజ్, మధు ప్రియ పాడారు. ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాలలోని ప్రముఖ ప్రాంతాల పేర్లను వాడుతూ సాగిన పాట వినడానికి చూడడానికి వినడానికి వినసొంపుగా కనులకింపుగా ఉండి అద్యంతం అకట్టుకునేలా ఉంది. శ్రేష్టి వర్మ అందించిన డ్యాన్స్ కూడా అదిరిపోయేలా ఉంది.


# విశాఖలో అల్లు భారీ మల్టీప్లెక్స్

అల్లు అర్జున్ మల్టీప్లెక్స్ ప్రస్తుతం వైజాగ్ ఆడియెన్స్ కోసం రాబోతోంది. ఏసియన్ సునీల్ నారంగ్‌తో కలిసి టాలీవుడ్ హీరోలంతా థియేటర్ బిజినెస్‌లో దిగుతున్న సంగతి తెలిసిందే. మహేష్ బాబుతో ఏఎంబీ, బన్నీతో ఎఎఎ, రవితేజతో ఏఆర్‌టీ మల్టీప్లెక్సుల్ని సునీల్ నారంగ్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. విజయ్ దేవరకొండతో ఏవీడీ అనే మల్టీప్లెక్స్‌ని కూడా ప్రారంభించారు. అయితే ఇప్పుడు వైజాగ్ సిటీలో ఎఎఎ మల్టీప్లెక్స్ రాబోతోంది. త్వరలోనే ఈ మల్టీప్లెక్సుని ప్రారంభించబోతోన్నారు.

వైజాగ్‌లోని ఎఎఎలో 8 స్క్రీన్లు ఉంటాయని తెలుస్తోంది. అత్యంత అధునాతన సాంకేతికత, సౌకర్యాలతో ఈ మల్టీ ప్లెక్సుని నిర్మించినట్టుగా సమాచారం. ఇక ఈ మల్టీప్లెక్‌ని వార్ 2, కూలీ చిత్రాలతోనే ఓపెన్ చేసేలా ఉన్నారు. ఒక వేళ వైజాగ్‌లో కూడా అమీర్ పేట్‌లోని ఎఎఎ క్లిక్ అయినట్టుగా అయితే ఇతర నగరాల్లోనే మరిన్ని మల్టీప్లెక్సులు ఓపెన్ చేస్తారేమో చూడాలి.

## దీపావళికి 'రీర్యాంప్'

యంగ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'రీర్యాంప్. కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న 11వ చిత్రమిది. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. జెట్ స్పీడ్‌తో షూటింగ్ జరుపుకుంటున్న 'రీర్యాంప్ సినిమా తాజాగా కేరళ షెడ్యూల్ కంప్లీట్ చేసుకుంది. ఇక్కడి బ్యూటిఫుల్ లొకేషన్స్‌లో చిత్రీకరించిన సీన్స్ మూవీలో ఐ ఫీస్ట్‌గా ఉండబోతున్నాయి. ఇటీవల ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన హీరో కిరణ్ అబ్బవరం ఫస్ట్ లుక్ పోస్టర్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం చిత్రీకరణ తుది దశకు చేరుకున్న 'రీర్యాంప్ మూవీ దీపావళికి గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.



## కొత్తపల్లిలో ఒకప్పుడు ఏం జరిగింది?

కేరాఫ్ కంచరపాలెం చిత్రంతో విమర్శకుల ప్రశంసలతోపాటు చక్కని విజయం అందుకున్నారు నిర్మాత ప్రవీణ పరుచూరి. తదుపరి ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఇప్పుడామె కొత్తపల్లిలో ఒకప్పుడు అనే సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రవీంద్ర విజయ్ ప్రధాన పాత్రలో నటించారు. రానా నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమా జులై 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ట్రైలర్‌ను

# ప్రహ్లాదుడిని రక్షించడానికి మహావతార్

హోంబాలే ఫిల్మ్స్ సమర్పణలో క్లీమ్ ప్రొడక్షన్స్ మహావతార్ నరసింహ విజువల్ వండర్, శక్తివంతమైన కథనంతో ఒక ప్రత్యేకమైన సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వబోతోంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మహావతార్ నరసింహ ట్రైలర్ రిలీజ్ అయ్యింది. ట్రైలర్ అత్యద్భుతంగా వుంది. హిరణ్యకశిపుడు బ్రహ్మ దేవుడి వరం కోసం ఘోర తపస్సు చేసే సీక్వెన్స్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం కట్టిపడేసింది. విష్ణువుపై భక్తితో ప్రహ్లాదుడు, తన



నాస్తిక తండ్రి హిరణ్యకశిపుడి నుండి వ్యతిరేకతను ఎదుర్కొంటాడు. ప్రహ్లాదుడిని రక్షించడానికి దిగివచ్చిన విష్ణువు అవతారమైన మహావతార్ నరసింహుడి రాకతో ట్రైలర్ గూస్ బంప్స్ తెప్పించింది.

ఎపిక్ విజువల్స్, అద్భుతమైన నేపథ్య సంగీతంతో ఈ ట్రైలర్ విజువల్ వండర్ లా వుంది. సినిమా నెక్స్ట్ లెవల్ కి చేరుకుంది. భారతీయ చరిత్ర నుండి ఈ ఐకానిక్ కథను ఇంత అద్భుతంగా చూపడం ఇంతకు చూడలేదు.



## భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి కొండా సురేఖ

**హన్మకొండ బ్యూరో, జులై 10, ప్రభాతవార్త:** భద్రకాళి శాకాంబరీ నవరాత్రి మహోత్సవాల సందర్భంగా అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం వరంగల్ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో మంత్రి కొండా సురేఖకు ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి కొండా సురేఖ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని మంత్రి కొండా సురేఖ కోరు కున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో మరింత ముందుకుపోవాలని మంత్రి కొండా సురేఖ ప్రార్థించారు. అమ్మవారి ఆశీస్సులు వరంగల్ ప్రజలకు ఎలావేళలా ఉండాలి అమ్మవారిని వేడుకున్నారు.

## రాష్ట్రంలో ఇబిసి కమిషన్ ఏర్పాటు చేయాలి

### మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన ఇబిసి జాతీయ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** ఇబిసి జాతీయ అధ్యక్షుడు, అగ్రకులాల నిరుపేదల సంఘాల జేఏసీ చైర్మన్ వల్లపురెడ్డి రవీందర్‌రెడ్డి గురువారం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి రాష్ట్రంలో ఇబిసి కమిషన్ ఏర్పాటు చేయాలని, ఇబిసిల అభివృద్ధికి మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని, వారి సంక్షేమం కోసం ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బిసిల సంక్షేమానికి చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అన్నిటినీ అగ్రవర్ణాలలోని నిరుపేదలకు వర్తింపజేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. మహేష్ కుమార్‌గౌడ్ సానుకూలంగా స్పందించారని రవీందర్‌రెడ్డి తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎంపిలకు అవకాశం కల్పించాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి ఎంపి రఘునందన్‌రావు లేఖ

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** ఎమ్మెల్యే మాదిరిగా ప్రజల చేత ఎన్నుకోబిన ఎంపిలు సైతం ప్రజా ప్రతినిధులేనని, ప్రభుత్వం పేదలకు అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎంపిలకు అవకాశం కల్పించాలని మెదక్ ఎంపి రఘునందన్ రావు అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికలో ఎంపిలకు అవకాశం కల్పించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపికలో ఎంపిలకు 40 శాతం కోటా ఇవ్వాలని కోరారు. పార్టీలకు అతీతంగా మొత్తం 17 మంది ఎంపిలకు ఈ అవకాశం కల్పించాలని, లబ్దిదారుల ఎంపికలో సహేతుకత పెరగడానికి దోహదం చేస్తుందని తన అభిప్రాయాన్ని సిఎంకు రాసిన లేఖలో వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నిధులు కూడా అనుసంధానించడం శుభపరిణామమని, పేద ప్రజలకు మరింత న్యాయం జరగడం కోసం ఈ నిర్ణయం తీసుకోవాలని కోరారు. గతంలో తమకు కూడా ఎంపిగా పనిచేశారని రఘునందన్ రావు లేఖలో గుర్తు చేశారు. తన అభ్యర్థన మేరకు వెంటన నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నానని లేఖలో పేర్కొన్నారు.

## సంస్థాగత నిర్మాణంలో కార్యకర్తల పనితీరే గీటురాయి

### పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** హైదరాబాద్ జిల్లా పార్టీ సంస్థాగత నిర్మాణంలో కార్యకర్తల పనితీరుకు గీటురాయిగా పదవుల పంపకం ఉంటుందని టిపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. గురువారం గాంధీభవన్‌లో ఉమ్మడి హైదరాబాద్ జిల్లా సమావేశం జగ్గారెడ్డి నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా పార్టీ కమిటి ల పై చర్చించారు.15 నియోజకవర్గాలు, 2 పార్లమెంట్‌లో .ఎమ్మెల్యే, ఎంపీ గా పోటీ చేసిన, డిసిసి అధ్యక్షులు, సీనియర్, ముఖ్య నాయకుల అభిప్రాయం తీసుకున్నామని తెలిపారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో బిసి, ఎస్సి, ఎస్టీ, మైనారిటీ,మహిళ అన్ని కులాల వారికి ప్రాధాన్యత ఇస్తామని జగ్గారెడ్డి అన్నారు. మూడు జిల్లాలకి సంబందించిన పరిశీలకులు, పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జిలతో సమావేశం ఉంటుం దని అన్నారు. మొదటి నుండి పార్టీ లో ఉన్న వారికీ ఫస్ట్ ప్రియారిటీ కింద పదవులు లభిస్తాయని చెప్పారు పార్టీ మారి వచ్చిన వారికీ సెకండ్ ప్రియారిటీ ఉంటుందని అన్నారు.

## బిసి గురుకుల పాఠశాలల సీట్లుపెంచాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి ఎంపి ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** బిసి గురుకుల పాఠశాల సీట్లకు పెద్ద ఎత్తున డిమాండ్ ఉందని, వేల సంఖ్యలో విద్యార్థులుంటే వందల సంఖ్యలో సీట్లు ఉండటంతో సీట్లు దొరకక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, సీట్లు, తరగతులు పెంచాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. 'బీసీ గురుకుల పాఠశాలల పిల్లలకు సీట్లు కావాలని వందల సంఖ్యలో ప్రతిరోజు తల్లిదండ్రులు పిల్లలను వెంటబెట్టుకొని హైదరాబాద్‌లోని సంక్షేమభవన్‌కు తిరుగుతున్నారు. ఆదిలాబాద్, మంచిర్యాల, గద్వాల, కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, ఖమ్మం, గద్వాల్, వరంగల్, కరీంనగర్ తదితర అనేక ప్రాంతాల నుండి వందల కిలోమీటర్ల దూరం నుంచి, తమ పిల్లల భవిష్యత్తు కోసం, అష్టకష్టాలు పడుతూ, ఆఫీసుల చుట్టూ అధికారులకు వేడుకుంటున్నారని, చివరకు గురు కులాల్లో సీట్లు దొరకక నిరాశతో వెనుతిరిగి పోతున్నారు. ప్రస్తుతం కొన సాగుతున్న బీసీ గురుకులాలకు 10 శాతం చొప్పున సీట్లు పెంచాల'ని ఆర్. కృష్ణయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుభవార్త

### మహిళా సంఘాలకు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల రుణం

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టింది. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇల్లు కట్టుకోలేని లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణాలు అందిస్తున్నారు. యాదాద్రి జిల్లాలో మొదటి విడతగా 9,175 ఇళ్లను మంజూరు చేయగా, ఇప్పటివరకు 393 మందికి రూ.4.34 కోట్ల రుణాలు అందజేశారు. త్వరలో మున్సిపాలిటీల్లోని లబ్ధిదారులకు కూడా రుణాలు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే పలు విడతల్లో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేసింది. శరవేగంగా ఇంటి నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం కీలక నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా లబ్ధిదారులకు రుణాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇల్లు కట్టుకోలేకపోతున్న లబ్ధిదారులకు ప్రభుత్వ నిర్ణయం వల్ల ఊరట లభిస్తోంది. యాదాద్రి జిల్లాలో మొదటి విడతగా 9,175 ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. లబ్ధిదారులకు రుణాలు ఇప్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.యాదాద్రి జిల్లాలో మొదటి విడతగా 9,175 ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇల్లు మంజూరైన సమయంలోనే పేదలకు రుణాలు ఇప్పిస్తామని ప్రభుత్వం తెలిపింది. జిల్లాలో 5,980 ఇండ్లకు పునాది వేశారు.చాలామంది డబ్బులు లేక ఇల్లుకట్టడం మొదలు పెట్టలేదు.దీంతో లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇప్పించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇల్లు మంజూరైన లబ్ధిదారులు మహిళా సంఘాల్లో సభ్యులైఉంటే రుణం తీసుకోవడానికి అర్హులు.సంఘాల లీడర్లతో అధికారులు మాట్లాడి రుణాలు ఇచ్చేలా చూస్తున్నారు.మూడు రకాలుగా రుణాలు తీసుకునే అవకాశం ఉంది. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి, సంఘం అంతర్గత పొదుపు ద్వారా రుణం ఇస్తారు.డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(డీఆర్‌డీఏ) ఇందుకు సంబంధించిన బాధ్యతలు చూసుకుంటుంది.సభ్యుల అర్హతను బట్టి రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు రుణం ఇస్తారు. సంఘంలో తీసుకున్న రుణాన్ని 10 వాయిదాల్లో కట్టవచ్చు.గతంలో రుణం తీసుకుంటే, ప్రభుత్వం నాలుగు విడతలుగా ఇచ్చే డబ్బులోంచి ఆ రుణం చెల్లించాల్సి ఉంటుంది.జిల్లాలో మొత్తం 2 వేల మందికి మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇప్పించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు 393 మందికి రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు రుణాలు ఇచ్చారు.మొత్తం రూ. 4.34 కోట్లు రుణంగా అందించారు.ఇప్పటివరకు గ్రామీణప్రాంతాల లబ్ధిదారులకే రుణాలు ఇచ్చారు.ఇప్పుడు మున్సిపాలిటీల్లోని లబ్ధిదారులకు కూడా రుణాలు ఇప్పించడానికి సిద్ధమవుతున్నారు. సంఘాల్లో సభ్యులుగా ఉన్నవారికి రుణాలు ఇప్పిస్తారు.

ఇల్లు మంజూరైన లబ్ధిదారుల్లో నిర్మాణం ప్రారంభించడానికి డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో వారికి మహిళా సంఘాలు, బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి ద్వారా రుణాలు అందించే విధంగా చర్యలు తీసుకున్నామని, 2 వేల మందికి ఇప్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం అని అధికారులు తెలిపారు.

## సిఎంఎ ఫౌండేషన్ పరీక్షలో ఎస్‌సి గురుకుల విద్యార్థుల సత్తా

### సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ (సిఎంఎ ఫౌండేషన్) పరీక్షలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. ఇంటర్మీడియట్‌లో ఎంఈసీ, సీఈసీ కోర్సు చదువుతూనే ఈ పరీక్షలో విశేష ప్రతిభ చాటారని ఎస్‌సి గురుకుల సొసైటీ కార్యదర్శి డాక్టర్ విఎస్ అలగు వర్షిణి తెలిపారు. సిఎంఎ ఫౌండేషన్ పరీక్షను ప్రతి ఏడాది నవంబర్, జూన్ మాసంలో నిర్వహిస్తారు. ఈ ఏడాది జూన్ మాసంలో నిర్వహించిన సిఎంఎ ఫౌండేషన్ పరీక్షలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థకు చెందిన విద్యార్థులు 74 మంది పరీక్షకి హాజరు కాగా వారిలో 39 మంది అర్హత సాధించినట్టు సొసైటీ సెక్రటరీ తెలిపారు. వారిలో ఇబ్రహీంపట్నం బ్రాంచ్‌లో 23మంది విద్యార్థులు పరీక్ష రాయగా 14 మంది, మేడ్చెల్ బ్రాంచ్‌లో 23మంది పరీక్ష రాయగా అందులో ఏడుగురు, గౌలిదొడ్డి బ్రాంచ్‌లో 28మంది విద్యార్థులు పరీక్ష రాస్తే.. అందులో 18 మంది అర్హత సాధించారు. సిఎంఎ ఫౌండేషన్ పరీక్షలో 4 పేపర్లు ఉంటాయి. ఇందులో ఫండమెంటల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ మేనేజ్మెంట్, ఫౌండేషన్ ఆఫ్ అకౌంటెన్సీ, ఫౌండేషన్ అఫ్ లాస్ అండ్ ఎథిక్స్, ఫౌండేషన్ ఆఫ్ బిజినెస్ మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ ఉన్నాయి. ప్రతి పేపర్‌లో 100 మార్కులు ఉండగా.. కనీసం 40 మార్కుల చొప్పున.. అలాగే నాలుగు పేపర్‌లలో 200 మార్కులు సాధిస్తేనే అర్హత సాధించినట్టుగా పరిగణిస్తారు.

సిఎంఎ ఫౌండేషన్ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు తదుపరి సిఎంఎ కోర్సు(మూడేళ్ళ అండర్ గ్రాడ్యుయేట్) చేసేందుకు అర్హులు. ఈ మూడేళ్లు పూర్తి చేసుకున్న తర్వాత చార్టెడ్ అకౌంటెంట్ దగ్గర పనిచేసేందుకు అవకాశం ఉంటుంది. సిఏ దగ్గర పనిచేసే వారికీ ఏడాదికి రూ.7 లక్షల వరకు ప్యాకేజీ పొందే అవకాశం ఉంటుంది. సిఎంఎ ఫౌండేషన్ పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అభినందించారు. భవిష్యత్తులో ఇంకా మంచి ర్యాంకులు సాధించి గొప్ప స్థాయిలో స్థిరపడాలని మంత్రి విద్యార్థులను ఆశీర్వదించారు. విద్యార్థులు మున్ముందు సిఎంఎ గ్రాడ్యుయేట్ కోర్సు ని విజయవంతంగా పూర్తి చేసుకొని సిఏగా మంచి ప్యాకేజీతో స్థిరపడాలని సొసైటీ సెక్రటరీ అలగు వర్షిణి విద్యార్థులను ఆశీర్వదించారు. మరింత మంది విద్యార్థులను ఈ రంగంలో నిష్ణాతులను చేయడానికిగాను ఈ విద్య సంవత్సరం నుండి ఇబ్రహీంపట్నం, సరూర్ నగర్ ఫౌండేషన్ సిఓఈల్లో 480 మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని అందించనున్నట్టు కార్యదర్శి స్పష్టం చేశారు.

## పాలన వైఫల్యాలను తప్పించుకునేందుకు సిఎం రేవంత్ ఢిల్లీ యాత్రలు

### బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి



**హైదరాబాద్, జులై 10 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటిమాటికీ ఢిల్లీకి వెళ్లి తెలంగాణ రాష్ట్రం కోసం, ప్రజల కోసం శ్రమిస్తున్నామని చెబుతు న్నారు, కానీ ఇక్కడ చేయవలసిన పనులు చేయకుండా, తన పాలనా వైఫల్యాల నుండి ప్రజల దృష్టి మరల్చడానికి ఢిల్లీ యాత్రలు చేస్తున్నారని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి, యూరియా కొరత ఉందని కేంద్ర మంత్రిని కలిసి ఫిర్యాదు చేశారు. నిజంగా మన రాష్ట్రంలో ప్రజలకు లేదా రైతులకు అవసరాలు, కొరతలు ఉంటే కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం తప్పనిసరి. కానీ ఈ యూరియా కొరత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తాను ఏమి చేసిందో స్పష్టత ఇవ్వాలి అన్నారు. కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం వర్షాకాలం సీజన్‌తో పోలిస్తే, ఈ ఏడాది తెలంగాణకు 12.4 శాతం అధికంగా యూరియా సరఫరా చేసిందని, ఇది రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారమే అన్నారు. అయితే, రాష్ట్రంలో యూరియా కొరత ఎలా వచ్చింది? దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా యూరియా కొరత లేదు. అదే దేశవ్యాప్తంగా యూరియా కొరత లేనప్పుడు, తెలంగాణలో మాత్రం ఎందుకు ఉందో సిఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. యూరియా కొరత, బ్లాక్ మార్కెట్, అవకతవకలు, షాపుల వద్ద లైన్లు, దోపిడీలు, డ్రగ్స్, నల్ల మందు, భూకబ్జాలు, కల్తీ కల్లు, ఇవన్నీ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే జరుగుతాయన్నారు. ఈ వర్షాకాలం సీజన్‌లో యూరియాను రైతులు ముఖ్యంగా నాట్లు వేసిన తర్వాత మొదటి కలుపు తీసిన సమయంలో ఉపయోగిస్తారన్నారు. అదిలాబాద్ నుంచి యూరియా లారీలను దొంగతనంగా తరలిస్తుండగా, స్థానిక రైతులు ఫిర్యాదు చేయడంతో అధికారులు పట్టుకున్నారు. అంటే ఇలాంటి ఘటనలు మిగతా ప్రాంతాల్లో ఎన్ని జరుగుతున్నాయో ఎవరికీ తెలియదు. ఇదంతా చూస్తుంటే, యూరియా సరఫరాలో జరుగుతున్న తప్పిదాలపై చర్యలు తీసుకోవాల్సి న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి సింపుల్‌గా కేంద్ర ప్రభుత్వంపై నిందలు మోపడం దారుణంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం గత ఏడాదితో పోలిస్తే ఈసారి 12.4 శాతం యూరియా సరఫరా చేసింది. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి అవసరాలకు అదనంగా యూరియా సరఫరా చేసిందన్నారు. అయితే పలు ప్రాంతాల్లో కేంద్రం 266 రూపాయలకు ఇచ్చే యూరియాను 280, 300, 320 రూపాయలకు అమ్ముతున్నారు. ఇది బ్లాక్ మార్కెటింగ్ కాదా? అన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు క్రాప్ లోన్‌పై 3 వడ్డీ రాయితీ ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 4 శాతం ఇవ్వాల్సి ఉంటుంది. కానీ అది కూడా ఇవ్వడం లేదన్నారు. ఒకవేళ కేంద్ర-రాష్ట్ర రెండు వడ్డీ రాయితీలుంటే, రైతులు ఏడాది లోపు చెల్లిస్తే, రుణం పూర్తిగా జిరో వడ్డీతో లభిస్తుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యం లేకపోవడంతో రైతులకు అది కూడా అందడం లేదని దుయ్యబట్టారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

### ప్రైవేటు స్కూళ్లన్నీ రెండో శనివారం సెలవు ఇవ్వాలి

### పాఠశాల విద్య డైరెక్టర్‌కు విద్యార్థి, యువజన సంఘాలు విజ్ఞప్తి

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలిలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ), తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ (టిపిటిఎల్ఎఫ్) డిమాండ్ చేశాయి. రాష్ట్రంలోని అన్నీ ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ రెండవ శనివారం తప్పకుండా సెలవు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సంఘాలు గురువారం పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్‌కి విజ్ఞప్తి చేశాయి.

డైరెక్టర్‌ని కలిసిన వారిలో టిపిటిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఏ విజయ్ కుమార్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు, అధ్యక్షులు రజనీ కాంత్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, అధ్యక్షుడు కోట రమేష్, టిపిటిఎల్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్య క్షులు కొమ్ము విజయ్, డి సైదులు, పి.విజయ్, ఎస్ ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర కిరణ్, డివైఎఫ్ఐ నాయకులు హాష్మీ ఉన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం అయినప్పటికీ విద్యార్థులకు ఇప్పటికీ పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్(ఒక్క జత మాత్రమే అందించారు) అందించలేదని.. వాటిని పంపిణి చేయాలని నాయకులు డైరెక్టర్‌ని కోరారు. ఉర్దూ మీడియం, కన్నడ, మరాఠీ మీడియం పాఠ్యపుస్తకాలు కూడా ఇంకా అంద లేదన్నారు.

మధ్యాహ్నం భోజనానికి నిధులు కూడా సరిపడా ఇవ్వడం లేదని.. రన్నింగ్ వాటర్ సౌకర్యం లేదని. శానిటరీ నాప్ కిన్ అందించ లేదన్నారు. అన్నీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రతి నెల రెండవ శనివారం సెలవు ఇవ్వాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ.. ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ సెలవు ఇవ్వడం లేదన్నారు. రెండవ శనివారం సెలవు ఇవ్వకుండా అటు విద్యార్థులను, ఇటు టీచర్లను వేధిస్తున్న పరిస్థితి ఉందని కాబట్టి రెండో శనివారం సెలవు దినం తప్పక అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఫీజులు దందా కొనసాగు తుందని.. ఎల్‌కెజి నుండే లక్షలాది రూపాయలు వసూళ్లు చేస్తున్నారని.. ఫీజులపై నియంత్రణ లేదని, ఫీజులను నియంత్రణ చేయాలన్నారు. పాఠ్యపుస్తకాలు ఓపెన్‌గా దుకాణం పెట్టి మరి అమ్ముతున్నారని.. వాటిని పర్యవేక్షణ చేసి చర్యలు తీసీకోవడంలో అధికారులు విఫలం చెందు తున్నారని మండిపడ్డారు. పేద విద్యార్థులకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో 25 శాతం ఉచితంగా విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రవేశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్య డైరెక్టర్‌కి విజ్ఞప్తి చేశారు.

## మంత్రి ఉత్తమ్‌కు నాన్‌బెయిలబుల్ నోటీసులు

### 16న హాజరు కావాలని నాంపల్లి కోర్టు ఆదేశాలు

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన కేసులో విచారణకు హాజరుకాకపోవడంతో నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు రాష్ట్ర నీటపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికు నాన్ బెయిలబుల్ నోటీసులు జారీ చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ సభలు నిర్వహించి, ట్రాఫిక్ జామ్ చేసిన నేపథ్యంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అయితే, కేసులో విచారణకు ఉత్తమ్ హాజరు కాకపోవడంతో తాజాగా ఆయనపై నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అదేవిధంగా తదుపరి విచారణ ఈ నెల 16కు వాయిదా వేస్తూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తప్పకుండా విచారణకు హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

## పోడు భూముల సాగుకు సహకరించని అటవీ అధికారులు

### నెన్నెల మండలంలో రూ.30 కోట్లతో రోడ్లు

### బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** పోడు భూముల సాగుకు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ నుంచి సహకారం ఉండటం లేదని, మంత్రి కొండ సురేఖ చొరవ తీసుకోవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. గాంధీభవన్‌లో ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కుమార్ ప్రజాప్రతినిధుల కార్యక్రమంలో హాజంయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ ఆదేశాల ప్రకారం ప్రజా ప్రతినిధుల కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. ప్రతిరోజూ ప్రజా ప్రతినిధుల (ప్రజా వినియోగం) బృహత్తర కార్యక్రమం చేపట్టినందుకు ముఖ్యమంత్రికి, పిసిసి చీఫ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజావినతులపై ఆయా శాఖల అధికారులతో మాట్లా డి సమస్యల పరిష్కారానికి కృషి చేశామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజా సమస్యల కోసం పాటుపడుతోందని చెప్పారు. ప్రజా సంక్షేమం ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజాపాలన ఉంటుంది అని తెలిపారు. ఇచ్చిన హామీల అమలుకు అనుగుణంగా రేవంత్ ,మంత్రుల బృందం కృషి చేస్తోందని చెప్పారు.. ప్రజాభవన్ కేంద్రంగా సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కాళేశ్వరం, కృష్ణా నీళ్లకు సంబంధించి వాస్తవాలను వివరించే ప్రయత్నం చేశారు. బెల్లంపల్లిలో ఉగ్గ టెంపుల్‌కి రోడ్డు వేయించిన ఘనత కాంగ్రెస్ పార్టీదని ఆయన వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో గతంలో ఎన్నడూలేని విధంగా నెన్నెల్ మండలంలో రూ.30 కోట్లతో రోడ్లు వేశామని అన్నారు. కాశిపేట మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముం దుకెళ్తున్నామని అన్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ ప్రత్యేక నిధుల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్నవించామన్నారు.

## ట్రాఫిక్ నిబంధనల పేరుతో యువతకు చలానా వేయొద్దు

### ట్రాఫిక్ పోలీసులు వాహనదారులను వేధించవద్దు

### పిసిసి మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** ట్రాఫిక్ నిబంధనల పేరుతో యువతకు చలానా వేయవద్దని మాజీ పిసిసి అధ్యక్షుడు వి.హనుమంతరావు కోరారు. గాంధీభవన్‌లో గురువారం మీడియాతో హనుమంతరావు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం నమోదు చేసిన కేసులను కాంగ్రెస్ ప్రభుత్వం కొట్టివేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తల పాత్ర అధికంగా ఉందని కాంగ్రెస్ కార్యకర్తలపై నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలని కోరారు. స్థానిక పంచాయతీ, గ్రేటర్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు ఉన్నాయి.. పంచాయతీ ఎన్నికల్లో యువకుల పాత్ర ప్రముఖమైనదని వాహనాలపై వెళుతున్న యువతను ఆపి ట్రాఫిక్ పోలీసులు చీటికీ మాటికి చలాన్స్ వేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం చొరవ తీసుకుని సంబంధించిన పోలీస్ అధికారులకు సూచన చేయాలని ఆయన కోరారు. చలాన్స్ వేయకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ద్విచక్ర వాహనాలే లక్ష్యంగా చలాన్స్ వేస్తున్నారు. ఎన్నికల వేల చలాన్స్ పేరుతో యువకులను ఇబ్బంది పెట్టవద్దని సంయమనం పాటించాలని సూచించారు.



ఎసిబికి చిక్కిన డిప్యూటీ కలెక్టర్ రాజు, డిప్యూటీ తహసీల్దార్ సతీష్, డ్రైవర్ దుర్గయ్య

## ఎసిబి వలలో డిప్యూటీ కలెక్టర్‌సహా ముగ్గురు

**జహీరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** జహీరాబాద్ సమీపంలో ఏర్పాటవుతున్న నీమ్జ్‌లో భూములు కోల్పోయిన రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారం చెక్కులను ఇచ్చేందుకు జహీరాబాద్‌లోని నీమ్జ్ భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రాజు, డిప్యూటీ తహసీల్దార్ సతీష్, డ్రైవర్ దుర్గయ్యలు రైతు నుంచి డబ్బులు డిమాండ్ చేసూత బాధితుల నుంచి లంచం తీసుకుంటుండగా గురువారం మధ్యాహ్నం ఏసీబీ అధికారులు వల పన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మెదక్ రీజియన్ ఏసీబీ డిఎస్పి సుదర్శన్ మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం... న్యాల్‌కల్ మండలంలోని హుసెల్లి గ్రామ పరిధిలోని ఒక రైతుకు సంబంధించిన మూడు ఎకరాల 21 గుంటల భూమి నీమ్జ్‌లో కోల్పోవడంతో సదరు రైతుకు 52 లక్షల నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించింది. అందుకు సంబంధించిన చెక్కును రైతుకు ఇచ్చేందుకు డిప్యూటీ కలెక్టర్ రాజు 50 వేల రూపాయలను, డిప్యూటీ తహసీల్దార్ సతీష్ 15వేల రూపాయలను లంచంగా తీసుకుంటుడగా పట్టుకున్నామన్నారు. దీప్తి కలెక్టర్‌కు ఇవ్వాల్సి న 50వేల రూపాయలను తన ఇంటి వద్ద ఇవ్వాలని బాధితుడికి తెలిపారని డిఎస్పి వివరించారు. సదరు బాధితుడికి సంబంధికి సంబంధించిన బంధువుల కేసును పరిష్కరించేందుకు డ్రైవర్ దుర్గయ్య లక్ష రూపాయలు డిమాండ్ చేశారని, డ్రైవర్‌ను సైతం పట్టుకున్నామన్నారు. డబ్బులు తీసుకున్నట్లు కెమికల్ పరీక్షలో తేలిందని డిఎస్పి వివరించారు. ముగ్గురిని అరెస్టు చేసి నాంపల్లిలోని ఎసిబి కోర్టులో హాజరు పరిచామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరికైనా లంచంగా డబ్బులు డిమాండ్ చేస్తే ఏసీబీ అధికారులను సంప్రదించాలని డిఎస్పి సూచించారు.

## కల్తీకల్లు ఘటన దారుణం

### అన్ని రంగాల్లో విఫలమైన ప్రభుత్వం

### బిజెపి ఒబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా స్తబ్దతకు గురైందని, కూకట్‌పల్లిలో జరిగిన విషాద ఘటన నిరూపిస్తుందని బిజెపి ఒబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ మండిపడ్డారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. హైదర్‌నగర్, ఇందిరానగర్, భాగ్యనగర్ కాలనీల పరిధిలోని కల్లు కాంపౌండ్‌లలో మత్తు, విష పదార్థాలు కలిపిన కల్లు విక్రయించారని, ఈ కల్తీకల్లు తాగిన వందల మంది అస్వస్థతకు గురయ్యారున్నారు. ఇప్పటికే ఐదుగురు మృతిచెందారని, పలువురు వాంతులు, కడుపునొప్పి వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. ఈ ఘటనలో బాధితులు రోజువారీ కూలీలే ఎక్కువ అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావుతో కలిసి నిమ్స్ ఆసుపత్రిలో బాధితుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నామని అన్నారు. చికిత్స పొందుతున్న వారిలో ఏడు మంది బాధితులకు కిడ్నీపై తీవ్ర ప్రభావం పడిందని, వారిలో కొంతమందికి డయాలసిస్ కంటిన్యూ చేయాల్సి న పరిస్థితి ఏర్పడిందన్నారు. డాక్టర్లు చెప్పిన వివరాల ప్రకారం, కల్లులో అధిక మోతాదులో ఆల్కహాల్‌తోపాటు హానికరమైన డ్రగ్‌లు అల్ప్రాజోలమ్, డయజెపామ్ వంటి కెమికల్స్ కలపడం వల్ల తీవ్ర అనారోగ్యానికి గురయ్యారని అన్నారు. అసలు ఈ మత్తుపదార్థాలు ఎక్కడి నుంచి వచ్చాయి? ఎవరు తెచ్చారు? ఎవరి అనుమతితో విక్రయించారు? ఇదంతా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియదంటే ప్రజలు ఎలా నమ్మాలి? అంటూ ప్రశ్నించారు. గంజాయి, డ్రగ్స్ దందా స్కూళ్ల దాకా వెళ్తున్న పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు. యువత డ్రగ్స్ బారిన పడు తుందని, బిఆర్ఎస్ హయాంలో ఈ దుష్పరిణామాలు మొదలై, ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో రెట్టింపు అయ్యాయన్నారు. వయసు పిల్లల నుంచి యువత వరకు డ్రగ్స్ బారిన పడుతున్నారని, కాలేజీలూ, స్కూళ్లవరకు ఈ కల్చర్ విస్తరిస్తుందన్నారు. రాష్ట్రంలో మత్తుపదార్థాల ప్రవాహం ఆపకుండా, మాఫియాలకు అనుకూలంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఇవన్నీ కేవలం వ్యాపారంగా కాకుండా, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆటలాడటమే. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నేతలకు తక్షణంగా డబ్బు సంపాదించాలన్న తపన మొదలైందన్నారు. కల్లు దుకాణాల పేరుతో కల్తీ మత్తు పదార్థాలు విక్రయించడం ఈ వ్యవస్థలో భాగంగా మారింది. ఈ మత్తు పదార్థాలు అల్ప్రాజోలం, డైజోపామ్ వంటి డేంజరస్ డ్రగ్స్. ఇవి ఎక్కడి నుంచి వచ్చాయి? ఫార్మా కంపెనీల నుంచి వచ్చినాయా? లైసెన్సులు ఎవరు ఇచ్చారు? ఎక్సైజ్, పోలీసు శాఖలు ఎందుకు మౌనంగా ఉన్నాయంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో ప్రతి శాఖలో లంచాలే ప్రమాణంగా మారి పోయాయి. ఇటీవల మహిళా అధికారులు లంచాల కేసుల్లో పట్టుబడుతున్నారుని, ప్రజల ప్రాణాలకు విలువ లేకుండా, ఏ వ్యాపారమైనా డబ్బులు వస్తే చాలని అధికార పార్టీ నడవడంలో స్పష్టంగా కనిపిస్తుందన్నారు. కాంగ్రెస్ అంటేనే దోపిడీ దాచుకునే పాలకుల పాలన. దేశంలో కర్ణాటక-తెలంగాణ దోపిడీకి ప్రధాన కేంద్రాలుగా మారిన రాష్ట్రాలుగా మారాయి.

## యూరప్ పర్యటనలో..
# భారత్ హాకీ జట్టు విక్టరీ
### ఐర్లాండ్‌పై 6-1 తేడాతో విజయం



**న్యూఢిల్లీ:** భారత పురుషుల హాకీ జట్టు హాకీ క్లబ్ ఆరంజేరూడ్‌లో ఐర్లాండ్‌పై 6-1 తేడాతో ఆధిపత్య విజయంతో తమ యూరప్ పర్యటనను ప్రారంభించింది. కనీసం ఒక్క అడుగు కూడా తప్పు చేయకుండా నాలుగు క్వార్టర్లలో భారత్ పూర్తి ప్రదర్శన కనబరిచింది. ఉత్తమ్ సింగ్ పురుషుల జట్టుకు గోల్ చేయడం ప్రారంభించగా, తరువాత అమన్‌దీప్ లక్రా జట్టు ఆధిక్యాన్ని పెంచాడు. దీని తర్వాత ఆదిత్య లాలేజ్ వరుసగా గోల్స్ చేయడంతో అద్భుతమైన బ్రేస్‌ను సాధించాడు. ఫార్వర్డ్ ఆటగాళ్లు సెల్వం కార్తీ మరియు బాబీ సింగ్ ధామి కూడా ఒక్కొక్క గోల్ చేసి స్కోరు షీట్‌లో చోటు సంపాదించారు. భారత్ తమ డిఫెండింగ్‌లో పటిష్టంగా ఉండటంతో ఐర్లాండ్ ఒక ఓదార్పు గోల్ మాత్రమే చేయగలిగింది. కాగా యూరప్ పర్యటనలో ఐర్లాండ్ తర్వాత భారత్ తదుపరి ఫ్రాన్స్, ఇంగ్లాండ్, బెల్జియం మరియు ఆతిథ్య నెదర్లాండ్స్‌తో తదుపరి రెండు వారాల పాటు ఆడుతుంది. ఈ పర్యటనతో, హాకీ ఇండియా భారత పురుషుల జాతీయ జట్టు కోసం ప్రతిభ సమూహాన్ని బలోపేతం చేయడం మరియు తదుపరి తరం భారత హాకీ స్టార్‌లకు అంతర్జాతీయ మ్యాచ్ సమయాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకుంది.

## యుఎస్ స్మాష్ టేబుల్ టెన్నిస్‌లో..
# క్వార్టర్ ఫైనల్స్‌కు మానవ్-మనుష్
### సింగిల్స్‌లో శ్రీజ, సత్యన్ నిష్క్రమణ




**న్యూఢిల్లీ:** యుఎస్ స్మాష్ 2025 ప్రారంభ ఎడిషన్‌లో భారత నంబర్ 1 పురుషుల డబుల్స్ జోడీ మానవ్ ఠక్కర్ మరియు మనుష్ షా క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. అమెరికాలోని లాస్ వెగాస్‌లోని ఓర్లీన్స్ అరీనాలో జరిగిన ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో క్రొయేషియాకు చెందిన టోమిస్లావ్ పుకార్ మరియు స్లోవేనియాకు చెందిన లుబోమిర్ పిస్తేజ్ మిక్స్‌డ్ జోడీపై భారత ద్వయం 4గేమ్‌ల (12-14, 11-9, 11-8, 11-7) తేడాతో విజయం సాధించింది. వారు ఇప్పుడు క్వార్టర్ ఫైనల్స్‌లో నాల్గవ సీడ్ దక్షిణ కొరియా జంట లిమ్ జోంగ్‌హూన్ మరియు అన్ జేహ్యున్‌తో తలపడనున్నారు. కాగా డబ్ల్యూటీటీ గ్రాండ్ స్మాష్ ఈవెంట్‌లో తమ తొలి సెమీఫైనల్ ప్రదర్శనను భారత్ జోడీ లక్ష్యంగా పెట్టుకుంది. తదుపరి దియా చిటాలేతో జతకట్టిన మనుష్, ప్రపంచ పతక విజేత హాంకాంగ్ జంట వాంగ్ చున్ టింగ్-దూ హోయ్ కెమ్ చేతిలో తీవ్రంగా పోరాడిన ఐదు గేమ్‌ల (3-11, 7-11, 11-5, 11-4, 7-11) మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఓడిపోయారు. రెండు ఆటలలో వెనుకబడిన భారత జంట అద్భుతమైన పునరాగమనం చేసి నిర్ణయాత్మక జట్టును నిలబెట్టింది. కానీ చివరికి, అనుభవజ్ఞులైన హాంకాంగ్ జంట చివరి ఆటలో వ్యూహాత్మక విజయంతో భారతీయులను అధిగమించింది. ఇక రెండో రౌండ్‌లో ముగిసిన భారత సింగిల్స్ ప్రచారం పురుషుల సింగిల్స్‌లో సత్యన్ జ్ఞానశేఖరన్ మరియు మహిళల సింగిల్స్‌లో శ్రీజ అకుల ఇద్దరూ తమ తమ మ్యాచ్‌ల్లో ఓడిపోవడంతో భారత సింగిల్స్ ప్రచారం రెండో రౌండ్‌లో ముగిసింది. సాథియాన్ తొలి గేమ్ గెలిచినప్పటికీ, నాలుగు గేమ్‌లలో చైనాకు చెందిన పెంగ్ జియాంగ్ చేతిలో ఓడిపోయింది, శ్రీజ తన వరుస గేమ్ రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌అప్‌లో జపాన్ ప్యాడ్లర్ హునోకా హాషిమోటో చేతిలో ఓడిపోయింది.

## మహిళల తొలి టి20లో..
# భారత్ సూపర్ విక్టరీ
### ఇంగ్లండ్‌పై 6 వికెట్ల తేడాతో గెలుపు




**న్యూఢిల్లీ:** తొలి టీ20 సిరీస్‌లో ఇంగ్లండ్‌పై భారత మహిళలువిజయాన్ని నమోదు చేశారు. మాంచెస్టర్‌లో జరిగిన ఐదు మ్యాచ్‌ల నాల్గవ టీ20 సిరీస్‌లో ఇంగ్లాండ్‌పై 6 వికెట్ల తేడాతో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. ఇంగ్లండ్‌పై 3-1 తేడాతో భారత మహిళా క్రికెట్ జట్టు టీ20లో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. ఈ సిరీస్‌లో ఇంకా ఒక ఆట మిగిలి ఉండగానే ఈ విజయం సాధించింది. దాదాపు రెండు దశాబ్దాల టీ20 క్రికెట్ ప్రయాణంలో ఈ విజయం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇక ఈ సిరీస్ అంతటా భారత స్పిన్నర్లు తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు, ఇంగ్లాండ్‌ను 126 పరుగులకే పరిమితం చేశారు. ఆ తర్వాత భారత బ్యాటర్లు కేవలం 17 ఓవర్లలోనే 4 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించారు. ఆతిథ్య జట్టు టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. ఇంగ్లీష్ ఓపెనర్ సోఫియా డంక్లీ ప్రారంభంలోనే రెండు బౌండరీలతో భారత్‌పై ఒత్తిడి పెంచడం ప్రారంభించింది. కానీ ఆరో ఓవర్‌లో స్టార్ ఇండియన్ బౌలర్ దీప్తి శర్మ ఆమె ఇన్నింగ్స్‌ను తగ్గించింది. రెండు వికెట్లు త్వరగా కోల్పోయిన తర్వాత, కెప్టెన్ టామీ బ్యూమాంట్ మరియు ఆలిస్ కాప్సే భాగస్వామ్యాన్ని నిర్మించడం మరియు ఆట వేగాన్ని నియంత్రించడం ప్రారంభించారు. అయితే, భారత స్పిన్నర్లు వారి ప్రయత్నాలకు అడ్డుకట్ట వేశారు. 11వ ఓవర్లో వారి భాగస్వామ్యానికి చెక్ పెట్టి 17వ ఓవర్లో 7 వికెట్లకు 101 పరుగులకు అకస్మాత్తుగా పతనానికి కారణమయ్యారు. ఆల్ రౌండర్లు సోఫీ ఎక్లెస్టోన్ మరియు ఇస్సీ వాంగ్ ఏదో ఒకవిధంగా ఇంగ్లాండ్‌ను గౌరవప్రదమైన స్కోరుకు తీసుకెళ్లగలిగారు. ఇచ్చిన 20 ఓవర్లలో 126 పరుగులు చేశారు. 127 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత ఓపెనర్లు షఫాలీ వర్మ (31), స్మృతి మంధాన (32) 56 పరుగుల భాగస్వామ్యంతో బలమైన ఆరంభాన్ని అందించారు. తరువాతి 15 పరుగులలోపు ఇద్దరు ఓపెనర్లు వెనుదిరిగినప్పటికీ, వారు జెమిమా రోడ్రిగ్స్ మరియు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌లకు గట్టి పునాది వేశారు, వారు రెండు వికెట్లు ఆలస్యంగా కోల్పోయినప్పటికీ భారతదేశాన్ని విజయపథంలో నడిపించారు. ఇక ఈ నెల 12న జరిగే టీ20 సిరీస్‌లోని చివరి మ్యాచ్ కోసం భారత జట్టు బర్మింగ్‌హామ్‌కు బయలుదేరింది.



## ఆర్చరీ ప్రపంచ కప్ ఫైనల్స్‌కు
# భారత్ మహిళల జట్టు
### క్వార్టర్ ఫైనల్స్‌లో పురుషుల టీం ఔట్

**న్యూఢిల్లీ:** ఆర్చరీ ప్రపంచ కప్-2025 టోర్నమెంట్‌లో భారత మహిళల కాంపౌండ్ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. అంటాల్యలో నిరాశపరిచిన ప్రపంచ కప్ తర్వాత భారత కాంపౌండ్ ఆర్చర్లు తిరిగి ఫామ్‌లోకి వచ్చారు, స్పెయిన్‌లో జరిగిన మాడ్రిడ్ ఆర్చరీ ప్రపంచ కప్‌లో మహిళల జట్టు బంగారు పతక మ్యాచ్‌కు చేరుకున్నారు. జ్యోతి సురేఖ వెన్నం, ప్రితికా ప్రదీప్, పర్నీత్ కౌర్‌లతో కూడిన భారత త్రయం సెమీఫైనల్లో ఇండోనేషియాను 230-226 తేడాతో ఓడించి, ప్రపంచ కప్ సర్క్యూట్‌లో ఈ సీజన్‌లో రెండవ ఫైనల్ ప్రవేశాన్ని నిర్ధారించుకుంది. అంతకుముందు, భారత్ ర్యాంకింగ్ రౌండ్‌లో అద్భుతమైన 2116 పాయింట్లను నమోదు చేసి చార్టులలో అగ్రస్థానంలో నిలిచింది. ఇక మొదటి రౌండ్ ఎలిమినేషన్లలో బైను పొందింది. ఆ తర్వాత, క్వార్టర్ ఫైనల్స్‌లో తమ ప్రచారాన్ని ప్రారంభించిన ఈ బృందం 235-226 విజయంతో ఎల్ సాల్వడార్‌పై ఆధిపత్యం చెలాయించారు. కాగా భారత పురుషుల కాంపౌండ్ జట్టు వరుసగా రెండోసారి ప్రపంచ కప్ పతకాన్ని కోల్పోయింది, క్వార్టర్ ఫైనల్‌లో ఫ్రాన్స్ చేతిలో 233-234 స్కోరు చేసి ఒక్క పాయింట్ తేడాతో ఓడిపోయింది.

# వింబుల్డన్‌లో స్వియాటెక్ విజయం

**న్యూఢిల్లీ:** వింబుల్డన్-2025లో ఇగా స్వియాటెక్ వరుస విజయాలతో దూసుకుపోతోంది. ప్రపంచ 8వ సీడ్ క్రీడాకారిణి లియుడ్మిలా సామ్సోనోవాను 6-2, 7-5 తేడాతో ఓడించి తన కెరీర్‌లో తొలిసారిగా వింబుల్డన్ సెమీఫైనల్లో తన స్థానాన్ని బుక్ చేసుకుంది. ఐదుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ అయిన సామ్సోనోవాపై కమాండింగ్ ప్రదర్శనను ప్రదర్శించింది. ఆమె తొలిసారి మేజర్ క్వార్టర్ ఫైనలిస్ట్ అయిన సామ్సోనోవాపై ఆడింది.



19వ సీడ్ రష్యన్ క్రీడాకారిణిపై వరుసగా ఐదవ విజయాన్ని నమోదు చేయడానికి స్వియాటెక్ 1 గంటా 49 నిమిషాలు పట్టింది. డబ్ల్యూటీఎ ప్రకారం ఆమె అజేయమైన హెడ్ టు హెడ్ రికార్డును 50కి పెంచుకుంది. ప్రపంచ నంబర్ 1గా మొత్తం 125 వారాలు గడిపిన స్వియాటెక్, ఇప్పుడు నాలుగు గ్రాండ్ స్లామ్‌లలోనూ సెమీఫైనల్‌కు చేరుకున్న నాల్గవ క్రియాశీల క్రీడాకారిణిగా నిలిచింది. అరినా సబలెంకా, విక్టోరియా అజరెంకా, కరోలినా ప్లిస్కోవా తర్వాతి స్థానంలో నిలిచింది. అలాగే 23 ఏళ్ల పోల్ ఈ సంవత్సరం 8-1 తేడాతో ఫైనల్ చేరుకుంది. ఈ సంవత్సరం, ఆమె రెండు వారాల క్రితం బాడ్ హోంబర్గ్‌లో జరిగిన తన మొట్టమొదటి గ్రాస్‌కోర్ట్ ఫైనల్‌కు చేరుకుంది. జెస్సికా పెగులాతో రన్నరప్‌గా నిలిచింది. తొలి గేమ్‌లో బ్రేక్ పాయింట్‌ను సేవ్ చేసుకుని, మొదటి సెట్‌ను ఆధిపత్యం చేయడంతో పాటు స్వియాటెక్ బలంగా ప్రారంభమైంది. ఆమె తన ఫస్ట్ సర్వ్ పాయింట్లన్నింటినీ గెలుచుకుంది. రెండుసార్లు సామ్సోనోవాను బ్రేక్ చేసి 6-2తో కైవసం చేసుకుంది. రెండవ సెట్‌లో, స్వియాటెక్ 6-2, 4-2, 40-0తో ఆధిక్యంలో ఉంది, కానీ సామ్సోనోవా ఆలస్యంగా పునరాగమనం చేసి 5-5తో సమం చేసింది. కానీ స్వియాటెక్ తిరిగి 5-5తో సర్వ్ చేస్తూ, ఆమె 0-30తో వెనుకబడినప్పటి నుండి దృఢంగా నిలిచింది, తర్వాత తదుపరి గేమ్‌లో సామ్సోనోవాను ఓడించి విజయాన్ని సాధించింది. ప్రపంచ నంబర్ 1 అరినా సబలెంకా జర్మనీకి చెందిన లారా సీజ్‌మండ్ నుండి బలమైన సవాలును ఎదుర్కొని మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో చోటు దక్కించుకుంది. మరో మ్యాచ్‌లో, క్వార్టర్ ఫైనల్ పోరులో అనస్తాసియా పావ్లియుచెంకోవాను 6-1, 7-6(9) తేడాతో ఓడించి చివరినాలుగు దశలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది.

# టాటా కన్సల్టెన్సీ నికర లాభం రూ.12,760కోట్లు

**ముంబై, జులై 10:** ఐటీ దిగ్గజం టిసిఎస్ 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం ఫలితాలను గురువారం ప్రకటించింది. ఏకీకృత నికర లాభంలో 6 శాతం పెరిగి కంపెనీ నికర లాభం 12,760 కోట్లుగా నమోదైంది. గతేడాదితో పోలిస్తే, ఏకీకృత నికర లాభం 4.4 శాతం పెరిగింది. కార్యకలాపాల నుండి ఏకీకృత ఆదాయం వార్షిక ప్రాతిపదికన (సంవత్సరానికి) 1.3 శాతం స్వల్పంగా పెరిగి 63,437 కోట్లకు చేరింది. గత యేడాది ఇదే కాలంతో పోలిస్తే, 64,479 కోట్ల నుండి 1.6 శాతం తగ్గింది. మార్కెట్ నిపుణులు రూ.64,342.93 కోట్లుగా అంచనా వేశారు. ఒక రూపాయి ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేరుకు 11 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. చెల్లింపుకు అర్హత కలిగిన వాటాదారులను నిర్ణయించడానికి కంపెనీ జూలై 16, 2025ని రికార్డు తేదీగా నిర్ణయించింది. విభాగాల వారీగా, ఇంధనం, వనరులు మరియు యుటిలిటీలు




స్థిరమైన కరెన్సీలో 2.8 శాతంతో సంవత్సరానికి అత్యధిక వృద్ధిని నమోదు చేశాయి, తరువాత సాంకేతికత మరియు సేవలు 1.8 శాతం వృద్ధిని నమోదు చేశాయి. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగం 1.0 శాతం స్వల్ప పెరుగుదలతో స్థిరంగా ఉంది. దీనికి విరుద్ధంగా, లైఫ్ సైన్సెస్ మరియు హెల్త్‌కేర్ మరియు కమ్యూనికేషన్ మరియు మీడియా రెండూ ఒక్కొక్కటి 9.6 శాతం పదునైన క్షీణతను చవిచూశాయి.

# సెకండాఫ్‌లో ఐపిఓల సందడి..

**ముంబై, జులై 10:** ప్రైమరీ మార్కెట్‌లో ఈ యేడాది ఇప్పటి వరకు ఐపిఒల సందడి పెద్దగా లేదనే చెప్పాలి. మార్కెట్ ఒడుదుడుకుల కారణంగా ఈ కేలండర్ ఇయర్‌లో తొలి అర్ధ భాగంలో పరిమిత సంఖ్యలోనే కంపెనీలు పబ్లిక్‌ఇష్యూకు వచ్చాయి. అందులోనూ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకుకు చెందిన హెచ్‌డిబి ఫైనాన్షియల్ రూ.12,599కోట్ల ఐపిఒ మినహా చెప్పుకోదగ్గవి ఏవీ మార్కెట్లోకి రాలేదు. ఈ యేడాది ద్వితీయార్థంలో మాత్రం పెద్ద పెద్ద కంపెనీలు ఎంట్రీ ఇవ్వనున్నాయి. మొత్తంగా 50కిపైగా కంపెనీలు సుమారు రూ.1.50 లక్షల కోట్లు మార్కెట్ నుంచి సమీకరించనున్నాయని జెఫ్రీస్ ఫైనాన్షియల్ గ్రూప్ అంచనా వేస్తోంది. సెకండాఫ్‌లో రానున్న ఐపిఒల జాబితాలో టాటా కేపిటల్ లిమిటెడ్, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ, నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్, ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇండియా, మీషో, గ్రో ఇన్వెస్ట్‌మెంట్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్, లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ వంటివి ఈ జాబితాలో ఉన్నాయి. ఈ యేడాది తొలి అర్ధభాగంలో కేవలం




24 ఐపిఒలు మాత్రమే ఐపిఒకు వచ్చాయి. అంతకు ముందు యేడాది ఇదే సమయంలో 91 సంస్థలు పబ్లిక్ ఇష్యూకు రావడం విశేషం. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు, ఆర్‌బిఐ వడ్డీరేట్ల తగ్గింపు వంటివి మార్కెట్‌లో కొత్త ఉత్సాహానికి కారణమని జెఫ్రీస్ పేర్కొంది. టాటా గ్రూప్‌నకు చెందిన టాటా కేపిటల్ ఈ యేడాది చివరికి ఐపిఒకు రావొచ్చు. మార్కెట్ నుంచి దాదాపు రూ.17,200 కోట్లు సమీకరించనుందని అంచనా. దక్షిణ కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇండియా కూడా రూ.15వేల కోట్లు సమీకరించేందుకు పబ్లిక్ ఇష్యూకు రానుంది. ప్రమోటర్లు తమ వాటాలను విక్రయించనున్నారు. కళ్లజోళ్ల తయారీ సంస్థ లెన్స్‌కార్ట్ కూడా సుమారు రూ.8,600 కోట్లు మార్కెట్ నుంచి సమీకరించనుంది. ఇవికాకుండా హీరో ఫిన్‌కార్ప్ రూ.3,408 కోట్లు, జెఎస్‌డబ్ల్యూ సిమెంట్ రూ.4వేల కోట్లు, ఎస్‌ఎస్‌డిఎల్ రూ.3,421 కోట్లు సమీకరించేందుకు ఐపిఒకు వచ్చేందుకు సన్నద్ధమవుతున్నాయి.

# మరోసారి ఎల్‌ఐసిలో వాటాల విక్రయం

**న్యూఢిల్లీ, జులై 10:** ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసి) కేంద్ర ప్రభుత్వం మరోసారి తన వాటాను విక్రయించనుంది. పెట్టుబడుల ఉపసంహరణ విభాగం దీనిపై పనిచేస్తోందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఎల్‌ఐసిలో కేంద్రానికి ప్రస్తుతం 96.5శాతం వాటా ఉంది. 2022 మే నెలలో ఐపిఒలో భాగంగా 3.5శాతం వాటాను కేంద్రం విక్రయించింది. ఒక్కో షేరుకు ధరల శ్రేణిని రూ.902-949గా పేర్కొంది. తద్వారా రూ.21వేల కోట్లు ఖజానాకు సమకూరాయి. ఈ నేపథ్యంలో ఎల్‌ఐసిలో ఆఫర్ ఫర్ సేల్ రూపంలో తదుపరి వాటా విక్రయానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కూడా పేర్కొన్నాయి. ప్రస్తుతానికి ఈ చర్చలు ఇంకా ప్రారంభ దశలో ఉన్నాయని తెలిసింది. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వాటా విక్రయ ప్రక్రియను పెట్టుబడుల ఉపసంహరణ విభాగం పూర్తి చేయనుంది.




2027 మార్చి 16 నాటికి పబ్లిక్ షేర్ హోల్డింగ్‌ను 10శాతం ఉండాలన్న నిబంధనను చేరుకోవడంలో భాగంగా మరో 6.5శాతం వాటాను కేంద్రం విక్రయించాల్సి ఉంటుంది. అయితే ఎంత మేర వాటా విక్రయిస్తారు? ఎంత ధరకు విక్రయిస్తారు? ఎప్పుడు విక్రయిస్తారు? అనేవివరాలు కూడా తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ఎల్‌ఐసి మార్కెట్ విలువ రూ.5.85 లక్షల కోట్లుగా ఉంది.

# వందేళ్లయినా ఎఐ ఈ పని చేయలేదు: బిల్‌గేట్స్ ఆసక్తికర వ్యాఖ్యలు

**వాషింగ్టన్, జులై 10:** కృత్రిమ మేధతో ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతూనే ఉంది. అయితే వాటివల్ల కొత్త ఉపాధి అవకాశాలు లేకపోలేదనేది నిపుణుల మాట. ఈ అంశంపై తాజాగా మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే 100 యేళ్లయినా ప్రోగ్రామర్లను ఎఐ భర్తీ చేయలేదని అన్నారు. ఇక కోడింగ్‌కు కూడా మానవ మేధ అవసరమని అభిప్రాయపడ్డారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రోగ్రామింగ్ రంగంలో ఎఐ మనకు అసిస్టెంట్‌గా వ్యవహరిస్తుంది. డీబగ్గింగ్ లాంటి బోరింగ్ అంశాల్లో సాయం చేస్తుంది. అంతేగానీ, పూర్తిగా ప్రత్యామ్నాయంగా మారదు. ప్రోగ్రామింగ్‌లో అత్యంత సవాల్‌తో కూడుకున్నది ఏంటంటే, క్లిష్టమైన సమస్యను సృజనాత్మకంగా పరిష్కరించడం. దాన్ని మెషిన్స్ చేయలేవు. ప్రోగ్రామింగ్‌కు జడ్జిమెంట్, ఊహాత్మక ఆలోచనా ధోరణి, పరిస్థితులకు అనుకూలంగా సర్దుబాటు అవసరం. ఈ లక్షణాలు ఎఐలో లోపించాయి అని బిల్‌గేట్స్ అన్నారు. ఇక కోడింగ్ రాయడమంటే కేవలం టైపింగ్ చేయడం కాదు. చాలా లోతుగా ఆలోచించాల్సి ఉంటుందని బిల్‌గేట్స్ తెలిపారు. మానవ మేధకు ఉండే సృజనాత్మకతకు ఏ అల్గారిథమ్ సరిపోదు అని అభిప్రాయపడ్డారు. గతంలోనూ బిల్‌గేట్స్ ముప్పు తక్కువేనని ఆయన అంచనా వేశారు. సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, సృజనాత్మకత, పరిస్థితులకు తగ్గట్టుఆ సామర్థ్యాన్ని మెరుగుపర్చుకొనే లక్షణాన్ని ఎఐ ఇంకా సొంతం చేసుకోలేకపోవడమే ఇందుకు కారణమని నాడు చెప్పారు. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 8.5 కోట్ల ఉద్యోగాలను ఎఐ భర్తీ చేసే అవకాశం ఉందని ఇటీవల వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ అంచనా వేసింది. అదే సమయంలో 9.7 కోట్ల కొత్త ఉద్యోగాల సృష్టి జరగొచ్చని ఆశాభావం వ్యక్తం చేసింది. దీనిపైనా గేట్స్‌స్పందిస్తూ, ఎఐ వల్ల పొంచి ఉన్న ముప్పు గురించి తానూ ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు.



# నష్టాలను వీడని స్టాక్ సూచీలు

**ముంబై, జులై 10:** దేశీయ స్టాక్‌మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిసాయి. భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌పై సందిగ్ధత, మొదటి త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించారు. భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డిఎఫ్‌సి వంటి షేర్లు సూచీలపై ప్రభావం చూపాయి. దీంతో సూచీలు వరుసగా రెండోరోజూ నష్టాల్లో ముగిసాయి. ఉదయం 83,658.20 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైన కాసేపటికే నష్టాల్లోకి జారుకున్న సూచీ ఇంట్రాడేలో 83,134.97 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరింది. చివరికి 345.80 పాయింట్లు నష్టపోయి 83,190.28 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 120.85 పాయింట్లు క్షీణించి 25,355.25 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.85.67గా ఉంది. భారతీ ఎయిర్‌టెల్, ఏసియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, బిఇఎల్, టెక్ మహీంద్రా షేర్లు అమ్మకాలతో నష్టాల్లో ముగిసాయి. మారుతి సుజుకీ, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ట్రెంట్ షేర్లు లాభాల్లో ముగిసాయి.



అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 69.44 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3,331 డాలర్ల వద్ద కొనసాగింది.

# వాణిజ్యం

## 'మెటా'లో పనిచేయడం.. కేన్సర్ కంటే ప్రమాదం..

**వాషింగ్టన్, జులై 10:** ప్రముఖ టెక్ కంపెనీ మెటా సూపర్ ఇంటలిజెన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు ముమ్మరంగా ముందుకు సాగుతున్న తరుణంలో కంపెనీ మాజీ ఉద్యోగి చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారుతున్నాయి. కంపెనీలో ఉద్యోగం మానేసి బయటకు వస్తున్న సమయంలో అంతర్గతంగా ఆ ఉద్యోగి ఇ-మెయిల్ పంపించాడు. దీనిలో కంపెనీ కృత్రిమమేధ విభాగం గురించి తీవ్రమైన ఆందోళనలు లేవనెత్తారు. ది ఇన్ఫర్మేషన్‌లో టిజ్మెన్ బ్లాంకెవర్ట్ రాసిన కథనంలో మెటాలోని సంస్కృతిని సంస్థ అంతటా వ్యాపిస్తున్న 'మెటాస్టాటిక్ కేన్సర్'తో పోల్చాడు. మెటా ఎల్‌ఎల్‌ఎంఎ మోడళ్లపై పనిచేసే బృందంలక్ష బ్లాంకెవర్ట్ కూడా కొంత కాలం పనిచేశాడు. ఉద్యోగం నుంచి నిష్క్రమించే ముందు అతడు మెటా నాయకత్వాన్ని, అక్కడి పని విధానాన్ని విమర్శిస్తూ ఒక సుదీర్ఘ లేఖ రాశాడు. 'మెటాలో పని చేస్తున్నన్ని




రోజులు చాలా మంది ఉద్యోగులు ఎంతో నష్టపోయారు. అక్కడ భయంతో కూడిన సంస్కృతి ఉంది. తరచుగా పనితీరు సమీక్షలు, తొలగింపులు ఉద్యోగుల నైతిక స్థైర్యాన్ని, సృజనాత్మకతను దెబ్బతీశాయి. ప్రస్తుతం 2వేల మందికి పైగా బలంగా ఉన్న ఎఐ విభాగానికి దిశా నిర్దేశం కొరవడింది. చాలా మందికి మెటాలో పని చేయడం ఇష్టం లేదు. తమ మిషన్ ఏమిటో కూడా వారికి తెలియదు. పదే పదే అంతర్గత విభేదాలు, అస్పష్టమైన లక్ష్యాలు నిర్దేశిస్తారు. ఇది జట్టు నూతన ఆవిష్కరణల సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది. దీంతో పనిచేయక పోవడం మాత్రమే కాదు, మెటాస్టాటిక్ కేన్సర్‌లా ఇది సంస్థను ప్రభావితం చేస్తుంది' అని ఆయన అన్నారు. ఓపెన్ ఎఐ, గూగుల్ డీప్‌మైండ్ వంటి ప్రత్యర్థులను ఎదుర్కొనేందుకు మెటా తన ఎఐ కార్యకలాపాలను దూకుడుగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఆయన విమర్శలు గుప్పించారు. ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఎజిఐ) నిర్మాణంపై దృష్టిసారించే సూపర్ ఇంటెలిజెన్స్ ల్యాబ్స్ అనే కొత్త విభాగాన్ని కంపెనీ ఇటీవల సృష్టించింది. మెటా పరిశ్రమ అంతటా అగ్రశ్రేణి ప్రతిభావంతులను నియమించుకుంటోంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.